తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 06.09.2024 | సంపుటి : 11 సంచిక : 58 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698







2లో

కొత్త చట్టాల మేరకు
## తొలిశిక్ష విధింపు
ఘటన జరిగిన 48 రోజుల్లోనే హంతకులకు జీవిత ఖైదు

## కొణతం దిలీప్ అరెస్ట్
మండిపడ్డ కేటీఆర్ 2లో



హసీనాకు
## మౌనమే మంచిది
భారత్‌లో కూర్చొని ప్రకటనలు చేస్తే ఇరు దేశాల సంబంధాలు దెబ్బతింటాయి
మహమ్మద్ యూనస్ హెచ్చరిక
వార్త 2లో

# ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు హైదరాబాదే కీలకం
## దేశంలో ఏ ఇతర నగరమూ సరిపోదు : సీఎం రేవంత్



- ప్రపంచగతిని మార్చేస్తున్న సరికొత్త ఆవిష్కరణలు
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో పెనుమార్పులు
- కొత్త ఆవిష్కరణలతో ప్రజల జీవితాల్లో వెలుగులు
- ఎఐతో సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం
- గ్లోబల్ ఏఐ సదస్సులో పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి

హైదరాబాద్(జనంసాక్షి): సరికొత్త ఆవిష్క రణలు ప్రపంచాన్ని మార్చాయని తెలంగా ణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నేటి తరం అద్భుత ఆవిష్కరణ ఏఐ అని కొని యాడారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ లో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వ హించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హైదరా బాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయి. అవి ఆశలతో పాటు భయాన్నీ తీసుకొస్తాయి. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా లేదు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశాం. నాస్కామ్ సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుంది. ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోంది. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్య త్తును ఆవిష్కరిద్దాం అని పిలుపుని చ్చారు. రైల్ ఇంజిన్, టీవీ, కెమెరాతో

మిగతా 2లో..



'అగ్నిపథ్'పై ఒత్తిళ్లకు
# తలొగ్గిన కేంద్రం
## 50 శాతం మందిని రెగ్యులర్ చేసే దిశగా నిర్ణయం



దిల్లీ(జనంసాక్షి): కొన్ని నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్ని కల వేళ ఉత్తరాదిన చర్చకు వచ్చిన ప్రధా నాంశాల్లో అగ్నిపథ్ స్కీమ్ ఒకటి. త్రివిధ దళాల్లో నియామకాలకు సంబంధించి మోదీ సర్కారు తీసుకొచ్చిన ఈ స్కీమ్‌పై అప్పట్లో పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. కేంద్రంలో అధికార కూటమిలో భాగమైన జేడీయూ.. 'అగ్నిపథ్'ను సమీక్షించాలని డి మాండ్ చేసిన సంగతి తెలిసిందే. స్వపక్షం డి మాండ్లు, విపక్షం విమర్శల వేళ.. ఆ పథకం లో మార్పులు చేసే దిశగా కేంద్రం యోచి స్తున్నట్లు తెలుస్తోంది. రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ జాతీయమీడియా వెల్లడించింది. అగ్నిపథ్ ప్రస్తుత నిబంధనల ప్రకారం.. అగ్నివీరులుగా విధులు నిర్వర్తిస్తున్నవారు

మిగతా 2లో..

నామినేటెడ్ పోస్టుల భర్తీకి
# కాంగ్రెస్ కసరత్తు

- పార్టీ కోసం పనిచేసిన వారికే అందలం
- సామాజిక సమీకరణాలకూ ప్రాధాన్యం
- అర్హులతపై సీఎంతో చర్చించాకే నిర్ణయం



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించింది. మూడు కమిషన్లతో పాటు వీసీల నియామకం పూర్తి చేసేందుకు కస రత్తు కొనసాగుతోంది. ఇప్పటికే బీసీ, విద్య, రైతు కమిషన్ల ఛైర్మన్ల ఎంపిక పూర్తి కాగా స భ్యుల నియామకంపై కాంగ్రెస్ దృష్టి సారిం చింది. ఉన్నత విద్యామండలి ఛైర్మన్, విశ్వవి ద్యాలయాల వైస్‌ఛైర్మన్ల పదవుల భర్తీ కూడా పూర్తి చేయాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గా లు చెబుతున్నాయి.రాష్ట్రంలో భారీ వర్షాలు,

మిగతా 2లో..

కాలువలు,చెరువుల పునరుద్ధరణకు
# తక్షణమే టెండర్లు
## వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి • అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



మహబూబాబాద్(జనంసాక్షి): భారీ వర్షాల కు తెగిపోయిన చెరువుకట్టలు, కెనాల్స్ పునరుద్ధ రణకు వారం రోజుల్లో టెండర్లు పిలవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖాధికా రులను ఆదేశించారు. రాష్ట్రంలో సంభవించిన వర్షపు ఉధృతికి జరిగిన నష్టంపై గురువారం నా డు నీటిపారుదల శాఖాధికారులతో మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి జలసౌధలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులు, కాలువల పునరుద్ధరణతో పాటు పాక్షికంగా దెబ్బతిన్న చెరువులు, కాలువల మరమ్మతులకు కూడా టెండర్ల ప్రక్రియను తక్షణమే పూర్తి చేయా లన్నారు. వెంటనే పాలనాపరమైన అనుమతులు తీసుకుని శుక్రవారం ఉదయానికి ఆన్‌లైన్‌లో టెం డర్లు అప్‌డేట్ చెయ్యాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇంతటి వర్షపు ఉధృతిలోనూ విధుల్లో నిమగ్నమయి పనిచేసిన నీటిపారుదల శాఖా సిబ్బందిని ఆయన అభినందించారు. అయి తే అదే సమయంలో తాను స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు కొన్ని వాస్తవాలు వెలుగు చుశాయన్నారు.రెగ్యులేటరీలు, షట్టర్లు


మిగతా 2లో..

నెత్తుటి బాకీ
## త్వరలోనే తీర్చుకుంటాం
రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ విప్లవ ద్రోహుల పనే..
9న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంద్
భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ ప్రకటన

కొత్తగూడెం జిల్లా బ్యూరో/కరకగూడెం (జనంసాక్షి) రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ విప్లవ ద్రో హుల పనేనని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని భద్రాద్రి కొత్తగూ డెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ పేర్కొంది. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో.. మావో యిస్ట్ పార్టీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది ఒకటే ఎజెండా అని తెలిపింది. ఆపరేషన్

మిగతా 2లో..

భద్రాద్రి జిల్లాలో
# భారీ ఎన్‌కౌంటర్
## ఆరుగురు మావోయిస్టులు మృతి.. ఇద్దరికి గాయాలు • మృతుల్లో దళకమాండర్
తప్పించుకున్న కీలక నేత మాసయ్య • భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి మృత దేహాల తరలింపు

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, కరకగూడెం(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్ట్ లను ఏరి వేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్న పోలీస్ బలగాలు కీలక నేతలతో పాటు పెద్ద సంఖ్యలో మిలిషీయా సభ్యులను హతమరుస్తూ వారిని కోలుకోలేని దెబ్బ తీస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే ఛత్తీస్ ఘడ్ సరిహద్దుల్లో పది మందిని ఎన్కౌంటర్ చేసిన గ్రేహౌండ్స్ దళాలు గురు వారం భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన కరకుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉదయం ఏకంగా ఆరుగురునీ మట్టుబెట్టారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా వారిని స్థానికంగా ఉన్న మణు గూరు ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు పోలీ సులు కూడా గాయపడినట్లు తెలిసింది. పోలీ సుల కథనం ప్రకారం కరకుగూడెం మండలం మోతే గ్రామం వద్ద సాధారణ పెట్రోలింగ్ చేస్తున్న తరుణంలో నిషేధిత సిపిఐ మావోయి స్టులు ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అందిన

మిగతా 2లో..



ఏసోబు అంత్యక్రియల్లో..
## ఎరుపెక్కిన టేకులపల్లి
ఉద్యమ నినాదాల మధ్య రణదేవ్ దాదా అంత్యక్రియలు
భారీగా తరలివచ్చిన ప్రజాసంఘాల నేతలు

వరంగల్ బ్యూరో (జనంసాక్షి) : టేకులపల్లి గ్రామం ఎరుపెక్కింది. ఊరూ వాడ ఏకమై ఓరుగల్లు విప్లవ వీరుడికి కన్నీటి నివాళి పలికింది. అమర్ హే ఏసోబు అంటూ పెద్దపెట్టున నినాదాలతో

మిగతా 2లో..




అభివృద్ధి చెందుతున్న దేశాలకు
## సింగపూర్ ఓ నమూనా..
భారత్‌లోనూ ఈ తరహా నగరాల సృష్టి : ప్రధాని మోదీ

సింగపూర్(జనంసాక్షి): అభివృద్ధి చెందుతున్న దేశాలకు సింగపూర్ ఓ నమూనా అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్ కూడా స్వయంగా అనేక 'సింగ్‌పూర్'లను సృష్టించాలనుకుంటోందన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో చర్చలు జరిపారు. ఇది కేవలం ఇది భాగస్వామ్య దేశం కాదని.. అభివృద్ధి చెందుతోన్న దేశాలకు సింగపూర్ ఓ స్ఫూర్తి అని అభివర్ణించారు."భారత్‌లో అనేక సింగపూర్‌లను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీన్ని

మిగతా 9లో..


ప్రభుత్వ విద్యా సంస్థలకు
# ఉచిత విద్యుత్

- విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే స్కిల్ యూనివర్సిటీ
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్(జనంసాక్షి): విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు తగ ్గట్లుగా నిర్ణయాలు కూడా తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అలాగే విద్య నేర్పుతున్న గురువులకు ఈ ప్రభుత్వం అంతే ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 41 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవీంద్ర భారతిలో గురు పూజోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మొత్తం 27,862 ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తా మని ప్రకటించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ ఇవ్వా లని నిర్ణయం తీసుకుని జీవో విడుదల చేశా మని అన్నారు. రాష్ట్రంలో వరదల సమస్యల వల్ల సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజ రుకాలేకపోయారని తెలిపారు. 'ప్రస్తుత కంపెనీల అవసరాలకు అనుగుణంగా మన విద్యావ్యవస్థ లేదు. మన రాష్ట్ర విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే నైపుణ్య యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నాం. రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీ పడేలా

మిగతా 2లో..



## ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధం
భారత్, చైనా, బ్రెజిల్‌లు మధ్యవర్తిత్వం చేయాలి
ప్రకటించిన రష్యా అధ్యక్షుడు పుతిన్

మాస్కో(జనంసాక్షి):దాదాపు రెండున్నరేళ్లుగా ఎడతెరిపిలేని దాడులతో ఉక్రెయిన్‌ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రష్యా తాజాగా శాంతి చర్చల ప్రస్తావన తెచ్చింది.కీవ్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నామ న్నారు.భారత్, చైనా, బ్రెజిల్ దేశాలు మాస్కో–కీవ్ మధ్య శాంతి చర్చలకు మధ్యవర్తి త్వం వహిం చగలవని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వెల్లడించింది. ఇప్పటికే యుద్ధం మొదలైన తొలి వారంలోనే తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో కుదిరిన ప్రాథమిక ఒప్పందాన్ని ఉక్రెయిన్ అమల్లోకి తేలేదని ఆయన విమర్శించారు. ఆ ఒప్పందం

మిగతా 9లో..

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే
# ప్రవేశాలు



- ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో స్థానికతపై హైకోర్టు తీర్పు
- స్థానికత నిర్ధరణకు ప్రభుత్వం నిర్దిష్ట మార్గదర్శకాలు రూపొందించాలని ధర్మాసనం ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి స్థానికత వివాదంపై పూర్తిస్థాయి వాదనలను విన్న హైకోర్టు గురువారం తీర్పు వెలువరిం చింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిర్ధరణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వా నికి ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. కాళోజీ నారాయణ రావు వైద్య యూనివర్సిటీ విద్యార్థులకు ప్రవే శాలు కల్పించాలని ఆదేశించింది.మెడికల్ అడ్మిషన్ల నిబంధనలను సవరిస్తూ రూల్

మిగతా 2లో..

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ కేసు వాయిదా..
జిల్లా కోర్టు నుండి కేసీఆర్ సహా 8మందికి పంపిన నోటీసులు..
అందులో ఆరుగురి తరుపున హాజరైన అడ్వకేట్స్.


12లో

# 'అగ్నిపథ్'పై ఒత్తిళ్లకు తలొగ్గిన కేంద్రం

నాలుగేళ్ల తర్వాత విధుల నుంచి వైదొలగాల్సి ఉంటుంది. వారిలో 25 శాతం మందిని మాత్రమే రెగ్యులర్ సర్వీసుల్లోకి తీసుకుంటారు. అయితే ఇప్పుడు ఆ సంఖ్యను పెంచేదిశగా చర్చలు జరుగుతున్నాయని రక్షణశాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. నాలుగు సంవత్సరాల తర్వాత 50 శాతం మంది అగ్నివీరులను కొనసాగించాలని, వయోపరిమితిని 23 ఏళ్లకు పెంచాలని సైన్యం సిఫార్సు చేసిందని పేర్కొన్నారు. అలాగే జీతభత్యాల్లో మార్పులు చేయొచ్చని తెలుస్తోంది. ఈ పథకంలో మార్పులకు సంబంధించి ఆర్మీ ఇప్పటికే పలు ప్రతిపాదనలు కేంద్రానికి సమర్పించింది. సైన్యంలో అంతర్గతంగా సర్వేలను నిర్వహించి వీటిని రూపొందించింది."అగ్నివీర్‌లుగా నియమించినవారిలో కేవలం 25శాతం మందినే తిరిగి విధుల్లో కొనసాగించడం వల్ల సైనిక బలం తగ్గే అవకాశం ఉంటుంది. దీనిని నివారించడానికి మరి కొంతమందిని కూడా తిరిగి సర్వీస్‌లో చేర్చుకోవాలి. ఎంతో శ్రమపడి సైనికులకు శిక్షణ ఇచ్చినప్పుడు వారి సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలి" అని గతంలో నేవీ విశ్రాంత అధికారి కేబీ సింగ్ అన్నారు.త్రివిధ దళాల్లో నియామకాలకు సంబంధించి జూన్ 2022లో అగ్నిపథ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 17 నుంచి 21 సంవత్సరాల వయసున్న యువతీ యువకులు మాత్రమే అగ్నివీర్‌లుగా విధులు నిర్వహించేందుకు అర్హులుగా కేంద్రం పేర్కొంది. నాలుగేళ్లు ముగిసిన అనంతరం సర్వీస్ నుంచి తప్పుకొన్న అగ్నివీర్‌లకు పెన్షన్ సౌకర్యాలు ఉండవు. ఈ పథకంపై విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. మిగతా 75శాతం అగ్నివీర్‌ల పరిస్థితి ఏంటని ప్రశ్నించాయి. దాంతో మాజీ అగ్నివీరులకు రిజర్వేషన్ కల్పిస్తామని కేంద్ర బలగాలు పేర్కొన్న సంగతి తెలిసిందే. తద్వారా శిక్షణ పొందిన సిబ్బంది తమ బృందంలో చేరతారని బీఎస్ఎఫ్ చీఫ్ డైరెక్టర్ జనరల్ నితిన్ అగర్వాల్ పేర్కొన్నారు. వారికోసం 10శాతం రిజర్వేషన్ కల్పించనున్నామని తెలిపారు. తర్వాత పలు రాష్ట్రాలు కూడా వారి సేవలు వినియోగించే దిశగా ప్రకటనలు చేశాయి.

## కొణతం దిలీప్ అరెస్ట్

**హైదరాబాద్(జనంసాక్షి):** డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్ మీడియాలో దిలీప్ కొణతం తప్పుడు వార్తలను చూపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో దిలీప్‌ను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారు, పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదుపులోకి తీసుకున్న కొణతం దిలీప్‌ను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ అక్రమ అరెస్ట్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా పాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా..? అని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో కూడా చెప్పకుండా అరెస్ట్ చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. అక్రమ అరెస్ట్‌లు, నిర్బంధాలతో పాలన కొనసాగించవచ్చునుకుంటే అది మీ భ్రమే. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అక్రమ నిర్బంధాలు చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్లు మరింత మంది పుట్టుకొస్తారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్న దిలీప్‌ను తక్షణమే విడుదల చేయాలి. 9 నెలలుగా తెలంగాణలో వాక్ స్వాతంత్రం లేదు. నిరంకుశ పాలన సాగుతోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. దిలీప్ అక్రమ అరెస్టును జగదీశ్ రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొణతం దిలీప్‌ను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు.కొంతకాలంగా ప్రభుత్వ అసమర్థతను, చేతగానితనాన్ని దిలీప్ ప్రశ్నించడాన్ని రేవంత్ సర్కారు తట్టుకోలేకపోతోందన్నారు. కొన్ని రోజుల క్రితం కూడా తప్పుడు కేసులో ఇబ్బంది పెట్టాలని ప్రయత్నించగా హైకోర్టు చీవాట్లు పెట్టినా, బుద్ధి రాలేదని మండిపడ్డారు. ఎలాగైనా దిలీప్ గొంతు నొక్కాలన్న ఉద్దేశంతో మరోసారి అక్రమంగా అదుపు లోకి తీసుకున్నారు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా, ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో చెప్పకుండా అరెస్ట్ చేశారన్నారు

## నేడు తెలంగాణకు కేంద్రమంత్రి

**- వరద ప్రాంతాల్లో శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటన**

హైదరాబాద్(జనంసాక్షి):భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఆంధ్రా తెలంగాణలో రాష్ట్రాల్లో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ సూచనల మేరకు రెండు రోజుల పాటు ఆయన పర్యటన కొనసాగనుంది.ఇవాళ విజయవాడతో పాటు ఏపీలోని వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనకు శివరాజ్ వెళ్లనున్నారు. అనంతరం విజయవాడలో అధికారులతో సమావేశం కానున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టంపై అంచనాలు రూపొందించే అంశంపై కేంద్రమంత్రి పలు సూచనలు చేయనున్నారు.శుక్రవారం తెలంగాణలో శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాతో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ఇతర ప్రాంతాల్లోనూ ఆయన పర్యటన కొనసాగనుంది. రైతులతో ఆయన మాట్లాడి సమస్యలను తెలుసుకోనున్నారు.

## బెంగాల్‌లో విషాదం

**- 700 అడుగుల లోయలో పడిన వాహనం.. నలుగురు సైనికులు దుర్మరణం**

పాక్యోంగ్(జనంసాక్షి):బారత సైనికులు ప్రయాణిస్తున్న వాహనం ఘోర ప్రమాదానికి గురైంది. బెంగాల్‌లోని పెడాంగ్ నుంచి సిక్కింలోని జులుక్ వైపు వెళ్తుండగా వెర్టికల్ వీర్ అనే ప్రాంతం సమీపంలో వాహనం అదుపుతప్పి700 అడుగుల లోతైన లోయలో జారిపడింది.ఈ ఘటనలో నలుగురు సైనికులు దుర్మరణం చెందారు. సిల్క్ రూట్‌గా ప్రసిద్ధి చెందిన రెనోక్ రోంగ్లీ రాష్ట్ర హైవే వెంబడి దలోప్‌చంద్ దారా వద్ద ఈ ఘటన జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో మృతులను డ్రైవర్ ప్రదీప్ పటేల్ (మధ్యప్రదేశ్), క్రాఫ్ట్‌మన్ డబ్ల్యూ పీటర్ (మణిపూర్) నాయక్ గురుసేవ్ సింగ్ (హరియాణా), సుబేదార్ కె.తంగపాండి (తమిళనాడు)గా గుర్తించారు. వీరంతా బెంగాల్‌లోని బినాగురి యూనిట్‌కి చెందిన సైనిక సిబ్బంది అని సమాచారం.

# ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌కు హైదరాబాదే కేంద్రం

ప్రారంభమైన ఆవిష్కరణలు ఇప్పుడు ఆర్టిఫీషియల్ దాకా వచ్చాయిన సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. క్రమంగా టెక్నాలజీ పెరుగుతోంది.. ఎన్నికల ముందు డిక్లరేషన్ లో చెప్పినట్టే ఎఐ కి మొదటి ప్రాధాన్యత ఇస్తూ పెట్టబడి దారులను ఆహ్వానిస్తున్నామనం ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్ట డానికి ఎఐ రంగంలో పరిజ్ఞానం ఉన్నవారికి అవకా శాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం అన్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏఐ రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో ఏఐ అభివృద్ధికి చేపట్టే చర్యలను ఇందులో పేర్కొన్నారు. ఈ సదస్సుకు వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లా డుతూ.. ఏఐలో పూర్తిగా పట్టు సాధించ బోతున్నామన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏటా అభివృద్ధి సాధిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. డీప్‌ఫేక్ లాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఐని సరైన దారిలో ఉపయోగించుకుంటామని చెప్పారు. ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఎథికల్ ఏఐ విషయంలో జపాన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌కు సమీపంలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి ఏఐ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు అయ్యేలా చూస్తామని వివరించారు. రాబోయే రెండు రోజులు హెచ్ఐసీసీ వేదికగా ఏఐ పైనా చర్చ లు, సెమినార్లు ఉంటాయని శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్



డెవలప్‌మెంట్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని శ్రీధర్ బాబు అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగం చేయొద్దని ఆయన సూచించారు. హైదరాబాద్ లో 200 ఎకరాలు కేటాయించి ఏఐ సిటీని ఏర్పాటు చేస్తాము. రాబోయే మూడేళ్లల్లో గ్లోబల్ ఏఐ హబ్ గా హైదరాబాద్ అవతరిస్తుందని మంత్రి అన్నారు. ఏఐ పెట్టుబడులకు ఇండియా గమ్యస్థానంగా ఉందని ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నిపుణులైన 2వేల మంది ఏఐ నిపుణులు సదస్సుకు వచ్చారు.

## నామినేటెడ్ పోస్టుల భర్తీకి కాంగ్రెస్ కసరత్తు

వరదలతో బిజీ బిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబులు పార్టీ పదవుల భర్తీపై దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రోజు రోజుకు ఒత్తిళ్లు పెరుగుతుండడంతో పార్టీ కోసం పని చేసిన వారితో భర్తీ చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది.మొదటి విడతలో 37 మందికి వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించిన పార్టీ రాష్ట్ర నాయకత్వం మరికొంత మందికి రెండో విడత కింద కార్పొరేషన్ ఛైర్మన్ల పదవులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. సామాజిక సమతుల్యత పాటించి ఈ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. డిమాండ్ అధికంగా ఉండడంతో పార్టీ నాయకత్వం ఆచితూచి ముందుకు పోతోంది. పార్టీ బలోపేతానికి పని చేసిన వారికే పదవులు దక్కాలన్న యోచనలో కాంగ్రెస్ కసరత్తు కొనసాగుతోంది. అదేవిధంగా ఎమ్మెల్యేలకు కూడా కొన్ని కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఆర్టీసీ, పౌరసరఫరాలు, మూసీ సుందరీకరణ కార్పొరేషన్ తదితర ముఖ్యమైన పదవులు ఎమ్మెల్యేలకు ఇస్తారన్న ప్రచారం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతోంది.ఇదిలా ఉండగా వాటికంటే ముందు కమిషన్లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్న పార్టీ నాయకత్వం వాటి కసరత్తులో కూడా వేగం పెంచినట్లు తెలుస్తోంది. విద్యా కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, రైతు కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి, బీసీ కమిషన్ ఛైర్మన్‌గా పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్‌ల ఎంపిక పూర్తి చేసినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి.బీసీ కమిషన్‌ను అధిక జనాభా కలిగిన బీసీ వర్గాలతో ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ప్రధానంగా ఇందులో మున్నూరు కాపు, యాదవ, గౌడ్, ముదిరాజులు లాంటి అత్యధిక జనాభా కలిగిన వారు ఛైర్మన్, సభ్యులు ఉండేట్లు చూడాలని యోచిస్తోంది. అదేవిధంగా విద్యా కమిషన్ ఛైర్మన్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఐఏఎస్ మురళిని నియమిస్తుండడంతో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే దిశలో పని చేయగలిగే వారిని సభ్యులుగా నియమించేందుకు కసరత్తు జరుగుతోంది .తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం యువతకు భాగస్వామ్యం కల్పించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. అదే విధంగా విద్యపై పట్టున్న వారినే సభ్యులుగా నియమించడం ద్వారా సమర్థవంతంగా పని చేసినట్లయితే రాష్ట్రంలో విద్యావ్యవస్థ మరింత మెరుగైన మార్పులు వస్తాయని ఆశిస్తున్నారు. ఉపాధి కల్పించేట్లు చదువు ఉండాలని భావిస్తున్న ప్రభుత్వం స్కిల్స్ లేని యువతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని యోచిస్తున్నారు. రాబోయే కాలంలో ఆలాంటి పరిస్థితి లేకుండా ఉండేట్లు విద్యావ్యవస్థలో మార్పులు చేర్పులు చేసే అవకాశం లేకపోలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.రైతు కమిషన్ ఛైర్మన్‌గా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కోదండ రెడ్డి ఉండడంతో సభ్యులు అంతా కూడా వివిధ సామాజిక వర్గాలకు చెంది, వ్యవసాయంపై పట్టున్న వారిని ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. రైతును లాభాల్లోకి తీసుకొచ్చే దిశగా పంటల సాగులో మార్పులు తీసుకొచ్చేందుకు ఈ కమిషన్ పని చేయాల్సి ఉండడంతో అదే స్థాయిలో అవగాహన కలిగిన వారినే సభ్యులుగా నియమిస్తారని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించి తాజాగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు సమావేశమై రైతును లాభాల్లోకి తీసుకొచ్చే దిశగా పంటల సాగులో మార్పులు తీసుకొచ్చేందుకు ఈ కమిషన్ పని చేయాల్సి ఉండడంతో అదే స్థాయిలో అవగాహన కలిగిన వారినే సభ్యులుగా నియమిస్తారని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించి తాజాగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు సమావేశమై చర్చించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పీసీసీ నూతన అధ్యక్ష ఎంపిక తరువాత కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల భర్తీ ఉంటే బాగుంటుందని సీనియర్ నాయకులు అభిప్రాయం. అయితే కొందరి పేర్లతో కూడిన జాబితాను పార్టీ నాయకులు సిద్దం చేశారని తెలుస్తోంది. ఆ జాబితాపై సీఎంతో చర్చించిన తరువాతనే పూర్తి వివరాలు బహిర్గతం అవతాయని స్పష్టం చేస్తున్నారు. దాదాపు 15 వీసీ పదవుల భర్తీ విషయం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. అదేవిధంగా సమాచార కమిషన్, హ్యూమన్ రైట్స్ కమిషన్ కూడా వేయాల్సి ఉండడంతో అందుకు అర్హులైన వారి కోసం పార్టీ అన్వేషణ చేస్తున్నట్లు సమాచారం.

# కొత్త చట్టాల మేరకు తొలిశిక్ష విధింపు

-ఘటన జరిగిన 48 రోజుల్లోనే హంతకులకు జీవిత ఖైదు

పట్నా(జనంసాక్షి):: భారత న్యాయవ్యవస్థలో ఇటీవల నూతన అధ్యాయం మొదలైంది. ఈ ఏడాది జులై 1 నుంచి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ అమల్లోకి వచ్చాయి. కాగా.. ఈ కొత్త నేర చట్టాల కింద తాజాగా తొలి శిక్ష పడింది. ఓ హత్య కేసుకు సంబంధించి బిహార్‌లో ఇద్దరికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఘటన జరిగిన 48 రోజుల్లోనే వారికి దోషులుగా తేల్చి శిక్ష ఖరారు చేయడం గమనార్హం. బిహార్ లోని శరణ్ జిల్లాలో జులై 17న మూక హత్యలు జరిగాయి. ధనాదిహ్ గ్రామానికి చెందిన తారకేశ్వర్ సింగ్ కుటుంబంపై దుండగులు దాడి చేశారు. డాబాపై నిద్రిస్తున్న వారిని విచక్షణా రహితంగా పొడిచారు. ఈ ఘటనలో తారకేశ్వర్, ఆయన ఇద్దరు కుమార్తెలు ప్రాణాలు కోల్పోగా.. భార్య తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.ఈ క్రమంలోనే దాడికి పాల్పడిన సుధాన్షు కుమార్, అంకిత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన 14 రోజుల్లోనే వీరిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం వీరిద్దరినీ దోషులుగా తేలుస్తూ తీర్పు వెలువరించింది. గురువారం వీరికి జీవిత ఖైదు విధిస్తూ సెషన్స్ కోర్టు శిక్ష ఖరారు చేసింది. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లాడుతూ.. కొత్త నేర చట్టాల కింద దేశంలో తొలి శిక్ష ఇదేనని తెలిపారు.

## కాలువలు, చెరువుల పునరుద్ధరణకు తక్షణమే టెండర్లు

పనిచేస్తున్నాయా లేదా అన్న పరిశీలన కనిపించలేదన్నారు. తద్వారా విపత్తులు సంభవించినప్పుడు దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఒక దగ్గర రెగ్యులేటరీ జామ్ అయ్యిందన్నారు. మరోచోట షట్లర్ ఎత్తుతుంటే తెగిపోయిందన్నారు. ఈ తరహా సంఘటనలు మరోసారి పునరావృతం అయితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే అందుకు సీఈలే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖా ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు, హరేరాం, శంకర్.. నీటిపారుదల శాఖా సలహాదారుడు అదిత్యా దాస్ నాథ్, డిప్యూటీ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖా చీఫ్ ఇంజినీర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్

తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. సమాజాన్ని సన్మా ర్గంలో పెట్టడంలో గురువులది కీలకపాత్ర. అదృష్టం కొద్దీ మన రాష్ట్రంలో ఆదర్శమైన గురువులు ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను మన గురువులు చక్కగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసినప్పుడు చక్కగా సహకరించారు. గురువులు ఎంత గొప్ప వా ళ్ళైతే సమాజం కూడా అంత గొప్పగా మారు తుందని భట్టి విక్రమార్క అన్నారు. విద్యను, గురువులను గౌరవించేది కాంగ్రెస్ మాత్ర మేనని వ్యాఖ్యానించారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామన్నారు. మరో 6 వేల ఉపాధ్యాయ పోస్టుల కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 27, 862 విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. ఇవాల్టి నుండే అమలు చేస్తున్నామని.. జీవో కూడా విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉందని.. అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాంను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు , ఎమ్మెల్యేలు కోదండరాం, నర్సిరెడ్డి, రఘోత్తం రెడ్డి , ఏవీఎన్ రెడ్డి, ఉన్నత విద్య మండలి చైర్మన్ లింబాద్రి, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్లు దేవసేన , శృతి ఓజా , ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్



విశ్వసనీయ సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపట్టారు. తారసపడిన వారిని లొంగిపోవాలని కోరగా సాయుధులైన మావోలు ఎదురు కాల్పులు జరిపారు. పలుమార్లు హెచ్చరించిన మాట వినక పోవడంతో ఆత్మ రక్షణ కోసం పోలీసులు ఫైరింగ్ జరిపారు. అనంతరం అటవీప్రాంతంలో సోదాలు నిర్వహించగా ఆలివ్ గ్రీన్ దుస్తులను ధరించిన ఆరు మృతదేహాలను గుర్తించారు. సంఘటన స్థలం నుంచి రెండు ఏకే-47 ఆయుధాలు, ఒక ఎస్ ఎల్ ఆర్ ఆయుధం,303 రైఫిల్ , ఒక పిస్టల్ మ్యాగ్జిన్ తో పాటు లైవ్ రౌండ్లు,కిట్ బ్యాగులు ఇతర మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు . హతమైన వారిని పాల్వంచ, మణుగూరు డీవీసీఎం లచ్చన్న అలియాస్ కుంజా వీరన్న, తులసి, శుక్రం, రాము, దుర్గేష్, కోసిగా గుర్తించారు. ఇదిలా ఉండగా ఈ ఎదురు కాల్పుల్లో కీలక టార్గెట్ మిస్ అయినట్లు తెలుస్తుంది... ఈ జిల్లాల్లో పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న అగ్ర నేత మాసయ్య తృటిలో తప్పించుకున్నట్లు తెలిసింది. అయన ఆచూకీ కోసం అడవిలో జల్లెడ పడుతున్నారు. నీలాద్రి పేట అడవిలోనే తలదాచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్ప టికే లొంగి పోవాలని ప్రకటనలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హింసాత్మక ఘటనలను ఉపేక్షించ బోమని భద్రాద్రి జిల్లా ఎస్పీ వినీత్ రాజ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి లో ఉన్న మావో మృత దేహాలను పరిశీలించారు. అడవుల్లో అలజడులు సహించబోమని వెంటనే లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసి పోయి సాధారణ జీవితం గడపాలని మావోలకు సూచించారు. ప్రభుత్వం తమ శాఖ అండగా ఉంటామని హామీ ఇచ్చారు..

## నెత్తుటి బాకీ త్వరలోనే తీర్చుకుంటాం

కగార్‌లో భాగంగానే తమపై దాడులు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నట్టు, అయినప్పటికీ బూటకపు ఎన్‌కౌంటర్లకు మావోయిస్టు పార్టీ భయపడదని పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌కు జిల్లా మంత్రులు ప్రధాన బాధ్యత వహించాలని, తమ కామ్రేడ్స్ నెత్తుటి బాకీ త్వరలోనే తీర్చుకుంటామని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 9న జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్టు, ప్రజలు, వ్యాపార సంస్థలు సహకరించాలని, ఎన్‌ఖౌంటర్‌ను ప్రజలు ప్రజాస్వామికవాదులు ఖండించాలని ప్రకటనలో కోరారు. 'కామ్రేడ్ లచ్చన్న డివిజన్ కమిటీ సభ్యులు (రాయిగుడెం, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం), కామ్రేడ్ తులసి (పునెం లక్కీ) లచ్చన్న సతీమణి (ఛత్తీస్‌గడ్ కుంబాడు), కామ్రేడ్ రాము పాల్వంచ - మణుగూరు ఏరియా కమాండర్ జగ్గారం ఎటపాక (ఏపీ), కామ్రేడ్ కోసి పార్టీ సభ్యురాలు (ఛత్తీస్‌ఘడ్ కోమటిపల్లి), కామ్రేడ్ గంగాల్ పార్టీ సభ్యులు ఛత్తీస్‌ఘడ్ కోమటిపల్లి, కామ్రేడ్ దుర్గేశ్ పార్టీ సీనియర్ సభ్యులు ఛత్తీస్‌ఘడ్ బొట్టెం గ్రామం. వీరితో పాటుగా ఓ గ్రామస్తుడిని కూడా పోలీసులు హత్య చేసినట్టు సమాచారం ఉంది. అమరులైన కామ్రేడ్లకు పార్టీ విప్లవ జ్యోహార్లు అర్పిస్తోంది' పేర్కొన్నారు.

## ఏసోబు అంత్యక్రియల్లో.. ఎరుపెక్కిన టేకులపల్లి

ప్రతి ఒక్కరి హృదయం బరువెక్కింది. బస్తర్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జగన్ అలియాస్ రణదేవ్ దాదా మృతిచెందగా.. గురువారం ఉదయం హన్మకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెంకు మృతదేహాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఏసోబు మృతదేహం చేరుకోగా అక్కడున్నవారంతా తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజాసంఘాల నేతలు, పౌరహక్కుల నాయకులు, కుటుంబీకులు, గ్రామస్తులు చేరుకుని నివాళులర్పించారు. ఉద్యమాల పురిటి గడ్డగా పేరున్న ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతోమందికి విప్లవ పాఠాలు నేర్పిన ఏసోబు అస్తమించడం పట్ల వివిధ ప్రజా సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. 1980లో మావోయిస్టు ఉద్యమంలో చేరిన ఆయన అంచలంచెలుగా కేంద్ర పార్టీలో కీలక స్థాయికి చేరుకున్నారు. మావోయిస్టు పార్టీ తొలి తరం నేత.. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా వివిధ హోదాల్లో పని చేశారు. ఆయన మరణంతో 50 ఏళ్ల ఉద్యమ ప్రస్థానానికి తెరపడింది.

# ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే ప్రవేశాలు

'3ఏ'ను చేరుస్తూ ప్రభుత్వం జీవో 33ను జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాస నం విచారణ కొనసాగించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు బి.మయూ ర్‌రెడ్డి, డి.వి.సీతారాంమూర్తి తదితరులు వాదన లు వినిపించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనల సవరణ వల్ల స్థానికులకే ఎక్కువ నష్టం వాటిల్లుతోందన్నారు. ఇతర రాష్ట్రాల వారితోపాటు భారతీయ మూలాలున్న ప్రవా సులు ఇక్కడ 4 ఏళ్లు చదువుకుంటే 85 శాతం స్థానిక కోటా కింద అవకాశం దక్కించుకుం టారన్నారు. దీనివల్ల తెలంగాణలో పుట్టిపెరిగిన వారికి నష్టం వాటిల్లుతుందన్నారు. స్థానిక కోటా ఇక్కడ నివాసం ఉన్నవాళ్లకే అడుగు తున్నామని, చదువుకున్నవారు అన్న దానిపై అడగడం లేదన్నారు. ఉద్యోగులు బదిలీ కావడం వంటి పరిస్థితుల్లోనూ.. అలాగే మెరుగైన విద్య కోసం.. ఇంటర్ మరో రాష్ట్రంలో చదువుకున్న తెలంగాణ విద్యార్థి స్థానికుడు కాదనడం సరికాదన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగుల పిల్లలకు అవకాశం ఇస్తామన్న ప్రభుత్వం.. ప్రైవేటు ఉద్యోగుల పిల్లలకు అవకాశం నిరాకరించడం వివక్ష చూపడమేనన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతోనే ఈ జీవో తీసుకువచ్చినట్లు తెలిపారు. నిబంధనలు తీసుకువచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి ఇరుపక్షాల వారు పలు సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పులను ధర్మాసనం ముందుంచారు. వాదనలను విన్న ధర్మాసనం తీర్పు వెలువరించింది. స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజే జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం తీర్పును వెలువరించింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం పేర్కొంది. స్థానికత నిర్ధారణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని సచించింది. కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని స్పష్టం చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల్లో స్థానికత జీవోకు సంబంధించిన అంశంపై హైకోర్టులో విచారణ జరిగింది. వైద్యారోగ్యశాఖ జారీ చేసిన జీవోను పలువురు విద్యార్థులు సవాల్ చేశారు. నీట్ ప్రవేశ పరీక్ష రాసే సమయానికి విద్యార్థి వరుసగా నాలుగేళ్లు చదివితేనే స్థానికుడిగా పరిగణించాలంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పేర్కొంది. సర్కారు జారీ చేసిన ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కి విరుద్ధమని పిటిషన్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఆయా పిటిషన్లపై వాదనలు విన్న సీజే ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది.

## హసీనాకు మౌనమే మంచిది

**ఢాకా(జనంసాక్షి):**భారత్‌లో కూర్చొన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ ఆగ్రహం వ్యక్తంచేశారు.ఆమెను అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం కోరేవరకు ఆమె భారత్‌లో మౌనంగా ఉండాలన్నారు. లేకపోతే ఆమె వ్యాఖ్యలు ఇరు దేశాల సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. రాజధాని నగరం ఢాకాలో తన అధికారిక నివాసంలో యూనస్ మీడియాతో మాట్లాడారు. "హసీనాను తిరిగి స్వదేశానికి పంపాలని బంగ్లాదేశ్ అడిగేవరకు ఆమె భారత్‌లోనే ఉండిపోతే.. మౌనంగా ఉండాలి. ఆమె అక్కడ ఉండి మాట్లాడటం ఇబ్బందిగా మారుతుంది. ఆమె మౌనంగా ఉంటే.. మేం దానిని మర్చిపోతాం. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సూచనలు చేయడాన్ని ఎవరూ ఇష్టపడరు. దేశంలో దురాగతాల నుంచి ప్రజలకు న్యాయం అందించేందుకు తాత్కాలిక ప్రభుత్వం కట్టుబడి ఉంది. న్యాయం జరగాలంటే తిరిగి ఆమెను వెనక్కి తీసుకు రావాలి. లేకపోతే బంగ్లాదేశ్ ప్రజలు శాంతించరు. ఆమె పాల్పడిన దురాగతాలను అందరి ముందు విచారించాల్సిందే" అని యూనస్ అన్నారు. తాము భారత్‌తో సత్సంబంధాలను కోరుకుంటున్నామన్నారు. అయితే, హసీనా నాయకత్వంతోనే బంగ్లాదేశ్ లో స్థిరత్వం ఉంటుందనే ధోరణిని భారత్ విడనాడాలంటూ వ్యాఖ్యలు చేశారు.బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కేవలం అవి రాజకీయ ప్రేరేపితమైనవేనని యూనస్ ఈ సందర్భంగా అన్నారు. మైనార్టీ హిందువులు గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేవారని, హసీనా పార్టీ మద్దతుదారులుగా ఉన్నవారిపై కొన్ని చోట్ల దాడులు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని మతపరమైన దాడులుగా చెప్పడం సరికాదని వ్యాఖ్యానించారు. భారత్‌లో ఆశ్రయం పొందుతోన్న హసీనా కొన్నిరోజుల క్రితం బంగ్లా పరిణామాలపై తొలిసారి స్పందించారు. తనకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు. "ఇటీవల కాలంలో ఆందోళనల పేరిట కొంతమంది విధ్వంసానికి దిగారు. హింసాత్మక దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఈనెల 15న బంగబంధు భవన్ వద్ద మృతులకు నివాళులర్పించాలని దేశ ప్రజలకు పిలుపునిస్తున్నాను. అదేవిధంగా.. ఇటీవల హత్యలు, విధ్వంస చర్యలకు పాల్పడినవారిని గుర్తించి, తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నా" అని హసీనా పేర్కొన్నారు.ఇదిలాఉంటే.. షేక్ హసీనాను భారత్ తమ దేశానికి అప్పగిస్తుందా, లేదా అని అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రశ్నించిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. విదేశీ వ్యవహారాల సలహాదారు ఎండీ తౌహిద్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం ఏమైనా చేస్తుందని పేర్కొన్నారు.

## మా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి

- మీడియా సమావేశంలో పాడి గగ్గోలు



కరీంనగర్, సెప్టెంబర్5 (జనంసాక్షి) : తన ఫోన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని భారాస హుజూరాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ ఫోన్లను ట్యాప్ చేస్తున్నారన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మా వ్యక్తిగత సమాచారం ఎలా తెలుస్తోంది. కరీంనగర్ సీపీ ఫోన్ కూడా ట్యాప్ చేస్తున్నారు. మానకొండూరు సీఐకి కాన్ఫరెన్స్ పెట్టడం లేదని మంత్రి, ఎమ్మెల్యేకు ఎలా తెలుసు? ప్రజలకు రక్షణ కల్పించే పోలీసుల ఫోన్లను ట్యాప్ చేయడం సిగ్గుచేటు. రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం 40 శాతం మందికే రుణాలు మాఫీ అయ్యాయి. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఏ చెక్కులైనా పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యేకు హక్కు ఉంటుంది. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కాంగ్రెస్ పార్టీవి కావు.. అవి ప్రజల సొమ్ము. ఎన్నికల్లో ఓటమిపాలైన అభ్యర్థి చెక్కులు పంచుతున్నారు. దీనిపై హైకోర్టుకు వెళ్తా. సీపీ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనపుడు కేంద్రమంత్రి బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలి' అని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానం




వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 05 (జనం సాక్షి) : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ దేశ పురోగతికి పాల్పడే ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు.వరంగల్ నగరంలోని ఆకుతోట కన్వెన్షన్ హాల్లో గురుపూజోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సత్య శారద ,ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, హాజరయ్యారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయ ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్నారు. ఉపాధ్యాయులకు కావలసినన్ని సేవలను అందించడమే కాకుండా వారి సమస్యలు పరిష్కారానికి పాటుపడిందని గుర్తు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిరంతర కృషి జరుగుతుందన్నారు.తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయులు ఎక్కువ అన్నారు.విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు.ఒక చదివే కాకుండా విద్యార్థులు ఏ ఏ రంగాలలో ప్రావీణ్యం కలిగి ఉన్నారో అందులో వారిని ప్రోత్సహించాలన్నారు.ఈ సందర్భంగా అవార్డులు పొందిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.అంతకుముందు ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.ఆర్ నాగరాజ్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేనిది అభివృద్ధి లేదన్నారు.విజ్ఞానాన్ని అందించి ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తి ఉపాధ్యాయులే ఇస్తారని ఆ విజ్ఞానంతో దేశ పురోగతి జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా డాక్టర్ టి.శ్రీధర్ ఆచార్యులు వ్యవహరించారు.



## నిండుకుండలా 'నిజాంసాగర్'

- మూడు గేట్లు ఎత్తి 15వేల క్యూసెక్కుల నీటి విడుదల

కామారెడ్డి, సెప్టెంబర్5 (జనంసాక్షి) : కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో భారీగా వరద అక్కడికి చేరుతోంది. దీంతో మూడు గేట్లు ఎత్తి 15వేల క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ మేరకు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు. ప్రస్తుతం 1,404 అడుగులకు చేరుకుంది. దీంతో మూడు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు భారీ వరద కొనసాగుతున్నది. ఎగువ మహారాష్ట్ర, గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీకి భారీగా వరద వస్తోంది. ప్రస్తుతం 2 లక్షల 25 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండడంతో 3లక్ష 24వేల క్యూసెక్కుల ఔట్ ఫ్లోను 41 వరద గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీలో గరిష్ఠ నీటిమట్టం 1,091 అడుగులు కాగా 1,089 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 73.458 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. నవీపేట మండలంలోని మిట్టాపూర్ శివారులోని వందలాది ఎకరాల పంట నీట మునిగింది. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ముంచెత్తడంతో వరి పైర్లు పూర్తిగా మునిగి పోయాయి. మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద పోటెత్తింది. మండలంలోని యంచ, నందిగామ, మిట్టాపూర్, కోస్లీ,బినోలా తదితర గ్రామాలకు చెందిన పంట పొలాలను శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ముంచెత్తింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## గౌలిదొడ్డి గురుకుల పాఠశాల విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) : గౌలిదొడ్డి గురుకుల పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గురుకుల పాఠశాల ఔట్ సోర్సింగ్ లో పనిచేసిన 18 మంది అధ్యాపకులను సొసైటీ తొలగించింది. బోధన సక్రమంగా జరగకపోవడంతో ఐఐటి, నీట్ పాత ఫ్యాకల్టీ కావాలని కళాశాల గేటుముందు విద్యార్థులు ధర్నా చేస్తున్నారు. ఉన్నపళంగా అధ్యాపకులు తొలగించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ లో గౌలిదొడ్డి గురుకుల పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఐఐటి, మెడిసిన్ లో అత్యధికంగా చేరిన వారిలో గౌలిదొడ్డి విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం రోజున ఉపాధ్యాయులు కోసం విద్యార్థులు ధర్నా చేస్తున్నారు. దాదాపుగా 22 మంది ప్రైవేట్ టీచింగ్ ఫ్యాకల్టీని అధికారులు తొలగించారు. కొత్తగా ప్రభుత్వం ఉపాధ్యా యులను అధికారులు నియమించారు. వారికి ఐఐటి, నీట్ సిల బస్ చెప్పడం రావడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## రోజుకో అత్యాచారం, గంటకో అఘాయిత్యం.. ఇదేనా మార్పు?

- మహిళా భద్రతకు అభయమివ్వని హస్తానికి అధికారమెందుకు?
- మంత్రి సీతక్కను అడ్డగించి నిలదీసిన మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో ఆసిఫాబాద్ జిల్లాకి సంబంధించిన ఆదివాసీ ఆడబిడ్డపై ఆగష్టు 31 న జరిగినట్వంటి అత్యాచారం మరియు హత్య యత్నం ను ఉద్దేశించి ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ధర్నాలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి గారు పిలుపునిచ్చారు. దానిలో భాగంగా గాంధీ హాస్పిటల్ లో ఉన్న బాధిత మహిళను పరామర్శించడానికి వెళ్లిన శిల్పారెడ్డి బాధిత కుటుంబంతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసనిచ్చారు. మహిళ పై జరిగింది హత్యాచారమే అని కుటుంబ సభ్యులు మీడియా సాక్షిగా చెప్పినా మంత్రి సీతక్క ఈ కేసుని పక్కతోవ పట్టించే తీరును నిరసిస్తూ మహిళకి న్యాయం జరగాలని గాంధీ హాస్పిటల్ ముందు బైటాయించిన శిల్పారెడ్డి గారు బాధిత మహిళా కుటుంబానికి జరిగిన అన్యాయం ని పక్కతొవ్వ పట్టించడానికి వచ్చిన మంత్రి సీతక్క ని నిలదీసి ఈ సంఘటనను అత్యాచారం, హత్య యత్నంగానే చూడాలని కమ్యూనల్ ఇష్యూగా చిత్రికరించవద్దని సూటిగా మంత్రిని హెచ్చరించారు. వెంటనే నిందితుడికి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార, హత్యయత్నం కేసులు పెట్టి ఉరిశిక్ష విధించి బాధిత మహిళకి న్యాయం చేకూర్చాలని లేనియెడల రాష్ట్ర మహిళా మోర్చా తరుపున ముందు ముందు చెప్పట్టపోయే కార్యక్రమాలు తీవ్రంగా ఉంటాయని శిల్పారెడ్డి గారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## దీక్షను విరమించిన సిద్దేశ్వర పటేల్



- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 12 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష
- గాంధీ హాస్పిటల్ లో బీసీ రాజకీయ నాయకులు మేధావుల రౌండ్ టేబుల్ సమావేశం
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యల సమక్షంలో విరమణ

భువనగిరి ప్రతినిధి సెప్టెంబర్ 5 (జనం సాక్షి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ తో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి న సిద్దేశ్వర పటేల్ ను దీక్ష విరమింప చేశారు. సమగ్ర కుల గణన వెంటనే చేపట్టాలి ,స్థానిక సంస్థల్లో బిసిలకు వాటా పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి అని, గాంధీ హాస్పిటల్ లో 12 రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న సిద్దేశ్వర్ పటేల్ దీక్ష ను విరమించారు. ఆరోగ్యం పూర్తిస్థాయిలో క్షీణించడంతో ఒకటి రెండు రోజులు దీక్ష కొనసాగిస్తే చనిపోయే ప్రమాదం ఉంది అని ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించడం అనివార్యం కాంగ్రెస్ పార్టీ పరంగాఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అండగా ఉన్నాడు అని భరోసా ఇచ్చాడు. దీనికి ముందు బీసీ రాజకీయ నాయకులు బీసీ మేధావులు గాంధీ హాస్పిటల్ ప్రాంగణంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ , ఎమ్మెల్సీ మధుసూదన్ చారి , మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు.




## నేపాల్ లో అంతర్జాతీయ కబడ్డీ పోటీలలో గెలుపొందిన తమ్మిశెట్టి శ్రావణి

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 05 (జనం సాక్షి) :నేపాల్ లో ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 1 వరకు జరిగిన అంతర్జాతీయ కబడ్డీ పోటీలలో తమ్మిషెట్టి శ్రావణి పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తమ్మిశెట్టి రాములు కూతురు తమ్మిశెట్టి శ్రావణి శ్రీచైతన్య కాలేజ్ లో ఇంజనీరింగ్ బిటెక్ 2వ సంవత్సరం చదువుతున్న అమ్మాయి కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంటటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ టి.సునీత, ప్రోద్బలంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ, పోటిలలో పాల్గొని గెలుపొందారు. రాష్ట్రంలో 2వ స్థాయి, జాతీయలో 2వ స్థాయి, అంతర్జాతీయ లో 1వ స్థాయి లో విజయం రాణించిందని ఆమె విజయాన్ని మాజీ సర్పంచ్ పిట్టల రజిత, కార్యదర్శి అజయ్‌కుమార్, గ్రామస్థులు, ప్రజలు అభినందించారు.

## సర్కారీ జాగా ఏది?

- కోట్లాది రూపాయల విలువైన స్థలం కబ్జా!
- తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా అధికారుల చోద్యం

**ఆర్మూర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి): ఆర్మూర్ ప్రజలారా.. నేను మీ ప్రజల ఆస్తిని, నన్ను చక్క పెట్టుకుంటే మీ భావితరాలకు ప్రభుత్వ పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, మరెన్నో వాటికి నిలయంగా మారుతాను. నన్ను గుర్తించి కాపాడుకునే బాధ్యత మీ భుజస్కంధాలపై ఉంది' అని ఆ భూమి తన ఆవేదన చెప్పుకుంటుంది. ఖాళీ భూమి కనిపిస్తే కొందరు కుమ్మక్కై కబ్జాలకు పాల్పడి జెండా పాతేస్తున్నారు. సర్కారీ జాగా నేను ఏక్కడ అంటూ తనను తానే ప్రశ్నించుకుంటుంది.**






ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు అంతే లేకుండా పోయింది. ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలు, ఖాళీ స్థలాలు ప్రైవేట్ వ్యక్తులు కన్నేసి కబ్జాలకు పాల్పడుతున్నారు. నిజామాబాద్ ప్రధాన రహదారికి వెళ్లే మార్గం గుండా అటవీ శాఖ కార్యాలయం ప్రాంతంలో సర్వే నంబర్ 505/1 లో సుమారు 30 ఎకరాల వరకు సర్కారీ జాగా ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన కొందరు ప్రైవేటు వ్యక్తులు స్థలాన్ని చదును చేసి వెంచర్ నిర్మాణం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు 30 చెట్ల నరికివేతకు పర్మిషన్ తీసుకున్నట్లు వినికిడి. దాదాపు ఆ ప్రాంతంలో సుమారు వందకు పైగా చెట్లు నరికి వేయబడి ప్రభుత్వ భూ స్థలాన్ని కబ్జాకు యత్నిస్తుండడం గమనార్హం.సర్వే నెంబర్ 505/1 పూర్తిగా ప్రభుత్వ భూమి అని తెలిసిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఇదే సర్వే నంబరు వేరొక ప్రాంతంలో చూపుతూ కబ్జాకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇదే సర్వే నంబర్ లో కొందరు ప్రైవేటు వ్యక్తులు భూమిని ఆక్రమణ చేయడంతో పాటు కబ్జా చేసిన స్థలానికి యదేచ్ఛగా పలకలు నిర్మించారు.తాసిల్దార్ కార్యాలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఇంతటి తంతు జరుగుతున్న వారికి పట్టింపు లేకుండా పోయింది. కోట్లాది రూపాయల విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్న తలోపాపం తిలోపిడేకుడు అన్నట్లుగా అధికారుల చోద్యం చూస్తున్న తీరు పలు విమర్శలకు దారితీస్తుంది.కొందరు అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్న హైడ్రా.. మరి ఆర్మూర్ లో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.



## వైస్ చైర్మన్ భవన షెట్టర్‌ల కూల్చివేత



సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) : సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ కు చెందిన బిల్డింగ్ సెల్లార్ లో షెటర్లు వేసి వ్యాపారానికి వాడుకుంటున్నట్లు కొందరు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, పట్టించు కోకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. గౌరవ కోర్టు బిల్డింగ్ లోని అక్రమ నిర్మాణాలను తోలగించాలని ఆదేశించింది. దీంతో, కోర్టు ఉత్తర్వుల ప్రకారం గురువారం మున్సిపల్ అధికారులు షెటర్లను తొలగించారు. కాగా అక్రమంగా ప్రక్క ఇంటి గోడను ఆనుకొని నిర్మించిన సెప్టిక్ ట్యాంక్ లేని లెట్రిన్ బాత్రూంలు, ఫుట్ పాత్ పై ఉన్న మెట్లు , రోడ్డుపై ఏర్పాటు చేసిన జనరేటర్ లను తొలగించలేదు.

### థూ... థూ... మంత్రంగానే తొలగించారు



వైస్ చైర్మన్ కు సంబంధించిన అక్రమ నిర్మాణం తొలగింపును థూ... థూ... మంత్రంగానే మున్సిపల్ కమి షనర్ చేశారు, కోర్టు ఆర్డర్ ప్రకారం పూర్తిస్థాయిలో తొలగించలేదు. కోర్టు ఆర్డర్ ప్రకారం అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించలేదు. రోడ్డుపైన ఉన్న జనరేటర్ ను కూడా తొలగించాలి, లేనిచో మున్సిపల్ కమిషనర్ పై చర్యలు తీసుకునేలా మళ్ళీ కోర్టును ఆశ్రయిస్తాం.

**- బిజెపి పట్టణ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్**

### ఎవరైనా సరే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం



సిరిసిల్లలోని ఓ బిల్డింగ్ కు సంబంధించిన సెల్లార్ స్థానంలో షెటర్లు పెట్టుకొని గోదాంగా వాడుకుంటున్నారు. గతంలో ఆ బిల్డింగ్ యజమానికి నోటీసులు అందించాము. వారి దగ్గర నుండి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కోర్టు ఆర్డర్ ప్రకారమే షెట్టర్ లు తొలగించడం జరిగింది. ఎలాంటి అక్రమ నిర్మాణం ఉన్నా చట్టపరంగాచర్యలు చేపడతాం.

**- మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ బేగ్ ఆలీ**

# సెలబ్రిటీ..ఫిఫ్టీ-ఫిఫ్టీ

*తోచిన సాయం చేయండి.. లేదా కనీసం నైతిక స్థైర్యం ఇవ్వండి..అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రాంతాలు, రాష్ట్రాలకు అతీతంగా తెలుగు ప్రముఖులు స్పందిస్తున్నారు. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో స్వయంగా లెగ్ వర్క్ చేసిన దరిమిలా పకృతి దాడి గురించి కళ్లకు కట్టినట్లు సీఎం సమాజం ముందు ఉంచారు. ఫీల్డులోని దయనీయ, దుర్భర స్థితిగతులకు చలించారు.*



మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు తనంతట తానుగా ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 లక్షల చొప్పున మొట్టమొదటి ఔదార్యాన్ని ఆన్ గ్రౌండ్ లో ఉన్నపుడే ముఖ్యమంత్రి ఉటంకించారు. మాజీ సీజేఐ ఎన్వీ రమణ రూ. 10 లక్షల చొప్పున ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఇచ్చారు.తెలంగాణ రెసిడెంట్ కమిషనర్, ఏపీ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ కు ఢిల్లీలో చెక్కుల రూపంలో అందజేశారు. ఈ తోడ్పాటును విస్తృతం చేసేలా శ్రీమంతులు, చేయూతనిచ్చే స్తోమత కలిగిన వారి మనసును కరిగించారు ముఖ్యమంత్రి. ఆ విధంగా ఒక్కొక్కరుగా వితరణ ప్రకటిస్తున్నారు. హైదరాబాద్ లో ఉండే సినీ సెలబ్రిటీలు వరుసగా ఉదారత చూపుతున్నారు. తాము వ్యక్తిగతంగా చేస్తోన్న సహాయంలో ఫిఫ్టీ ఫిఫ్టీగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎంఆర్ఎఫ్ లకు ఇస్తున్నారు.

జనంసాక్షి

హైదరాబాద్ లో హైడ్రా నిష్పక్షపాత విధానం ప్రభుత్వం పట్ల గౌరవాన్ని, నమ్మకాన్ని ఇనుమడింపజేసిన నేపథ్యంలో సినీరంగ ప్రముఖులు స్వచ్ఛందంగా రెండు రాష్ట్రాలకు చెరి సమానం విరాళాలు పోటాపోటీగా అందజేస్తున్నారనే చర్చ తెలంగాణ చిట్ట చివరి గ్రామాల్లోనూ సాధారణ జనంలో జరుగుతోంది! మరోవంక ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హైలైట్. సొంతంగా ఏపీ, తెలంగాణకు రూ. కోటి చొప్పున సాయం ప్రకటించడం విశేషం. మినిస్టరు(డీసీఎం)గా ఒకరు నిధులు ఇస్తుండటం బహుశా ఇదే తొలిసారి కావొచ్చు! రేవంత్ రెడ్డి ప్రభుత్వ విజ్ఞప్తికి ఆయా రంగాల దిగ్గజాల్లో సానుకూల కదలికలు నమోదు అవుతున్నాయి. రూ. 5,438 కోట్ల నుంచి రూ. 7 వేల కోట్లకు నష్టం ప్రాథమిక అంచనాలు చేరాయి. వరద గుప్పిట అతలాకుతలం అయిన గృహాలకు రూ. ఒక లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు యజమానులకు నష్టం సంభవించింది. వ్యవసాయ దారులకు 4 లక్షలకు పైగా ఎకరాల్లో డామేజ్ జరిగింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ నిధి(ఎస్.డి.ఆర్.ఎఫ్)కి సీఎం విన్నపం మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయాల్సి ఉంది. స్టేట్ గవర్నమెంట్ యుటిలైజేషన్ సర్టిఫికెట్ (యూసీ) వంటి ఆఫీసు పేపర్ వర్క్ కంప్లీట్ చేస్తే సెంట్రల్ వాటా ఇస్తామని కేంద్ర హోంశాఖ అంటోంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ఆయా రంగాల ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు ఇలా అందరూ తలా ఓ చేయి వేసి, చేయూతనిస్తే బాధితులకు కొద్దోగొప్పో ఉపశమనం కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్టికులర్ గా కోరినట్లు తాజా మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ రూ. వెయ్యి కోట్ల వితరణ చేస్తే అందరికంటే గొప్పగా శిఖర సమాన చరిత్ర సృష్టించినట్లే!



**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు,
హైదరాబాద్
9440850384

## జీవితం

జీవితం
పూలబాటకాదు
ఉషారుగాజోరుగా
నడవటానికి
జీవితం
హరివిల్లుకాదు
రంగులనుచూస్తూ
కాలంగడపటానికి
జీవితం
సుఖాలమయం కాదు
అనుభవించటానికి
ఆనందించటానికి
జీవితం
విహంగవీక్షణం కాదు
దూరంనుండిచూస్తూ
వినోదంపొందటానికి
జీవితం
సముద్రముకాదు
నిత్యంకెరటాల్లా
ఎగిసిపడటానికి
జీవితం
మకరందంకాదు
సీతాకోకచిలుకల్లా
క్రోలటానికి
జీవితం
వడ్డించిన విస్తరికాదు
కష్టపడకుండా
కాలక్షేపం చేయటానికి
జీవితం
భ్రమకాదు ఊహలలో
తేలిపోటానికి
జీవితం
సంపాదనకాదు
కోట్లధనాన్ని
కూడబెట్టటానికి
జీవితం
దీర్ఘపయనం
గమ్యాలను
చేరటం కోసం
జీవితం
శ్రమించటం
లక్ష్యాలను
సాధించటం
జీవితం
ప్రేమనుపంచటం
భార్యాబిడ్డలతో
ఇరుగుపొరుగువారితో
జీవితం
ఒకనాటకం
ఇచ్చిన పాత్రను
పోషించి
వేదికను
దిగిపోవటానికే
పరిమతం
జీవితం
గాలిపటం
ఎప్పుడు
ఎగురుతుందో
ఎప్పుడు కూలుతుందో
జీవితం
విద్యాలయం
నేర్వటానికి
అమలుచేయటానికి
జీవితం
పోరాటం బ్రతకటానికి
బాగుపడటానికి
జీవితం
ఎరుగు
ఆశయం సాధించు
అదే జీవితాన్ని
గడపటం
అదే జీవితాన్ని
గెలవటం

జనంసాక్షి

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
**భాగ్యనగరం**

# రామ్‌దేవ్ దంత్ మంజన్!






**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

*తనకు తాను యోగ గురువుగా చెప్పకుని, సుప్రీం కోర్ట్ మందలించినా మారని రామ్ దేవ్ గతంలో, ఇటీవల కూడా ఆలోపతి మందులను నకిలీ మందులుగా పేర్కొంటూ స్టేట్మెంట్ లు ఇచ్చాడు! ఆలోపతి డాక్టర్స్ ను కరోనా లో అవహేళన చేసాడు!కరోనా మందు తయారు చేసి బీజేపీ మంత్రులతో దానిని ప్రారంభించి వ్యాపారం చేసుకున్నాడు!కోర్ట్ ముందు క్షమాపణలు కూడా చెప్పు కున్నాడు! అయినా ఆయన మారలేదు!ఈ దొంగ వైద్యుడు మారలేదు! మళ్ళీ ఇప్పుడు గతం లోనే ఒక వ్యాసంలో పతంజలి వారి దంత్ మంజన్ లో చేప లాంటి నాన్ వెజ్ ఉందనే ఆరోపణలు ఉన్నట్లు నేను పేర్కొనడం జరిగింది. ఇప్పడది నిజం అని తేలే పరిస్థితి వచ్చింది! ఈ యోగా గురు రామ్‌దేవ్ నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేదిక్ లిమిటెడ్ మరోసారి చిక్కుల్లో పడింది.ఆగం అయ్యో పరిస్థితి వచ్చింది.*

పతంజలి కంపెనీకి చెందిన దంత సంరక్షణ ఉత్పత్తి అయిన దివ్య దంత్ మంజ న్‌ను తప్పుగా బ్రాండింగ్ చేశారని ఆరోపించిన పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పతంజలి నుండి ప్రతిస్పందనలను కోరింది. దీనికి సంబంధించి, న్యాయవాది యతిన్ శర్మ దాఖలు చేసిన పిటిషన్‌లో, పతంజలి దివ్య టూత్‌పేస్ట్ ను గ్రీన్ డాట్‌తో మార్కెట్ చేస్తుందని పేర్కొన్నారు. అంటే ఈ ఉత్పత్తిని తయారు చేయడంలో శాకాహార పదార్థాలను మాత్రమే ఉపయోగించారు. అన్న మాట, కానీ, ఇందులో సీఫోమ్ అనే పదార్థం ఉంటుంది. ఇది వాస్తవానికి సముద్ర చేపల నుంచి పొందిన సమ్మేళన మని గుర్తించారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం ఇది తప్పుడు బ్రాండింగ్ కిందకు వస్తుందని న్యాయవాది యతిన్ శర్మ పేర్కొన్నారు.

జనంసాక్షి

వాస్తవానికి ఔషధాలకు శాఖాహారం లేదా మాంసాహారం అని నిర్దిష్ట లేబుల్ వేయాల్సిన అవసరం లేదన్నారు. కానీ గ్రీన్‌డాట్‌ని ఉపయోగించడం డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం ప్రకారం “తప్పుడు బ్రాండింగ్” కిందకు వస్తుందంటూ పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సంజీవ్ నరులా కేంద్రం, ఎఫ్ఎస్ ఎస్ఏఐతో పాటు పతంజలి, రామ్‌దేవ్, దివ్య ఫార్మసీ తదితర సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేశారు. పతంజలి ఉత్పత్తుల్లో చేపల ఆధారిత సమ్మేళనాలు ఉండడం తనకు, తన కుటుంబ సభ్యులకు బాధకారంగా మారిందన్నారు. పిటీషనర్ రెస్పాండెంట్ నెం.3 తమ అధికారిక వెబ్‌సైట్‌లో గ్రీన్‌డాట్‌తో ఉత్పత్తిని విక్రయి స్తోందని, ఇది శాకాహారి అని సూచిస్తుందని, లోపల ఉన్న ఇంగ్రీడియెంట్స్‌తో చూస్తే ఇది విరుద్ధంగా ఉందంటూ పేర్కొనడం జరిగింది.

### వేల కోట్ల ఆస్తుల రామ్ దేవ్!

రాందేవ్ ఫేక్ దందాలు, వేల కోట్ల ఆస్తులను కూడ బెట్టిన తీరు మీద కూడ విచారణ జరపాలి. ఐఎంఏ ఇప్పటికే ఆలోపతి వైద్యం ను, మందులను నకిలీవి అని ప్రచారం చేయడం పై రాందేవ్ మీద కోపంగా ఉన్నది. ఇటీవల కోల్కత లో వైద్యురాలి పై జరిగిన హత్యాచారం మీద దేశమంతా వైద్యులు ఆందోళన చేస్తున్న సందర్భంగా రాందేవ్ పై విధంగా మాట్లాడాడు! ఇప్పుడు దంత్ మంజన్ తయారీ విషయంలో ఇరుక్కున్నాడు! ఈ స్వయం ప్రకటిత బాబా సంగతి చూడాలి! ఆస్తుల మీద, సంపాదన, ఇన్కమ్ మీద విచారణ జరపాలి! దేశానికి పట్టిన ఈ దొంగ బాబాల పీడ విరగడ చేయాలి! ఒక రేప్, జర్నలిస్ట్ మర్డర్ కేసులో జైల్లో శిక్ష అనుభవిస్తున్న గుర్మీత్ అలియాస్ రామ్ రహీం కు పెరోల్ ఇప్పించి బయటకు తెస్తారు, హర్యానాలో ఎన్నికలకోసం అతన్ని ఉపయోగించుకుంటారు.

### ముస్లిం అయితే చంపేస్తారా?

హర్యానాలో ముస్లిం అనుకుని నీ కొడుకును చంపాము అని ఇటీవల గోవు దొంగిలించాడని, కారులో ఉన్న ఆర్యన్ మిశ్రా (19) అనే బ్రహ్మణ విద్యార్థిని కాల్చి చంపి అతని తల్లి తో నిందితులు అంటారు, అప్పుడమే ముస్లిం అయితే అతన్ని చంపే హక్కు మీకెవరు ఇచ్చారు. ముస్లింలు మా చుట్టుపక్కల అందరూ వారే ఉంటారు, మేము కలిసి, మెలసి ఉంటాము, అంటూ రోదిస్తూ ఆర్యన్ తల్లి చెప్పే మాటల వీడియో చూసి అయినా పీఎం మోడి మాట్లాడరు, మరో వైపు వారణాసి యూనివరిసిటీ లో ఒక యువతి పై అత్యాచారం జరిపి వీడియోస్ తీసిన ముగ్గురు బీజేపీ ఐటి సెల్ కార్యకర్తల లో ఇద్దరు విడుదల అయితే, వారికి పూల దండలతో స్వాగతం పలుకుతారు, ఒకవైపు ఒక దొంగ బాబా పాద ధూళి కోసం పోటీ పడి 130 మంది చనిపోతే స్పందన ఉండదు!

### దొంగ బాబాల పీడ!

ఈ దొంగ బాబాల పీడ ఎప్పుడు విరగడ అవుతుంది! ఈ దేశం ఎప్పుడు బాగుపడుతుంది. విద్వేషపు, విషపు రాజకీయాలకు బుద్ధి జీవులే స్వస్తి పలికే విధంగా చూడాలి!మన పుట్టుక, ఈ నేల మీది ప్రతీ జీవి పుట్టుక బయోలేజికల్ అయినపుడు ఈ దేశ ప్రధాని తన పుట్టుకే బయోలేజికల్ కాదని, ఈ శ్వరుడు తనతో మాట్లాడుతాడని చెబుతున్న అతనికి ఈ బాబా లకు తేడా ఉందంటారా? కొద్దిపాటి సోయి ఉన్న వారు విజ్ఞతతో ఆలోచించాలి!ఎడ్డీ బాగుల్లా ఉంటే ఎట్లా?అంతా తెలిసి తెలియనట్లు ఉండవద్దు! రామ్ దేవ్ బాబా లాంటి బహురూపుల వేశగాండ్ల బతుకులను ఎండగట్టాలి!




# శ్రామిక ఉపాధ్యాయులను గుర్తు చేసుకోవాల్సిన రోజిది



టీచర్స్ డే పేరుతో మనువాద భావజాలం లేదా పెట్టుబడి దారి భావజాలం అభివృద్ధి చేసే రోజు గానే కొనసాగుతున్నది. అహంకారపూరితమైన ఫ్యూడల్, పితృస్వామ్య అధిపత్యము , మానవుల మధ్య కులము మతము ప్రాంతము జాతి లాంటి అడ్డుగోడలు లేని , అసమానతలు లేని కులమత వివక్షతలేని మనిషిని మనిషిగా గుర్తించే ఉన్నత సమాజం కోసం భావి భారత పౌరులను తీర్చిదిద్దడమే గురువుల ధ్యేయంగా ఉండాలి. సోషలిస్టుల దృష్టిలో టీచర్స్ డే అంటే మనువాదానికి వ్యతిరేకంగా బూర్జువా భావజాలానికి వ్యతిరేకంగా శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సామాజిక అణిచివేతలకు వివక్షతలకు వ్యతిరేకంగా , అసమానతలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గ భావజాలాన్ని సోషలిస్టు భావజాలాన్ని అభివృద్ధిపరిచే ఆదర్శనీయమైన గురువుల స్ఫూర్తిని కొనసాగించాలి. అలాంటి గురువులు సావిత్రిబాయి, కొండపల్లి సీతారామయ్య, గణపతి లాంటి అనేకమంది శ్రామిక ఉపాధ్యాయుల బోధనలను గుర్తు చేసుకోవలసిన రోజే టీచర్స్ డే

**- జంపన్న**

జనంసాక్షి

# చక్కర్లు కొడుతున్న ప్రశ్న

“తరగతి గది నాలుగ్గోడల మధ్యే
దేశ భవిష్యత్తు నిర్మితమవుతుంది”
ఈ మాట ఎవరన్నారో మర్చిపోయానుగానీ
ఈ వాక్యాన్నయితే
అక్కడా ఇక్కడా పదే పదే చదివీ చదివీ
నేలలో మొక్కను నాటినట్టు
మనసులో బలంగా నాటుకున్నాను
బోధనాశాస్త్రాన్ని పలుమార్లు తిరగేసాను
బోధనా విధానాల్ని పసిగట్టి నేర్చేసాను
విశ్వవిద్యాలయంలో శిక్షణ తీసుకొని
వందకు వందశాతం కాకున్నా
ఎంతో కొంత ఆరితేరాను
పాఠశాల అనే ప్రపంచంలోకి
ఏమీ తెలియని వయసులో
విద్యార్థిగా అడుగుపెట్టినవాన్ని
ఎదిగీ ఎదిగీ రూపవిక్రియ చెంది
ఎన్నో తెలిసిన జ్ఞానినై
బోధకుడిగా అడుగుపెట్టాను
నాలుగురాళ్ళు వెనకేసుకోలేకపోయినా
మధ్యతరగతోడిలా బ్రతుకుతూపోయినా
ఏం పరవాలేదుగానీ
పనికొచ్చే నాలుగక్షరాలు నేర్పుతూ
మంచి నడవడిక నేర్పుతూ
నలుగురిని తీర్చిదిద్దాలన్న
ఆశయంతో నిలబడ్డాను
కానీ కొన్నాళ్ళకే
నాకో సత్యం బోధపడింది
మనసు జీర్ణించుకోలేని
వాస్తవం ఎదురుపడింది
ఆలస్యంగా అర్థమైన
ఆ అసలు విషయమేమిటంటే...
ఈ పాఠశాలలన్నీ
పాఠాలు నేర్పడానికై పనిచేయట్లేదని
పైసా వసూళ్ళ కేంద్రాలయ్యాయని
ఆధిక్యం కోసం
ఆర్థిక ఎదుగుదల కోసం
బండెడు పుస్తకాల మూటను
గుదిబండలా వీపుకెక్కించి
మార్కుల పేరిట, ర్యాంకుల పేరిట
మానసిక హింసకు గురిచేస్తూ
పిల్లల్ని బలిపశువుల్ని చేస్తున్నాయని
విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి
కారకాలవ్వాల్సిన పాఠశాలలు
యాంత్రిక జీవన విధానాల్ని అలవరచడాన్ని
కళ్ళారా ప్రతి రోజూ చూస్తూ
నేనో నిశ్చేష్టుడనై నిలబడిపోతున్నా
నన్నూ ఓ యంత్రంలా పనిచేయమంటుంటే
లోలోపల ఆవేశపు నది ఆనకట్టలు
తెంచుకుంటున్నా
ఆలుబిడ్డల ఆకలికేకలు గుర్తొచ్చి
బతకలేక బడిపంతులన్న నానుడిని బలపరుస్తూ
బతుకునీడుస్తున్నానుజీ
ఇప్పుడు నా మనసులో
చక్కర్లు కొడుతున్న ప్రశ్నొక్కటే
గతంలో దేశదేశాలకు ఎన్నో నేర్పిన మన దేశంలో
విద్య నేడో వ్యాపార వస్తువైపోయి
సామాజిక విలువలసలే లేని
విద్యాభ్యాసం జరుగుతుంటే
ఆ నాలుగ్గోడల మధ్య
నిర్ణయమవుతున్నది
దేశ వికాసమా? వినాశనమా?

జనంసాక్షి



**కార్తీక రాజు, హనుమకొండ**
**8977336447**

# తెలుగు విశ్వ విద్యాలయానికి పాల్కురికి పేరే ప్రామాణికం



తెలుగు సాహిత్యాకాశంలో సూర్యచంద్రులు అనదగిన మహా కవులు పాల్కురికి సోమనాథుడు బమ్మెర పోతనలు. పాల్కురికి సోమనాథుడు క్రీ.శ 1160-1240 నడిమి కాలానికి చెందినవాడు కాగా, పోతన 15వ శతాబ్దానికి చెందిన వాడు. శైవ, వైష్ణవ సంప్రదాయాలకు ప్రతీకగా తెలంగాణ తేనె మాగాణంలోని పాలకుర్తి, బమ్మెర గ్రామాలలో జన్మించారు. ఈ రెండు గ్రామాలు జనగామ జిల్లాలో ఒకదానికొకటి కూతవేటు దూరంలో ఉన్నవి. తెలుగు సాహిత్య చరిత్రలోనే కాదు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ ఈ ప్రాంతానికి ప్రత్యేక చరిత్ర సంస్కృతి ఉన్నాయి. సంప్రదాయబద్ధంగా వస్తున్న మార్గ కవితను కాదని దేశి కవితకు పట్టం కట్టిన ప్రజాకవి పాల్కురికి సోమనాథుడు,ప్రజల నోళ్ళల్లో, రోళ్లలో , రోకళ్ళలో దాగున్న ద్విపద ఛందస్సులో బసవపురాణము, పండితారాధ్య చరిత్ర లాంటి మహాకావ్యాలను జాతికి అందించిన వాడు. జాతీయ సమైక్యత స్ఫూర్తికి ఊపిరులూదిన వాడు, రాజులను రాజరికాలను ధిక్కరించిన వాడు రాజస్థానాన్నీ కాకుండా ప్రజాస్థానాన్ని ఆశ్రయించినవాడు.

ఉన్నత వర్గాలకే కాకుండా సాహిత్యంలో ఉత్పత్తి వర్గాలకు స్థానం కల్పించిన వాడు సోమనాథుడు. వృషాధిప శతకం ద్వారా తెలుగులో ప్రామాణిక శతక రచనలకు శ్రీకారం చుట్టినవాడు. కుల లింగ వివక్షతకు నిరసించినవాడు ప్రతిభావంతుడైన కవి కాబట్టి ఎన్నో ప్రయోగాలను చేసి ప్రయోజనం సాధించినాడు, అంటరానితనాన్ని నిరసించి తన గ్రంథాలను తెలుగు సాహిత్యానికి విజ్ఞాన సర్వస్వాలుగా తీర్చిదిద్దిన వాడు. తెలుగు సాహిత్యంలో సోమనాథుని ప్రతిభాపాటవాలకు సరితూగే కవులు అరుదు. ఇలా ప్రాచీన కాలంలో నవీనుడు, నవీన కాలంలో ప్రాచీనుడు పాల్కురికి సోమనాథుడు.

తెలుగు, తమిళ, మరాఠీ కన్నడ భాషాకవులలో గొప్పవాడుగా ఆదరింపబడుతున్న మహాకవి పాల్కురికి సోమనాథుడ్ని సముచితంగా సంభావించడం మన కర్తవ్యం. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం కావస్తుండడంతో ఉమ్మడి ఆస్తుల విభజన జరుగుతుంది. అందులో భాగంగా హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న తెలుగు విశ్వవిద్యాలయానికి ఎవరి పేరు పెట్టాలని చర్చ జరుగుతుంది. తెలంగాణ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలంలో ఇక్కడి భాషా సంస్కృతులు పరిరక్షించాలనే తపనతో సైద్ధాంతికంగా పాల్కురికి సోమనాథుడిని తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా ప్రచారం చేయడం జరిగింది.ప్రజలు,కవులు, కళాకారులు, మేధావులు ఈ వాదనకు మద్దతు పలికారు. తెలంగాణ సాహిత్య వ్యక్తిత్వానికి ఎత్తిన పతాకగా పాల్కురికి సోమనాధుడిని ఆరాధించారు, అభిమానించారు

జనంసాక్షి

ఈ నేపథ్యంలో రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ముఖ్యంగా గౌరవ ముఖ్యమంత్రివర్యులు అందరూ ఆమోదిస్తే తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడతామని తెలపడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పాల్కురికి సోమనాథ తెలుగు విశ్వ విద్యాలయంగా మారుతుందనుకున్న తరుణంలో ఆయన ప్రకటన నెత్తిన పిడుగు పడ్డట్లయ్యింది. సురవరం వారు మనం గౌరవించుకోదగిన వ్యక్తి. తెలంగాణలో కవులు పూజ్యం అన్న వారి వాదనను పరాస్తం చేస్తూ గోల్కొండ కవుల సంచికను వెలువరించారు. పాలమూరు విశ్వవిద్యాలయానికి వారి పేరు నిరభ్యంతరంగా పెట్టుకోవచ్చు గానీ తెలుగు విశ్వవిద్యాలయానికి మాత్రం భాష, చరిత్ర, సంస్కృతులు పునాదిగా వెలసిన తెలుగు విశ్వ విద్యాలయం కాబట్టి పాల్కురికి సోమనాధుని పేరు పెట్టడమే సముచితం గాను సగౌరవంగాను ఉంటుంది. ఈ విషయంలో ఎవరు కూడా భేషజాలకు పోకుండా తెలంగాణలో వెలసిన తెలుగు విశ్వ విద్యాలయానికి పాల్కురికి సోమ నాధుని తెలుగు విశ్వవిద్యాలయంగా నామ కరణం చెయ్యడమే సమంజసం ఇందులో రెండవ అభిప్రాయానికి తావులేదు.



**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**

## నీడ

నిరాశ
నీడ కూడా నన్ను వొదిలేసి
పోతుందని ఆశ
ఎప్పటికైనా నీడల్లోంచి నేను
బయటపడ్తానని

జనంసాక్షి

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

## ఆకలి కేకలు...ఆర్తనాదాలు..?

అయ్యో..!
అయ్యో..! ఓ దైవమా..!
ఎంత కష్టం..? ఎంత
కష్టం..?
ఎంతనరకం..?
బ్రతుకెంతనరకం..?
ఓ అన్నలారా..! ఓ
అక్కలారా..!
రెండు చేతులెత్తి
మొక్కుతున్నం..!
ఆదుకోండి..! ఆదుకోండి..!
మమ్ము
“జలదిగ్బంధంలో “
చిక్కుకుంటిమి..!
కళ్ళముందే ఇళ్ళన్నీ
కూలిపోయె
కన్నీళ్ళు వరదనీట
కొట్టుకుపోయె
పరువులు పోయె...సరుకులు
పోయె
వస్తువులు పోయె..గొడ్డు గోదా
పోయె
కట్టుబట్టలతో రోడ్లమీద
మిగిలిపోతిమి...
ఆకలేసి దాహమేసి
ఆపన్న హస్తాల కోసం...
పాలప్యాకెట్లకోసం ఎదురు
చూస్తూ
నడుములోతు నీళ్ళలో
మునిగి
కారు చీకట్లో...కన్నీటి
వరదలో
ఈదుకుంటూ
బ్రతుకుతుంటిమి...
ఓ అన్నలారా..! ఓ
అక్కలారా..!
రెండు చేతులెత్తి
మొక్కుతున్నం..!
ఆదుకోండి..! ఆదుకోండి..!
మమ్ము
“జలప్రళయంలో “
చిక్కుకుంటిమి!
2...
కోట్లు కోట్లు విరాళాలిస్తిరి....!
అధికారులకు ఆదుకొమ్మని.!
మధ్యలోనే మాయమాయె..!
మాకు మాత్రం చేరకపోయె..!
అయ్యో..! అయ్యో..! ఓ
దైవమా
ఎంత ఘోరం..? ఎంత
దారుణం..?
ఎటు చూసినా ధ్వంసమైన
ఇళ్ళే...
ఏ మనిషిని కదిలించినా
కన్నీళ్ళే...
ఉప్పొంగిపోయింది...
ఉగ్రరూపం దాల్చింది...
ఉరుకు పరుగులతో
వచ్చింది...
కసితో
కృష్ణమ్మ...కరుణించి...కాపాడి.
..
రక్షించాలిక...కన్నతల్లి...కనక
దుర్గమ్మ...
పంచభక్ష్య పరమాన్నాలు
మాకక్కర్లేదు
చాలును మా పిల్లలకు ఓ
పాలపాకెట్
ఓ పులిహోర పాకెట్ ఓ
వాటర్ బాటిల్...
రేపటికి మేం ప్రాణాలతో
బ్రతికేందుకు...
ఓ అన్నలారా..! ఓ
అక్కలారా..!
రెండు చేతులెత్తి
మొక్కుతున్నం..!
ఆదుకోండి..! ఆదుకోండి..!
మేమంతా “జలసమాధి”
ఐపోక ముందే..!

జనంసాక్షి

**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**

# ప్రభుత్వ భూమిని పరిరక్షించండి..!



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 05 (జనంసాక్షి) :**
శేరిలింగంపల్లి నియోజకవర్గం మక్త మహబూబ్పేట్ సర్వేనెంబర్ 44లో ఉన్న ప్రభుత్వ భూమిని తక్షణమే కబ్జాల నుండి కాపాడాలని శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్ కు గురువారం 'జనంకోసం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్త మహబూబ్ పేట్ సర్వేనెంబర్ 44/5లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని గతంలో మైనింగ్ పేరుతో లీజుకు తీసుకొని తదనంతరం ఫోర్జరీ సంతకాలతో స్వాధీనం చేసుకోవడమే కాకుండా ప్రస్తుతం పక్కనే సర్వేనెంబర్ 39లో ఉన్న చెరువు కట్టపై ప్రైవేటు నర్సరీని ఏర్పాటు చేసి ఆ స్థలాన్ని కూడా కబ్జా చేయడానికి చెరువుకట్ట ఎత్తును పెంచి కొందరు దళారులు చట్టాలను చేతిలోకి తీసుకుంటున్నారని, తక్షణమే మండల రెవెన్యూ విభాగం అధికారులు నిజనిర్ధారణ గావించి సర్వేనెంబర్ 44/5, సర్వే నెంబర్ 39 లో ఉన్న చెరువు కట్టను స్వాధీనపరచుకోవాలని కసిరెడ్డి భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. సామాజికవేత్తగా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధిగా సమాజ హితంకోసం పాటుపడుతున్నానని, తాను కొనసాగించే పోరాటం ఎక్కడ తన వ్యక్తిగత స్వార్థంకోసం ఉండదని కసిరెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ తన మనస్తత్వాన్ని, ఆలోచనదోరని గమనించే శేరిలింగంపల్లి చెరువులను, శిఖం భూములను, ఇతరత్రా ప్రభుత్వ భూములను పరిరక్షించడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం తన నిస్వార్ధతకు నిదర్శనమన్నారు. మండల డిప్యూటీ కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకొని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళైనా మక్త మహబూబ్పేట్ ప్రభుత్వ భూమిని పరిరక్షించి తీరుతానని ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనంకోసం సంస్థ ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## 10.10 కోట్లతో అభివృద్ధి పనులు

### ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్5 (జనంసాక్షి)**
నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు గురువారం నార్సింగి మునిసిపాలిటీ పరిధిలో 1, 2, 3, 11, 12, 13, 14వ వార్డులలో రూ. 10.10 కోట్లతో పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకప్పుడు మారుమూల గ్రామంలో ఉండి సరైన రోడ్లు మాలిక వసతులు లేకుండా ఉండేదని, నేడు నార్సింగి రూపురేఖలు మార్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపాల విజయబాబు, ముదిరాజ్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కౌన్సిలర్లు బొల్లి యదమ్మ, రేఖా యాదగిరి, దుర్గేష్ యాదవ్ , శివారెడ్డి, కె లక్ష్మీ ప్రవల్లిక కిరణ్, గోపాల సునీత గణేష్, అమరేందర్ రెడ్డి, విజేత ప్రశాంత్ యాదవ్ , ఆదిత్య రెడ్డి, నరేష్, ఆర్. నరసింహ, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్, జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణ మోహన్ రెడ్డి, డిఇ. నరసింహ రాజు మేనేజర్ యోగేష్, ఎఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఫలక్ నూమా ఆర్ఓబి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### కమిషనర్ ఆమ్రపాలి కాట

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 05 (జనంసాక్షి):**
ఫలక్ నూమా ఆర్ఓబి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ ఆమ్రపాలి చార్మినార్ జోన్లో పర్యటించి చేపట్టనున్న ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె బండ్లగూడ ఫ్లైఓవర్ జంక్షన్ పనులను పరిశీలించారు. బండ్లగూడ నుండి ఎర్రకుంట వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ, తులసీ నగర్ నుండి గౌస్ నగర్ వయా మైలార్ దేవల పల్లి కాటేదాన్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు, ట్రిబ్యునల్ నుండి టిప్పు ఖాన్ మజీద్ వరకు, ఇంజన్ బౌలి, బాబా బజార్ నుండి భవాని నగర్ వరకు షేక్ ఫైజ్ కమాన్ నుండి డబీర్ పుర ఫ్లైఓవర్ వరకు ప్రతిపాదిత రోడ్డు విస్తరణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఆర్ఓబి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతిపాదిత రోడ్డు విస్తరణ,పనుల కోసం కావల్సిన భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సి ఈ దేవానంద్, ఎస్ ఈ దత్తు పంతు, చార్మినార్ జోన్ సిటీ ప్లానర్ మాజిద్, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్విఘ్నంగా పూర్తి చేయాలి

### జెడ్సీ ఉపేందర్ రెడ్డి




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 05 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించే గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొలి రోజునుండి మొదలుకొని నిమజ్జనం పూర్తయ్య వరకు ఎలాంటి నిర్విఘ్నం లేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ సమక్షంలో 'వినాయక ఉత్సవం-2024కు సంబంధించి సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. ఇందులో భాగంగా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు గత సంవత్సరం ఎదురైన సవాళ్లను, అసౌకర్యాలను సమావేశంలో ప్రస్తావించారు. అంతేకాకుండా ప్రస్తుత వినాయక చవితి పర్వదినాన్ని, నవరాత్రి ఉత్సవాలను సజావుగా జరుపుకోవడంకోసం జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఆయా అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. మంచినీటి సదుపాయాలు సకాలంలో అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపించాలని, నిమజ్జన ఊరేగింపు మార్గాలవద్ద చెట్ల కొమ్మలను తొలగించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరారు. పరిశుభ్రత కలిగిన ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతోపాటు ఊరేగింపు మార్గాల్లో ఉన్న రహదారుల పై గోతులు పూడ్చడం, రోడ్లను తక్షణం మరమ్మతు చేయడం, హాంగ్ అవుట్ కేబుల్స్ తొలగించడం వంటి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికను పూర్తి చేయాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. వినాయక మండపాలవద్ద శానిటేషన్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడం, దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఊరేగింపు మార్గాలలో వీధి దీపాల ఏర్పాటు, అవి సక్రమంగా పనిచేసేలా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని వారు జెడ్సీ ని కోరారు. వినాయక విగ్రహాల నిమజ్జన కేంద్రాలవద్ద ప్రత్యేక క్రేన్ల ను ఏర్పాటు చేసి వాటి సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏర్పాట్లను వేగవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖలు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అదనపు వైద్య ఆరోగ్య అధికారులు, యుబిడి విభాగం డిప్యూటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.




## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించాలి

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు సెప్టెంబర్ 5(జనంసాక్షి)**
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని గంజ్ ఆవరణలో "ఫ్రెండ్స్ ఫౌండేషన్" వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి గణపతి విగ్రహాలను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మట్టి వినాయకుల ద్వారా ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయని వెల్లడించారు. మట్టి వినాయకుని నిమజ్జనం చేయడం ద్వారా జలచరాసులకు ఇలాంటి హాని జరగదని తెలిపారు. అదేవిధంగా నీటిలో ఎలాంటి కాలుష్యం ఏర్పడదని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు "ఫ్రెండ్స్ ఫౌండేషన్" వారు ఒక లక్ష ఒక వేయి రూపాయలు) ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతూ చెక్కును ఎమ్మెల్యే కు ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. దీంతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రేండ్స్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు.

## మాసబ్ చెరువును కాపాడాలి



### మాసాబ్ చెరువు పరిరక్షణ కమిటీ డిమాండ్

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :**
మాసాబ్ చెరువు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని మాసాబ్ చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం తుర్కయంజాల్ మాసాబ్ చెరువును మాసాబ్ చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ...మాసాబ్ చెరువు పరిధిలోని ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి చెరువును కాపాడాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై ఎఫ్టీఎల్ లే అవుట్ చేసి అమాయక ప్రజలకు ఇళ్ళ స్థలాల పేరుతో వ్యాపారం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై, లే అవుట్లకు పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో అక్రమ నిర్మాణాలపై హైడ్రాను కలవనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాసబ్ చెరువు పరిరక్షణ కమిటీ నాయకులు గుత్త మహేందర్ రెడ్డి, కొంతం యాదిరెడ్డి, కిషన్, బొక్క వంశీదర్ రెడ్డి, కరుణాకర్, కళ్యాణ్ నాయక్, అరుణ్ కుమార్, బోసు పల్లి ప్రతాప్, రావుల వీరేశం, వడ్డ గోని అజయ్, వినోద్, కొండ్రు పురుషోత్తం, మాధవరెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## భూ మాత..మాకు మీరే దిక్కు..!

### ఫార్మాసిటీ మా కొద్దంటు ఆలయాల చుట్టూ రైతుల ప్రదర్శనలు..!



**న్యాల్ కల్, సెప్టెంబర్ 05, (జనం సాక్షి) :**
అమ్మ భూ మాత.. మా భూములను రక్షించి, మమ్మల్ని కాపాడుకునే దిక్కు మీ రొక్కరే.. మీరు ఆశీర్వదించి మమ్మల్ని ఆదుకుంటేనే మా జీవితాలు సురక్షితం. వందలాది కుటుంబాలు వ్యవసాయాన్నె నమ్ముకుని జీవిస్తున్నాం. వ్యవసాయమే మాకు ప్రధాన జీవనాధారం. పంచ భూతాలను నాశనం చేసే ఫార్మాసిటీ కంపెనీ ఏర్పాటుతో మా జీవితాలు రోడ్డున పడతాయి అంటూ.. సంగారెడ్డి జిల్లా, న్యాల్కల్ మండలం, డప్పూర్ గ్రామానికి చెందిన ఫార్మ సిటీ భూ నిర్వాసితులు గురువారం నాలుగవ రోజు వినూత్నంగా నిరసన చేపట్టారు. గ్రామానికి చెందిన వందలాది మంది భూ నిర్వాసితులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, ఆలయాల చుట్టూ ప్రదిక్షణలు చేసి మా భూములను మీరే పాడాలని వేడుకున్నారు. గ్రామంలోని పలు ప్రధాన వీధుల్లో మంగళ హారతులతో జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు.

**ఆలయాల చుట్టూ ప్రదిక్షణలు, ప్రత్యేక పూజలు..!**
గ్రామానికి చెందిన రైతులు, మహిళా రైతులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామంలోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి ప్రార్ధనలు చేశారు. గ్రామ దేవతలైన భూ మాత, లక్ష్మీదేవి, దుర్గామాత, రామాలయం, హనుమాన్ దేవాలయం, బీరప్ప దేవాలయం, రేణుకా మాత, తదితర గ్రామ దేవతలకు మంగళ హారతులతో ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.



## కార్పొరేటర్ చోరవతో కాలనీవాసుల సమస్యకు పరిష్కారం

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి)**
హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి డివిజన్ లోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో రాత్రి కురిసిన భారీ వర్షానికి, వర్షపు నీరు రోడ్డు పైన నిలిచి కాలానివాసులకు ఇబ్బంది అవుతుందని మార్నింగ్ పర్యవేక్షణ ద్వారా తెలుసుకున్న కార్పొరేటర్ వెంటనే స్పందించి సంబందించిన అధికారుల ద్వారా వర్షపు నీటి నాలా పైన నీరు నిల్వకుండా నాలా పైన ఉన్నటువంటి రోడ్డు లోతట్టు ప్రాంతంలో యంత్రాం ద్వారా ఒక రంధ్రం చేయించి నీరు నాలాలోకి వెళ్లే మార్గం కార్పొరేటర్ దగ్గర ఉండి చేయించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, కాలానివాసులు తదితరులు పాల్గొన్నారు.



## వాహనదారులకు, వాహనాలకు రక్షణ కవచం 'డాడీస్ రోడ్డు ఆఫ్ స్టిక్కర్, సేఫ్టీ ఆప్'

### జిల్లా ఎస్పీ డి. జానకి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
వాహనదారులకు, వాహనాలకు" డాడీస్ రోడ్డు ఆఫ్ స్టిక్కర్, సేఫ్టీ ఆప్ 'రక్షణ కవచం లాంటిదని ప్రాధాన్యత ఇవ్వాలని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో గురువారం డాడీ రూట్ ఆఫ్ స్టిక్కర్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్, సేఫ్టీ ఆప్ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనాల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా రూపొందించిన "డాడీస్ రోడ్డు స్టిక్కర్, సేఫ్టీ అప్" ను ప్రతి వాహనదారులు మరియు వాహనం సురక్షితంగా ఉండడం కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతనంగా రూపొందించిన "డాడీస్ రోడ్డు" వలన వాహనదారులకు, వాహనాలకు రోడ్డు ప్రమాదం గురైనపుడు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ప్రమాదం గురైన వాహనదారుని ప్రాణాలు కాపాడుటకు, పార్కింగ్ సమస్య పరిష్కరించడానికి, డాక్యుమెంట్లు భద్రపరుచుటకు, డాక్యుమెంట్ వాలిడిటీ గురించి ముందుగా సమాచారం ఇచ్చి గుర్తు చేయుటకు, ఒక మినీ బ్లడ్ బ్యాంకు డోనార్కి సమాచారం ఇచ్చి ప్రమాదానికి గురైన వాహనదారుని ప్రాణాలు కాపాడుటకు ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ సందర్భంగా స్టిక్కర్, సేఫ్టీ ఆప్ ద్వారా వాహనాల భద్రతకు ఎలాంటి ఉపయోగం ఉంటుందో ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు, ఏస్బిసిఐ, "సహాయ ఫౌండేషన్" వ్యవస్థాపక అధ్యక్షులు టంకరి శివప్రసాద్ యాదవ్, ఫౌండేషన్ సభ్యులు గొల్ల నాగరాజు, సౌట కుర్మయ్య, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

### ట్రైనీ కలెక్టర్ గరిమ



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే వారి వృత్తికి గౌరవమని జిల్లా ట్రైనీ కలెక్టర్ గరిమ నరుల అన్నారు. గురువారం రెవిన్యూ డివిజనల్ అధికారి సమావేశం హాల్లో మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవంలో ట్రైనీ కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిని వెలిగించి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రశంసనీయమని అన్నారు. తాను ఈ స్థాయికి చేరుకున్నానంటే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందేశం వినిపించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు. బిఈఓ అబ్దుల్ ఘని మాట్లాడితే సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులలో ఉందని అన్నారు. ఉపాధ్యాయులుగా పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందించారు. డి ఆర్డిఓ మొగులప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యత కలిగినదని తెలిపారు. సమాజానికి దిక్సూచి లాంటి ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలన్నారు. ఏ ఎంఓ మాట్లాడుతూ 90 మంది హెల్ప్ టీచర్లను నియమించుకున్నామని, 284 మంది అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించుకోవడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ల సూచనలు మేరకు జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచామని తెలిపారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులని వారు ప్రతి రోజు కొత్త విషయాలు బోధిస్తారని తెలిపారు. ఎస్ ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 44 మంది ఉపాధ్యాయులకు మొమెంటు శాలువాతో ట్రైనీ కలెక్టర్ డీఈవో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యండి అబ్దుల్ ఘని,డి. పిఆర్ఓ. రషీద్, సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, విద్యాసాగర్, రాజేందర్ కుమార్ పద్మ నళిని, నాగార్జున, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**వెల్దుర్తి సెప్టెంబర్ 5 (జనం సాక్షి)**
ప్రాథమిక పాఠశాలలో 14 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇటీవల బదిలీ అయినప్పటికీ వారిని రిలీవ్ చేయడం లేదని, వెంటనే వారిని రిలీజ్ చేసి, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్జీటీయూ ప్రధాన కార్యదర్శి అరికల వెంకటేశం అన్నారు. గురువారం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్జిటియు రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డితో కలిసి వెంకటేశం ఎమ్మెల్సీ కోదండరామ్ కు వినతి పత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్, ఎల్ఎఫ్ ఎల్ హెడ్మాస్టర్ పోస్టులకు డిఎడ్ మరియు బి.ఎడ్ వారితో కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పించుటకు జీవో 11,12ను సవరణ చేయాలని, నెల నెల పదోన్నతులు కల్పించి 25 సంవత్సరాలకు పైగా ఎటువంటి పదోన్నతులు పొందకుండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యా వ్యవస్థలో అత్యధిక సంఖ్యలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు విద్యారంగంలో ప్రాధాన్యత కల్పించాలని వారు కోరారు.




## అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

### తుంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట్ గోపాల్

**హైదరాబాద్ సెప్టెంబర్ 05 (జనంసాక్షి)**
ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని తుంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట్ గోపాల్ అన్నారు. గురువారం దేవరయాంజాల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తూంకుంట మున్సి పాలిటీ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ ఆదేశాలపై టౌన్ ప్లానింగ్ అధికారిని హరిక సారథ్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను ఉపేక్షించ బోమని పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
06 సెప్టెంబర్ 2024

# సమాజ పరివర్తనలో అగ్రభాగాన విధ్య

- సర్వే పల్లి రాధ కృష్ణ ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతిగా చేశారు
- ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసి సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలి
- రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు





**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 05 (జనంసాక్షి)**

సమాజ పరివర్తనలో విధ్య అగ్రభాగాన ఉంటుందని అలాంటి విద్యను బోధించే ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసి సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉద్బోధించారు. డా. సర్వేపల్లి రాధా కృష్ణ జన్మ దినం అయిన సెప్టెంబర్ 5 గురువారం రోజు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కళ్యాణ సాయి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సర్వే పల్లి రాధ కృష్ణ ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి హోదాలో పని చేశారని వారి పుట్టిన రోజున ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలుపుతూ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనకు తాను సంస్కరించుకొని సమాజ పురోభివృద్ధికి పాటు పడే విధంగా ఉత్తమ వ్యక్తులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇటీవలే ఉపాధ్యాయ పదోన్నతులు కల్పించి బదిలీలు సైతం పారదర్శకంగా నిర్వహించడం జరిగిందన్నారు. తనకు వచ్చే 10 కోట్ల బడ్జెట్‌తో పాటు సి.ఎస్.ఆర్ ఫండ్ సైతం విద్య, వైద్యానికే ఖర్చు చేయాలని జిల్లా కలెక్టర్‌ను సూచించారు. ప్రభుత్వం తరపున అన్ని చేస్తున్నాం కాబట్టి ఉపాధ్యాయులు నిబద్ధత పని చేసి నాన్యమైన విద్యను బోధించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టింది తమిళనాడులోని తిరుత్తనూర్‌లో అయిన ఆయన మన తెలుగువాడు అని గర్వంగా చెప్పుకొచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద దాదాపు 500 పాఠశాలకు 13.50 కోట్ల నిధులతో మౌలిక వసతులు కల్పించిందన్నారు. ఉపాధ్యాయుల నుండి సమాజం ఎంతో ఆశిస్తుందని విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పి. మహేష్, మోటివేటర్ భాస్కర్ గుప్త, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బట్ట ఫ్లెక్సీలను వాడదాం పర్యావరణాన్ని కాపాడుదాం

**మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్**



**సిద్ధిపేట బ్యూరో సెప్టెంబర్ 05 (జనం సాక్షి)**

సిద్దిపేట పట్టణంలో ఉన్న అన్ని ఫ్లెక్సీ ప్రింటింగ్ యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ సిద్దిపేట పట్టణ ప్రజలు పలు ప్రచారాలు,శుభాకాంక్షలు తెలిపే క్రమంలో ఇక నుండి ఫ్లెక్సీ ప్రింటింగ్‌కు బదులు తప్పనిసరిగా బట్ట ఫ్లెక్సీలను మాత్రమే వాడాలని కమిషనర్ సూచించారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు పర్యావరణానికి హాని కలిగిస్తుందని కావునా బట్ట ఫ్లెక్సీలను మాత్రమే వాడాలని ప్లాస్టిక్ ఫ్లెక్సీలను ముద్రించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వెంటనే ప్రింటింగ్ యజమానులకు నోటీసులు సైతం జారీ చేయాలని దేవరాజును ఆదేశించారు. ప్రింటింగ్ యాజమాన్యం సైతం ఇతరులను ఎలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు ఉన్న వాటిని ముద్రించవద్దన్నారు. సిద్దిపేట పట్టణంలో ఫ్లెక్సీ ప్రింటింగ్ యాజమాన్యం ఫ్లెక్సీలను ఏర్పాటు చేసే ప్రాంతాలు, ఎప్పుడు, ఎన్ని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారో వాటి వివరాలు తప్పనిసరిగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు.

# నిండిన సింగూరు

- ఆనందంలో మంత్రి దామోదర
- రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేసిన మంత్రి



**సంగారెడ్డిప్రతినిధి, సెప్టెంబర్ 5(జనంసాక్షి)**

వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు సింగూరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సింగూర్ ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యానికి నీటిమట్టం చేరుకోవడంతో గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తో కలిసి ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. ప్రాజెక్టుకు వస్తున్న వరద పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సింగూరు జలాశయానికి వరద ఉధృతి పెరుగుతుండడంతో ప్రాజెక్టు 4,6 నంబర్ల రెండు గేట్లను 1.50 మీటర్ల పైకెత్తి 16284 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 28.555 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇందులో జెన్ కో ద్వారా 2822 క్యూసెక్కులు, రెండు గేట్ల ద్వారా 16284 క్యూసెక్కుల నీటిని మొత్తం 19106 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సింగూర్ ప్రాజెక్టు నిండు కోవడం వలన ఆయకట్టు రైతంగానికి ఏడు రెండు పంటల సాగుకు ఢోకా ఉండదని అన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టని చేరుకొని జలకళ సంతరించుకోవడం సంతోషకరమన్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుండి భారీగా వరదనీరు వస్తుండడంతో దిగువకు నీరు వదిలామన్నారు. ప్రాజెక్టు దిగువన ఉన్న మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సింగూరు నిండుకుండల మారడంతో ఈ ప్రాంతమంతా సాగునీటితో సస్యశ్యామలం కానుందన్నారు. అనంతరం ప్రాజెక్టు సమీపంలోని టూరిజం పార్కును సందర్శించారు. పార్కులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మంత్రి హామీనిచ్చారు. అనంతరం బస్వాపూర్ మోడల్ స్కూల్లో సందర్శించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు కె. ధర్మ, సిఈ, భీమ్ ఇఇ, నాగరాజు డీఈఈ, ఆర్‌డిఓ పాండు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు కరువైన రక్షణ



**మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ**

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

అదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచార హత్యాయత్నం ఘటన పట్ల గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు రక్షణ కరువైందని మండిపడ్డారు. రాఖీ కట్టడానికి వెళుతున్న ఆదివాసీ మహిళపై ఆటో డ్రైవర్ మగ్దూం అత్యాచార యత్నం చేసి హత్యకు పాల్పడడం దారుణమని అన్నారు.ఎక్కడో మహిళలపై అఘాయిత్యాలు జరిగితే గగ్గోలు పెట్టే సంఘాలు రాష్ట్రంలోనే దారుణం జరిగితే వారి నోళ్ళు ఎందుకు మూతపడ్డాయి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలపై దారుణాలు పెరిగి పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆదివాసీ మహిళపై దారుణం జరిగినా ముఖ్యమంత్రి స్పందించక పోవడం దేనికి సంకేతం అన్నారు.ఒక వర్గానికి ఈ అండగా నిలుస్తున్నది ఆరోపించారు.మహిళపై దారుణానికి పాల్పడడమే కాకుండ హిందూవుల ఇళ్లు దుకాణాలను ద్వసం చేసినా ప్రభుత్వంలో చలనం లేదని అన్నారు.ఆదివాసీ మహిళకు మెరుగైన వైద్యం అందించి నష్టపోయిన హిందు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దారుణానికి పాల్పడిన మగ్దూం ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు రామయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి సుజాత, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి ప్రమీల, పట్టణ అధ్యక్షుకు అపిరెడ్డిపల్లి నర్సమ్మ, కార్యదర్శి అనిత తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకుందాం



**ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

**మఖ్తల్ సెప్టెంబర్ 05 (జనంసాక్షి)**

మఖ్తల్ పట్టణంలో రాబోయే వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకుని అందరికీ ఆదర్శంగా నిలుద్దామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. పట్టణంలోని వట్టం రవి కన్వెన్షన్ హాల్‌లో సీఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి సమావేశంలో ఎమ్మెల్యే తోపాటు బీజేపీ రాష్ట్ర నాయకులు బి.కొండయ్య, బీఆర్ ఎస్ నియోజకవర్గ నాయకులు రాజుల ఆశిరెడ్డి, ధార్మిక సంస్థల ప్రతినిధులు, మైనార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ పట్టణంలో మతాల కతీతంగా హిందూ ముస్లిం సోదరులు కలిసిమెలిసి పండుగలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. తాను సైతం చిన్నతనంలో వినాయక ఉత్సవాల సమయంలో చందాల కోసం తిరిగానని గుర్తు చేసుకున్నారు. వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకుందామని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ఉత్సవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో రమేష్, నేతలు చంద్రకాంత్ గౌడ్, గణేష్ కుమార్ ,రవికుమార్, బాల్చేడ్ మల్లికార్జున్, రాజశేఖర్ రెడ్డి, కల్లూరి నాగప్ప, సత్యనారాయణ గౌడ్ , అన్వర్ హుస్సేన్ ,శంషుద్దీన్, గణేష్ మండపాల నిర్వాహకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వర్య కుట్రను తిప్పికొట్టాలి



**కలెక్టరేట్ ముందు బీకేఎంయూ ధర్నా**

**సంగారెడ్డిప్రతినిధి, సెప్టెంబర్ 5(జనంసాక్షి)**

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు పన్నుతోందని కేంద్రం కుట్రని తిప్పి కొట్టాలని భారతీయ కేర్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ)ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం డిఆర్ఓ రజినికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా బి కే ఎం యు జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు వినోద, తాజుద్దీన్ లు సంయుక్తంగా మాట్లాడుతూ ఎప్పుడైతే కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టిందో అప్పటినుండి జాతీయ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా ప్రతి సంవత్సరం కేటాయించే బడ్జెట్‌ను తగ్గిస్తుందన్నారు. మరో పక్క పని దశాదిశను పూర్తిగా మార్చేసింది. ఉపాధి హామీ కూలిలకు రెండు పూటలు ఫోటోలు దిగే పద్ధతి లేకుండా మోడీ వచ్చిన తర్వాత కొత్త పద్ధతి తెచ్చారని, కేంద్రం కుట్రని రైతు కార్మిక సంఘాలు ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్తఫా, పాండు, యాకూబ్ అలి, చిరంజీవి, మహబూబ్ అలీ, పాషా, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

**కొండాపూర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి)**

జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ చంద్రయ్, కొండాపూర్ ఎస్ఐ హరిశంకర్‌లు మాట్లాడుతూ సూర్యపేట జిల్లా హుజుర్‌నగర్‌కు చెందిన సన్నిధి ఆంజనేయులు నల్గొండ, సూర్యాపేట, వరంగల్, ఖమ్మం, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆయా మండలాల్లో చోరీలకు పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. గురువారం కొండాపూర్, సదాశివపేట, మునిపల్లి. కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా ఆంజనేయులు పట్టుబడినట్లు తెలిపారు. చేస్తూ పట్టుపడ్డాడు. అతనిపై 30 కేసులు పైగా ఉన్నాయన్నారు. అతని వద్ద 39.4 తులాల బంగారాన్ని, 188 తులాల వెండి, 9,50,000 నగదు గుర్తించారు. అతని వద్ద ఉన్న 15.8 తులాల బంగారాన్ని రికవరీ చేశామన్నారు. చాకచక్యంగా తన సిబ్బంది వ్యవహరించి నిందితుడిని పట్టుకొని రిమాండ్ తరలించామన్నారు.

# గురువులను దైవంగా భావించేది మన సంస్కృతి

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

గురువులను దైవంగా భావించే సంస్కృతి మనదని, తల్లిదండ్రుల తర్వాత గురువులదే స్థానం అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమానులు వేసి, కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని, గురువులను దైవంగా భావించే సంస్కృతి మనదని, తల్లిదండ్రుల తర్వాత గురువులదే స్థానం అని, గురువులు పౌరులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారందరూ ఉత్తమ పౌరులుగా తయారయ్యేలా చూడాలని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన, కమ్యూనికేషన్ స్కిల్స్, హ్యాండ్ రైటింగ్, వ్యక్తిగత పరిశుభ్రత, పెద్దలను గౌరవించే విధానాలను వారికి నేర్పాలని, ఇంట్లో తల్లితండ్రులు చెబితే పిల్లలు అంతగా గుర్తించుకోరని కానీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏం చెప్తే అది విద్యార్థులు ఎక్కువ కాలం గుర్తుంచుకుని దానిని పాటిస్తారని ఆమె అన్నారు. ప్రైమరీ టీచర్లకు చాలా ఓపిక, సహనం ఉండాలని, విద్యార్థుల భవిత, భవిష్యత్తు ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి ఉమామహేశ్వర్, ఈఈ. హౌసింగ్ వైద్యం భాస్కర్, జిల్లా వెల్ఫేర్ అధికారి, ఎడి. అనసూయ, ఎఎంఓ. శ్రీనివాసులు, సీఎంవో బాలు యాదవ్, మానిటరీ ఆఫీసర్ సంపత్, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూమాతకై ధరణి బాధితుల ఎదురుచూపులు

**తప్పులను సరిచేస్తారనే ఆశల్లో రైతులు**

**ఆగష్టు23తో ముగిసిన అభిప్రాయ సేకరణ**



**వనపర్తి,సెప్టెంబర్05(జనంసాక్షి)**

భూ సమస్యల నివారణ దిశగా భూమాత పేరుతో కొత్త చట్టాన్ని తీసుకొస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అధ్యయనం కోసం కమిటీని ఓ నియమించింది. దీంతో ధరణి పోర్టల్‌లో సమస్యలున్న బాధితుల్లో తమ భూముల వివరాలను సరిచేసుకోవచ్చన్న ఆశలు చిగురించాయి అందుకే భూమాత చట్టం రాక కోసం ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ పేరు వింటేనే రైతుల గుండెల్లో దడ పుట్టేది. ఎందుకంటే ఆ పోర్టల్ అంతా తప్పులతడకే. భూ క్రయవిక్రయాలకు సంబంధించి రాష్ట్ర రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. అసలు ధరణి పోర్టల్ ఉన్న సమస్యలు ఏంటి..? దాని వల్ల రైతులకు కలుగుతున్న ఇబ్బందులు ఏంటి..? అనే అంశాలను కాంగ్రెస్ పార్టీ నిశితంగా పరిశీలించింది. ధరణి పోర్టల్ వల్ల కలుగుతున్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాడింది. భూ సమస్యలకు నిలయంగా మారిన ధరణి పోర్టల్‌ను తాము అధికారంలోకి రాగానే ఎత్తేసి..దాని స్థానంలో భూమాత అనే పోర్టల్‌ను తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసింది. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో..అన్నదాతకు ఇచ్చిన మాట ప్రకారం.. భూమాత పోర్టల్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమైంది.

## భూమాతపై సంప్రదింపులకు శ్రీకారం

గత ప్రభుత్వ హయాంలో పలు పథకాలు ఏకపక్షంగా అమలు జరిగాయని అందుకే తాము ప్రజలతో చర్చించి వారి సలహా మేరకు భూమాతను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు ఆగష్టు 23వ తేదీని గడువుగా నిర్ణయించి జిల్లాల వారీగా సంప్రదింపులు చేసి సలహాలు స్వీకరించారు.రాష్ట్ర ప్రజలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, వారిచ్చిన సూచనలు, సలహాల మేరకు కొత్త ఆర్‌వోఆర్ బిల్లుకు తుది రూపమిచ్చి అసెంబ్లీలో తీర్మానం చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ధరణిలో పరిష్కారం దొరకని సమస్యలను పరిష్క రించడంతో పాటు, భవిష్యత్తులోనూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మార్పులు, చేర్పులు చేసేందుకు వీలుగా కొత్త సమగ్ర ఆర్‌వోఆర్ - 2024 ముసాయిదాకు రూపకల్పన చేసినట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇది వరకే ప్రకటించడం గమనార్హం.

## ఆర్‌వోఆర్ -2024 ముసాయిదా లక్ష్యాలు..

ఆర్‌వోఆర్ -2024 ముసాయిదా ప్రకారం.. భూహక్కుల రికార్డులను ఎప్పటికప్పుడు సవరించడం, ఇప్పటి వరకు పాస్‌బుక్‌లు రాని భూముల సమస్యలను పరిష్కరించడం, సర్వే చేసి కొత్తగా భూ హక్కుల రికార్డు తయారు చేసుకునే అధికారాన్ని కల్పించడమే ప్రధాన ఉద్దేశాలుగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూ ఆధార్, ఆబాదీలకు ప్రత్యేక హక్కుల రికార్డు, అప్పీల్, రివిజన్ వంటి సెక్షన్లను ముసాయిదా బిల్లులో ప్రతిపాదించారు. తెలంగాణలో ఇప్పటి వరకు అమలైన 1936, 1948, 1971, 2020 నాటి చట్టాలను నిశితంగా పరిశీలించి, వాటి అమలు వల్ల వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకొని కొత్త చట్టాన్ని రూపొందించారు. తెలంగాణలో ఆర్‌వోఆర్ చట్టాల అమలు చరిత్ర, ప్రస్తుత సమస్యలు, రాబోయే అవసరాలను అంచనా వేసి మొత్తం 20 సెక్షన్లతో 23 పేజీలతో ముసాయిదాను సిద్ధం చేసింది ప్రభుత్వం. ఈ క్రమంలో 18 రాష్ట్రాల్లోని ఆర్‌వోఆర్ చట్టాలను ప్రభుత్వం పరిశీలించింది. బీహార్‌లో అమల్లో ఉన్న మ్యుటేషన్ చట్టాన్ని కూడా అధ్యయనం చేసింది. భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య(భూధార్), గ్రామీణ ప్రాంత ఆస్తుల రికార్డు తయారు చేయడం ద్వారా భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చే మార్పులకు అనుగుణంగా చట్ట సవరణలు చేయాల్సిన అవసరం లేకుండా అమలు చేసే వెసులుబాటు కల్పించింది. ప్రస్తుత సమస్యలు, రాబోయే అవసరాలకు మార్గం చూపేలా సెక్షన్లను ఏర్పాటు చేసింది. ఆర్‌వోఆర్ -2024 ముసాయిదా రూపకల్పనలో భూచట్టాల నిపుణుడు ఎం. సునీల్ కుమార్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సీఎంఆర్‌వో ప్రాజెక్టు డైరెక్టర్ వి లచ్చిరెడ్డి భాగస్వాములయ్యారు. 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్-2024' ముసాయిదాను భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది ప్రభుత్వం.




# పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు



స్వేచ్ఛా పత్రికా లేదా స్వతంత్ర మీడియా అనేది పనిచేసే ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలలో ఒకటి. 21 వ శతాబ్దంలో, మనం ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థలను జరుపుకుంటున్నప్పుడు, పత్రికా స్వేచ్ఛ, భద్రత మరియు జర్నలిస్టుల పని పరిస్థితులపై నిఘా ఉంచడం అవసరం. యునైటెడ్ నేషన్స్ యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్టికల్ 19 ప్రకారం పత్రికా స్వేచ్ఛను సమర్థిస్తుంది, ఇది ఇలా పేర్కొంది, "అభిప్రాయం మరియు భావప్రకటన స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంది; ఈ హక్కులో జోక్యం లేకుండా అభిప్రాయాలను కలిగి ఉండే స్వేచ్ఛ మరియు సరిహద్దులతో సంబంధం లేకుండా ఏదైనా మీడియా ద్వారా సమాచారం మరియు ఆలోచనలను వెతకడం, స్వీకరించడం మరియు అందించడం వంటి స్వేచ్ఛ ఉంటుంది.అంతర్జాతీయ చట్టాల ప్రకారం మరియు రాష్ట్ర రాజ్యాంగ నిబంధనల ప్రకారం పత్రికా స్వేచ్ఛను గుర్తించినప్పటికీ, జర్నలిస్టులపై దాడి చేయడం మరియు చివరికి సమాచారం పొందడంపై ఆందోళన పెరుగుతూనే ఉంది. జఔ ప్రకారం, 2021లో 55 మంది జర్నలిస్టులు చంపబడ్డారు, 2020లో 62 మంది జర్నలిస్టులు చంపబడ్డారు. అనేక గ్లోబల్ జర్నలిస్టుల నెట్‌వర్క్‌లు పత్రికా స్వేచ్ఛను సమర్థించే పనికి నాయకత్వం వహించాయి మరియు జర్నలిస్టులకు అటువంటి రాష్ట్ర మరియు నాన్-స్టేట్‌తో పోరాడటానికి ఒక వేదికను అందించాయిభారతదేశం అంతటా 600 మంది మహిళా జర్నలిస్టుల నెట్‌వర్క్, ఇది భారతీయ మీడియాలో మహిళలు ఒకచోట చేరి సమాచారాన్ని పంచుకోవడానికి, ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, మీడియా నీతిని చర్చించడానికి మరియు మీడియాలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఒక స్థలం లేదా ఫోరమ్‌ను అందిస్తుంది. సమిష్టి మహిళా జర్నలిస్టులకు స్థలం, వనరులు మరియు హక్కుల ఉల్లంఘనల విషయంలో న్యాయం పొందేందుకు ఒక సమగ్ర వ్యవస్థను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోని మహిళా స్వతంత్ర జర్నలిస్టులకు గుర్తింపు, సరసమైన వేతనం మరియు మంచి పని పరిస్థితుల కోసం కూడా ఇది పనిచేస్తుంది. 140 దేశాలలో 6,00,000 మంది మీడియా నిపుణులకు ప్రాతినిధ్యం వహిస్తున్న పారిస్ ఆధారిత సంస్థ. ప్రపంచ స్థాయిలో మీడియా రిక్రూట్‌మెంట్‌లో జర్నలిస్టులు మరియు న్యాయవాదుల న్యాయమైన వేతనం, మంచి పని పరిస్థితులు మరియు లింగ సమానత్వం కోసం వాదించే వారి కార్మిక హక్కులను బలోపేతం చేయడానికి ఈ సమిష్టి కృషి చేస్తుంది. జర్నలిస్టులపై హింస, నేరస్తులకు శిక్షార్హత మరియు రాష్ట్ర చట్టాలు లేదా ప్రైవేట్ సంస్థల ద్వారా మీడియా స్వేచ్ఛను నిరోధించే దేశాలపై దృష్టి సారించే వారి ప్రచారాల ద్వారా ఎఈఏ డాక్యుమెంట్ చేసిన రికార్డులు మరియు డేటాను యాక్సెస్ చేయవచ్చు.జర్నలిస్టు అనే వ్యక్తి ప్రపంచంలో ఏ మారుమూల ఏ విషయం జరిగినా మనకు తెలియపరిచే ఒక వారధి మనము ఇంట్లో కూర్చొని నిత్యం బయట జరిగే విషయాలని సమాజంలో




ఏం జరుగుతుంది ప్రపంచం లో జరిగే విశేషాలు అన్నీ కూడా ఈ మీడియా ప్రతినిధుల ద్వారానే మనకు తెలియవలసింది కాబట్టి ప్రతి జర్నలిస్టు కూడా తమ వంతు కృషి చేస్తూ లో నలుమూలల జరిగే ప్రతి విషయాలను రాజకీయ పరిస్థితుల్లో వాతావరణ పరిస్థితులను సమాజం గురించి ఎక్కడ ఏ విషయాన్ని అయినా మన ముందు ఉంచుతుంది జర్నలిస్ట్ వర్గం అలాంటి వారిని సత్కరించి గౌరవించవలసిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయుల పైన ఉంటుందిసమాజానికి జర్నలిస్ట్ అనేది ఒక జ్ఞాననేత్రం లాంటిది ఉదయం లేవగానే పత్రికలు మన ముందు అన్ని విషయాల సమాచారంతో కలుపుతుంది కాబట్టి సమాజంలో



జర్నలిస్టులకు ఒక ప్రముఖ స్థానం ఉందినిజాన్ని కళ్ళకు కట్టినట్టు చెప్పే జర్నలిస్టులు మన సమాజంలో ఎంతో మంది ఉన్నారు వంటిది వార్తల నుంచి అంతరిక్ష వార్తలు వరకు కూడా వారు సేకరించి పేపర్లో వేస్తూ ప్రతి సమాచారాన్ని తెలియపరచడం అనేది చాలా గొప్ప విషయం

– వీరవెల్లి శ్రీలత
ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ ,నేరేడుచర్ల

## 'పారమిత'లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):**స్థానిక నగరంలోని పారమిత విద్యాసంస్థలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి ఇట్టి వేడుకలను పారమిత పాఠశాలల అధినేత డా: ఇ. ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయుని, ఉపాద్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడుతూ... అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనది దేశ భవిష్యత్తును మార్చే ఒకే ఒక్క శక్తి ఉపాధ్యాయునిదే మనం ఈ వృత్తిలో ఉన్నందుకు గర్వపడుతున్నామని మననీ మన కర్తవ్యాన్నిగుర్తుంచుకుని, దానికి అనుగుణంగా అడుగులు వేసుకుంటూ అందరికీ ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సంధర్భంగా విద్యార్థులు స్వయంగా ఉపాద్యాయ ఉపాద్యాయులుగా విదులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి వారి అనుభవాలు పంచుకుంటూ ఉపాద్యాయ వృత్తి ప్రాధాన్యతను, విలువలను వారి వారి మాటల్లో పంచుకున్నారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాదరావు తెలంగాణలో ఉన్న ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్,టి.యస్.వి.రమణ, వినోద్ రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు శ్రీకర్, బాలాజీ, ప్రశాంత్, కవితాప్రసాద్, శర్మిష్ఠ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## బోధన్ సబ్ కలెక్టర్‌గా వికాస్ మహతో...

**బోధన్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** బోధన్ సబ్ కలెక్టర్ గా వికాస్ మహతో గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు బోధన్ ఆర్డివో అంబదాస్ రాజేశ్వర్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన అన్నారు. ఉన్నతాది కారుల ఆదేశాల మేరకు సీనియర్ అధికారుల సలహతో కింది స్థాయి అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతానని ఆయన వివరించారు. అలాగే విద్యార్థులకు సంబంధించి, రైతులకు సంబంధించిన అన్ని పత్రాలను సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడు ముందుంటానని ప్రజలు తమ సమస్యను నేరుగా తన దృష్టికి తీసుకొని రావాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, బోధన్ తహశీల్దార్ విట్టల్, అధికారులు ఉన్నారు. కాగా ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ సేవలను నూతన సబ్ కలెక్టర్ వికాస్ మహతో అభినందించారు.



భారీ వర్షాలకు దెబ్బతిన్న భవానిపేట్ నుండి పోతారం వెళ్లే రహదారి, బ్రిడ్జిని పరిశీలిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- కామారెడ్డి ప్రతినిధి,జనంసాక్షి

## ట్యాపింగ్‌పై ఉన్న శ్రద్ధ రుణమాఫీపై లేదు

**బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఫోన్లతో పాటు అధికారుల ఫోన్ కూడా ప్రభుత్వం ట్యాప్ చేస్తోంది**

**కేంద్ర మంత్రిగా బండి ఈ వ్యవహారంపై సిబిఐ ఎంక్వయిరీ చేయించాలి: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

జమ్మికుంట(జనంసాక్షి): బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల తోపాటు ఎమ్మెల్సీలు ఎంపీల ఫోన్లు ట్యాప్ చేయడంతో పాటు జిల్లా పోలీస్ అధికారుల ఫోన్లు కూడా ప్రభుత్వం ట్యాప్ చేస్తుందని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. గురువారం జమ్మికుంట లోని మున్సిపల్ చైర్మన్ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయకపోతే మాకు సంబంధించిన పర్సనల్ ఇన్ఫర్మేషన్ కూడా ప్రభుత్వానికి ఎలా చేరుతుందో చెప్పాలన్నారు. మేము ఎక్కడికి వెళ్లినా, ఏం మాట్లాడినా ఎలా తెలుస్తుందని ఆయన ప్రశ్నించారు. నిన్న మానకొం డూర్ శాసనసభ్యుడు హైదరాబాదులోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఒక ఛానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చారని, ఆ ఇంటర్వ్యూలో కరీంనగర్ సిపి నుంచి మానకొండూరు సిఐకి వీడియో కాన్ఫరెన్స్ రావడంలేదని ఎలా చెప్పారని ఆయన ప్రశ్నించారు. సిపి టెలి కాన్ఫరెన్స్ గోప్యం




గా ఉంటుందని అయినప్పటికీ మానకొం డూరు శాసనసభ్యుడికి ఆ విషయం తెలిసిందంటే కరీంనగర్ సి.పి ఫోన్ కూడా ట్యాప్ చేశారని అర్థమవుతుంద న్నారు. కరీంనగర్ లో ఉన్న అధికారుల అందరి ఫోన్లు ట్యాప్ చేస్తున్నట్టు ఇంట ర్వ్యూలో శాసనసభ్యుడు చెప్పకనే చెప్పాం న్నారు. కరీంనగర్ సిపి ఫోనే ట్యాప్ చేస నవారు మా ఫోన్ ట్యాప్ చేయడం లేదం టే ఎలా నమ్మమంటారని ఆయన ప్రశ్నించారు. మా ఫోన్లు ట్యాపింగ్ చేస్తు న్నారనే అనుమానం ఉండేదని నిన్నటితో ఆ అనుమానం కూడా నిజమైందన్నారు. కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ కూడా కరీంనగర్ జిల్లా సిపి. ఫోన్ ట్యా పింగ్ పై సిబిఐ ఎంక్వయిరీ కి ఆదేశించాలని అన్నారు.ప్రభుత్వానికి ఫోన్ ట్యాపింగ్ చేయడంలో ఉన్న శ్రద్ధ రుణమాఫీ చేయడంలో లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. అధికారుల పోస్టింగ్ ల విషయంలో అధికారులు మా మాట వినడం లేదని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు చెబుతున్నారని, పోస్టింగ్ ల విషయంలో మేము ఎలాంటి జోక్యం చేసుకోమని, అధికారులకే పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధులుగా ఓడిపోయిన వారికి చెక్కులు పంపిణీ అధికారం ఎవరిచ్చారని, అధికారులు కూడా ప్రోటోకాల్ పాటిం చకుంటే గతంలో కోర్టుకు వెళ్లి అధికా రులపై చర్యలకు ఆదేశాలు ఇప్పించామని వాటిని గుర్తుంచుకొని అధికారులు కూడా మెదలాలని అన్నారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వ రరావు, పి ఎ సి ఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, బిఆర్ఎస్ పార్టీ అర్బన్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, బి ఆర్ఎస్ నాయకులు పోడేటి రామస్వామి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 05(జనంసాక్షి)** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆద్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్ళ బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఖాళీల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసి, పరీక్ష నిర్వహించిందని గుర్తు చేశారు. పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద స్కూళ్ళలో మౌలిక వస తులు కల్పించేందుకు చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి ఎదిగానని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డ్స్ స్వీకరించిన వారికి అభినం దనలు తెలియజేశారు. మిగితా టీచర్లు వీరిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. జిల్లా నుంచి జాతీయ స్థాయికి తాడురి సంపత్ కుమార్, రాష్ట్ర స్థాయికి పాకాల శంకర్ గౌడ్ ఎంపిక కాగా, వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. తన బాల్యం నుంచి ఈ స్థాయికి వచ్చేలా తీర్చిదిద్దిన టీచర్లు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలను అన్ని అంశాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక, పర్యావరణ స్పృహ, నైతికత, విలువలు, పోటీతత్వం నేర్పించాలని పిలుపు నిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ ఛైర్పర్సన్ జిందం కళా, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా విద్యాధికారి రమేష్, జీసీడీఓ పద్మజ ఎంఈఓలు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసి ఆడబిడ్డపై అత్యాచారానికి పాల్పడిన కిరాతకుడిని ఉరి తీయాలి

**మహిళా, గిరిజన మోర్చా నాయకులు**

**మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా, జైనూర్ లో ఆదివాసీ ఆడబిడ్డపై అత్యాచారానికి పాల్పడిన షేక్ మఖ్దూమ్ అనే కిరాతకుడుకిని వెంటనే ఉరి తీయాలని, మరియు ఇలాంటి దురాఘాతాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా మహిళా మోర్చా, గిరిజన మోర్చా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టి అనంతరం బస్ స్టాండ్ వద్ద తెలంగాణ ప్రభుత్వ దిష్టి బొమ్మను గురువారం దగ్ధం చేయటం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షుడు నవీన్ నాయక్ మాట్లాడుతూ ఆదివాసీ ఆడబిడ్డ పై అత్యాచారం జరిగితే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరిస్తుందని, తెలంగాణలో గిరిజన ఆదివాసి మహిళలకు రక్షణ లేకుండా పోయిందనీ వాపోయారు. ఆసిఫాబాద్ జైనూరు మండలంలో ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నం చేసిన ముస్లిం వ్యక్తి మద్దుమ్ తో పాటు మిగతా ముగ్గురు నిందితులను వెంటనే ఉరితీయాలని, అత్యాచారం జరిపిన నిందితులను వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఉరిశిక్ష విధించాలని బాధిత మహిళకు కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో మహిళల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఉండాలంటే నిందితులను ఉరి తీయటమే సరియైన నిర్ణయమన్నారు. చర్యలు తీసుకోక పోతే ఉద్యమం పెద్ద యెత్తున ఉద్యమం చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లు నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, నాయకులు హరిక, కాట్రోత్ రవి, రాజు, రంజిత్, నరేష్, రెడ్డి, లింగం, బాలమని, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో ఘనంగా గురువందన్

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 05 (జనం సాక్షి) :** ఉపాధ్యాయులు సమాజానికి మూలమని అభివృద్ధికి బాటలు వేస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అట్టహాసంగా నిర్వహించినటువంటి అల్ఫోర్స్ గురువందన్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డా.సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశ అత్యున్నత పురస్కారం "భారతం ~త్న"తో గౌర వింపబడ్డారని వారు ప్రాథమికంగా ఉపాధ్యా యుడని, ఆ వృత్తికి చాలా వన్నెతేవడమే కాకుండా ఉపాధ్యా యులది కీలక పాత్రని నిరూపించారని తెలిపారు. ప్రతి ఒక్కరు ఉపాధ్యాయులను అనుసరించి అగ్రస్థానంలో కొనసాగి ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని కోరారు. నేడు అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో చాలా విశిష్టంగా సేవలనందిస్తున్న ఉపాధ్యాయులను గొప్పగా సన్మానించడం జరిగిందని దేశ భవిష్యత్ కు పునాది వారేనని అభివర్ణించారు. ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని కృషి చేస్తున్న డా.వి. నరేందర్ రెడ్డి ని ఉపాధ్యాయులందరు సత్కరించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన టీచర్స్ డే ఉత్సవాలలో ఉపాధ్యాయుల పాత్ర పోషించిన విద్యార్థులందరికి బహుమతులను ప్రదానం చేసి శు భాబినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు

**కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జిల్లా సాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జిల్లాలోని 28 మంది ఉపాధ్యాయులను శాలువా, ప్రశంస పత్రంతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని, సమాజంలో మీ పాత్ర చాలా గొప్పదని, మిమ్ముల్ని మార్గదర్శకులుగా తీసుకొని మీ అడుగుజాడల్లో నడుస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గురువుల ఔన్నత్యాన్ని గుర్తు చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతికి చేసిన




సేవలను కొనియాడారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఈ సందర్భంగా జిల్లాలో విద్యారంగంలో జరుగుతున్న ప్రగతిని వివరించారు.విద్యాశాఖ సమన్వయ కర్తలు ఉమారాణి, వేణుగోపాల్, నాగవేందర్, కృష్ణ చైతన్య, వెంకట రమణ రావు,జిల్లా పరీక్షల విభాగ అసిస్టెంట్ కమీషనర్ బలరాం, పరీక్షల విభాగ కార్యదర్శి నీలం లింగం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు, నోడల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మాటలతో కాలం గడిపిన గతపాలకులు

**కేవలం ఇద్దరు రైతులకు పరిహారం ఇవ్వలేక ఏళ్ల తరబడి మూలనపడ్డ బ్రిడ్జీపనులు నేడు అట్టహాసంగా ప్రారంభించుకుంటున్నాం :చొప్పదండి ఎమ్మెల్యే సత్యం**

**రామడుగు(జనంసాక్షి):** చిన్న కారణాలతో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న రామడుగు బ్రిడ్జిని గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పచ్చ జండా ఊపి ఘనంగా ప్రారంభించారు.నేటి నుండి సుమారు 50 గ్రామాల ప్రజలకు బ్రిడ్జి ద్వారా రాకపోకలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు కేవలం ఇద్దరు రైతులకు పరిహారం ఇప్పించలేక బ్రిడ్జి ప్రారంభం నోచుకోలేదని ,ఏళ్లతరబడి నాలుగు మండలాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారని ,ఈ సమస్య మీద గతంలో మేమే అనేకసార్లు పోరాటం చేశామని గుర్తుచేశారు.సమయస్ఫూర్తితో రైతులను ఒప్పించి పెండింగ్ పనులు పూర్తి చేశామని ,నన్ను గెలిపించిన ప్రజల సమక్షంలో బ్రిడ్జి ప్రారంభం చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని,గత పాలకులు మాటలతో కాలం గాడిపరని కానీ మేము పనులు చేసి ప్రజల మన్నన పొందుతామన్నారు.కుండపోత వానను లెక్కచేయకుండా బ్రిడ్జి పనిని త్వరితగతిన పూర్తి చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ జవ్వాజి హరీశ్,వీర్ల నర్సింగరావు,సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, పంజాల శ్రీనివాస్ గౌడ్, పలు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,ప్రజలు ,అధికారులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
06 సెప్టెంబర్ 2024
తెలంగాణ



## సాంకేతిక లోపంతో చిట్యాలలో ల్యాండ్ అయిన ఆర్మీ హెలికాప్టర్

**చిట్యాల సెప్టెంబర్ 05(జనం సాక్షి)**
చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో గురువారం అత్యవసరంగా ఆర్మీ హెలికాప్టర్ ల్యాండ్ అయింది. వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లిన ఈ హెలికాప్టర్ తిరుగు ప్రయాణంలో హకీం పేటకు వెళుతుండగా సాంకేతిక సమస్య తలెత్తినట్లు తెలిసింది. హెలికాప్టర్ లో ముగ్గురు ఉన్నట్లు సమాచారం. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కు చెందిన ఈ హెలికాప్టర్ పొలాల్లో ల్యాండ్ కాగా దగ్గరలోని వ్యవసాయ కూలీలు, గ్రామస్తులు అక్కడి చేరుకొని ఫోటోలు దిగారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మరో హెలికాప్టర్ లో నిపుణులు వచ్చి సాంకేతిక సమస్యను తొలగించగా తిరిగి హకింపేటకు హెలికాప్టర్ బయలుదేరింది.

## ట్రాక్టర్ పై వెళ్లి సేవలందించిన వైద్య సిబ్బంది..

**తిరుగు ప్రయాణంలో వరదలో**
**ట్రాక్టర్ చెడిపోవడంతో ఇబ్బందులు పడ్డ సిబ్బంది..**



**తుంగతుర్తి సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :**
వరదను దాటుకుంటూ ట్రాక్టర్ పై వెళ్లి ఓ గ్రామంలో ఉన్న ప్రజలకు వైద్య సేవలు అందించిన సిబ్బంది ఇది ఎక్కడో మారుమూల మన్యం ప్రాంతం అనుకుంటే పొరపాటే ఇది సాక్షాత్తు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రం మండల పరిధిలోని ఓ మారుమూల గ్రామమైన కేశపురం. వర్షాకాలంలో ఊరు చివర ఉన్న కేశపురం వాగు బంధం ఉప్పొంగితే ఆ గ్రామం నుండి వెలుగు పెల్లి తుంగతుర్తి కి రాకపోకలు నిలిచిపోతాయి బంధం వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ఇలాంటి పరిస్థితి నెలకొందని అత్యవసర సమయాల్లో ప్రమాదంగా ప్రవహిస్తున్న వాగు దాటడం ఎంతో కష్టంగా ఉందని తమకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గత కొన్ని సంవత్సరాల నుండి వేడుకుంటున్న అధికారులు కనికరించడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. విషయం తెలిసిన శాసనసభ్యులు మందుల సామేలు కేశవపురం వాగు నువ్వు సందర్శించి బ్రిడ్జి నిర్మాణం చేపడతారని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో గురువారం జిల్లా వైద్య శాఖ అధికారుల ఆదేశానుసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అతి కష్టం మీద ట్రాక్టర్ పై వాగు ను దాటుతూ గ్రామానికి చేరుకొని అక్కడి ప్రజలకు వైద్య సేవలు అందించిన పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వర్షం వరదల కారణంగా రవాణా సౌకర్యం లేని కేశపురం గ్రామంలో వైద్య సౌకర్యాలకు ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలు కు రావులపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లింగమూర్తి ఆధ్వర్యం లో వైద్య సేవలు అందించారు అనంతరం సిబ్బంది తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్ ప్రయాణం చేస్తుండగా నీటి మధ్యలో ట్రాక్టర్ చెడిపోవడంతో ఇబ్బంది ఇబ్బంది పడ్డారు. అనంతరం పలువురు వైద్య సిబ్బందిని క్షేమంగా వాగు దాటించడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ గాజుల సోమన్న రజిత, నాగలక్ష్మి, ఆషా కార్యకర్తలు, మెరమ్మ, అంగన్వాడి టీచర్ అల్వాల సంగీత, గ్రమ సిబ్బంది చాగంటి అవిలయ్య , మిర్యాల ఓం ప్రకాష్, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.



## వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరండి

- పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం
- ట్రాక్టర్ల సహాయంతో ప్రజలను తరలించిన అధికారులు

**పినపాక, సెప్టెంబర్ 05(జనం సాక్షి):**
వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివచ్చి ప్రజలు సహకరించాలని పినపాక ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ సమ్మయ్య కోరారు. గురువారం పినపాక మండల కేంద్రంలో గల మిల్లు గుంపు ప్రజలను ట్రాక్టర్ల సహాయంతో పునరావాస కేంద్రాలకు తరలించారు. వరద ముంపు ఉండడంతో వారిని పినపాక జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలించినట్లు గా తెలిపారు. ఆర్ఐ బాలకృష్ణ, సెక్రటరీ ఉమామహేశ్వరరావు తో కలిసి ఎంపీడీవో, ఎంపీవో, డిప్యూటీ తాసిల్దార్ గోపాలరావు పేట లో గల చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువు కట్ట తెగుతుందని ప్రజలు తెలపడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్లుగా తెలియజేశారు. వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాగులు కాలవలు దాటే ప్రయత్నం చేయవద్దు అని అధికారులు సూచనలు చేశారు. అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆర్ ఐ బాలకృష్ణ స్వయంగా దగ్గర ఉండి ప్రజలకు అవగాహన కల్పిస్తూ పునరావాస కేంద్రాలకు ప్రజలను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు.

## ప్రకృతి విపత్తులో సర్వం కోల్పోయి వీధిన పడ్డ యాకూబ్ కుటుంబాన్ని

# అన్ని విధాలుగా ఆదుకుంటాం

## మంత్రి శ్రీనివాసరెడ్డి..

**10 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని కుమారులకు అందించిన మంత్రి..**
**స్థలంతో పాటుగా ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయిస్తా..**



**కూసుమంచి, సెప్టెంబర్ 5 ( జనంసాక్షి ) :**
రాష్ట్రవ్యాప్తంగా గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది గత ఆదివారం రోజున పాలేరు రిజర్వాయర్ కు చరిత్రలో ఎన్నడూ రాని వరద తెల్లవారు జామున ఒకేసారి రావడంతో యాకూబ్ అనే ఇటుకల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న అనుకోకుండా వారు ఉంటున్న ఇంటి చుట్టూ ఒకేసారి భారీ వరద చేయడంతో వరద ఉధృతికి ఎటు పోలేక ఉదయం 6 గంటలకు ఇంటి పై కప్పు పైకి ఎక్కి యాకూబ్ అతని భార్య సైదాబీ అతని చిన్న కుమారుడు షరీఫ్ తమ ప్రాణాలను రక్షించుకోవాలని మధ్యాహ్నం ఒంటిగంట వరకు చతవిధాల ప్రయత్నం చేశారు అయినప్పటికీ విధి వక్రించి వరద అంతకంతకి పెరిగింది తప్పితే వరద తగ్గకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న వీరిని రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ శాఖ మరియు గ్రామ ప్రజలు వారిని రక్షించడానికి శతవిధాల ప్రయత్నించేశారు చివరగా మంత్రి ఆదేశానుసారం డ్రోన్ సహాయంతో వారికి లైఫ్ జాకెట్లు అందించినప్పటికీ వరద ఉధృతికి ఇల్లు ఒకేసారి కూలిపోవడంతో అన్ని ప్రభుత్వ శాఖలు స్థానిక యువకులు శతవిధాలా ప్రయత్నం చేసినప్పటికీ వారు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమై వరద ఉధృతిలో షేక్ యాకూబ్ అతని భార్య సైదాబీ అతని కుమారుడు షరీఫ్ వరద లో కొట్టుకుపోయి భర్త భార్య వరద ఉధృతిలో మునిగి చనిపోగా వారి కుమారుడు షరీఫ్ కు లైఫ్ జాకెట్ అండతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జాతీయ రహదారి దగ్గర చేరుకోగా అతనిని పోలీస్ శాఖ వారు రక్షించిన సంగతి పాఠకులకు విధితమే యాకూబ్ కుటుంబం గత 20 సంవత్సరాల క్రితం సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని కరక్కాయలగూడెం నుండి సిమెంటు ఇటుకల తయారీ కోసం నాయకన్ గూడెం వలస వచ్చి ఇచ్చట నే స్థిరపడి ఇటుకల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబం అతనికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు యూసూబ్ చెన్నై నందు నాలుగవ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతుండగా రెండవ కుమారుడు షరీఫ్ ఖమ్మంలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తల్లిదండ్రులతో పాటు సర్వం కోల్పోయి వీధిపాలైన ఇద్దరు కుమారులను పాలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి యూసుఫ్, షరీఫ్ లను పరామర్శించి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పది లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా అందించి వారికి మనోధైర్యాన్ని చెప్పారు ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ యాకూబ్ కుటుంబానికి అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సర్వం కోల్పోయిన యాకూబ్ కుటుంబానికి మండల కేంద్రంలో ఇంటి స్థలంతో పాటుగా ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయిస్తానని వారికి భవిష్యత్తులో చదువుకు అయ్యే ఖర్చులను భరిస్తామని వారికి మనోధైర్యాన్ని చెప్పారు యాకూబ్ కుటుంబాన్ని రక్షించడానికి కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వాతావరణ ప్రతికూల పరిస్థితుల వలన వారిని కాపాడలేకపోవడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ రాష్ట్ర మంత్రిగా యాకూబ్ కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటానని ఆయన యాకుబ్ కుమారులకు హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ సాయంతో పాటు మా సాయం కూడా చేస్తున్నాం

- శుక్రవారం సాయంత్రానికల్లా బాధితుల అకౌంట్లలోకి రూ.10వేలు
- ఖమ్మం రూరల్ మండల పర్యటనలో మంత్రి పొంగులేటి
- ద్విచక్రవాహనం పై తిరుగుతూ వరద సహాయక చర్యలు పరిశీలన



**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 5(జనంసాక్షి) :**
పాలేరు నియోజకవర్గంలోని వరద ముంపు బాధితులకు ప్రభుత్వ సాయంతో పాటు పొంగులేటి స్వరాజ్యం – రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరుపున తమ వంతు సాయం కూడా అందించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, విపత్తు నిర్వాహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్ప, కరుణగిరి, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, జలగం నగర్, పెద్దతండా, కె.బి.ఆర్ నగర్, అభయటౌన్ షిప్, దానవాయిగూడెం, రామన్నపేట తదితర ప్రాంతాల్లో బాధితులకు అందుతున్న వరద సహాయక చర్యలను ద్విచక్రవాహనం పై కలియతిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వరద ముంపు బాధితులకు శుక్రవారం సాయంత్రం కల్లా రూ.10వేల వారి అకౌంట్లలోకి జమ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతీ ఇంటికి వరద సాయం అందజేస్తామని బాధితులు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కట్టు బట్టలతో సహా అనేక కుటుంబాలు నష్టపోయాయన్నారు. మహిళలకు రెండు చీరలు, పురుషులకు రెండు లుంగీలతో పాటు రెండు టీ షార్ట్ లను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. పభుత్వ సాయంతో పాటు మా సాయం కూడా చేస్తున్నాం.

## రామయ్య సేవలో ఎంపీ బలరాం నాయక్

- కరకట్ట ఎత్తు పెంచి ముంపు నుండి ప్రజలను కాపాడాతాం
- విలేకరుల సమావేశంలో ఎంపీ పోరిక బలరాం

**భద్రాచలం, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):**
భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి ని మహబూబాబాద్ ఎంపీ పోరికి బలరాం నాయక్ గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉపాయాలను సందర్శించారు. అర్చకులు ఆయనకు లక్ష్మీ తారమ్మ వారి సన్నిధిలో వేద ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలను శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం గోదావరి ముంపు ప్రాంతాలను ఎంపీ సందర్శించారు.



**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో**
స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీతో పాటు ఎమ్మెల్యే వెంకట్రావు పాల్గొని మాట్లాడుతూ స్థానికంగా ఉన్న పనులను గుర్తించి, కరకట్ట ఎత్తు పెంచి వరద బాధితులను ముంపు నుండి కాపాడుకుంటామన్నారు. పోలవరం ప్రాజెక్టుతో ముంపుకు గురవుతున్న కొన్ని గ్రామపంచాయతీలను కాపాడు కునే దిశలో, ఏపీ నుండి మనకు రావాల్సిన రూ. 4వేల కోట్లు రూపాయల సొమ్మును కరకట్ట పటిష్టతకు ఉపయోగించ నున్నట్లు వివరించారు. భవిష్యత్తులో ముంపుకి గురికాకుండా పోలవరం బ్యాక్ వాటర్ తో ఇబ్బంది లేకుండా, పటిష్టమైన కార్యక్రమం నిర్వహిసా మన్నారు. ప్రతి ఏడాది స్లూయిజ్ ల వల్ల గోదావరి పట్టణంలోకి ప్రవేశించి అన్నదాన సత్రం, రామాలయ పరిసరాలు ముంపుకు గురవుతున్నాయని ఎంపీ దృష్టికి స్థానికులు తీసుకుని వచ్చారు. స్పందించిన వారు భవిష్యత్తులో అటువంటి పరిస్థితి తలెత్తదని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, తాండ్ర నరసింహారావు, కురిచేటి శ్రీనివాసు, సరెల్ల నరేష్, దొడ్డిపట్ల కోటేష్, అన్నం రామిరెడ్డి రాచమల్ల రాము, వసంతాల రాజేశ్వరి, బలుసు సతీష్, నవాబు, చింతరాల చిన్ను, భజన సతీష్, మహమ్మద్ జిందా కొంటిశెట్టి కృష్ణమూర్తి, రత్నం రమాకాంత్, బంబోతుల రాజీవ్, రామకృష్ణ, భూక్యారంగా, బత్తుల తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు,






## ముంపు బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

**• మంత్రి పొంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి..**

**కూసుమంచి, సెప్టెంబర్ 5( జనంసాక్షి ) :**
ముంపు బాధితులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని, ఎవ్వరూ అధైర్య పడొద్దని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి ఖమ్మం రూరల్ మండలంలోని కరుణగిరి, జలగం నగర్, పెద్దతాండ వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి భరోసా కల్పించారు. ఇంటింటికి తిరిగి వరద ప్రభావం, ఇండ్ల పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పారిశుద్ధ్య చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఫైర్ ఇంజన్ల సహాయంతో ఇండ్లలోని బురద శుభ్రం చేయాలన్నారు. వీధులు, తక్షణ సహాయం, బాధితుల వివరాల సేకరణ పై అధికారులకు తగు సూచనలు చేశారు. నష్టపోయిన ప్రతి ఇంటికి సహాయం అందిస్తామన్నారు. అధికారులు సర్వే ప్రక్రియ వెంటనే చేపట్టి, నష్ట అంచనా పూర్తి చేయాలన్నారు. సర్టిఫికెట్లు, పుస్తకాలు నష్టపోయిన వారికి తగు న్యాయం చేస్తామన్నారు. తడిసిన బియ్యం స్థానే సన్న బియ్యం అందిస్తామన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి అన్నారు. మోటార్ సైకిల్ పై మంత్రి కాలనీల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. మంత్రి వెంట అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

## లేబర్ ఇన్సూరెన్స్ చెక్‌ల అందజేత

**కలెక్టరేట్ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వివరాలను..**
**ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు లేబర్ ఇన్సూరెన్స్ ద్వారా అందించే నష్ట పరిహారం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసాను కలిగిస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కార్మిక కార్యాలయంలో కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్ కి చెందిన గంట అంజయ్య అనే లారీ డ్రైవర్ యాక్సిడెంట్ లో మరణించారు. అంజయ్య కుటుంబ సభ్యులకు లేబర్ ఇన్సూరెన్స్ ద్వారా గంట అంజయ్య భార్య రాజ్యంకు 2 లక్షల చెక్ ని, కుమారుడు రామరాజుకి రూ.1.10 లక్షల చెక్, కుమార్తె మణికంఠకి 3 లక్షల చెక్, మొత్తం 6.10 లక్షల రూపాయల విలువ గల 3 చెక్ లను కుటుంబ సభ్యులకు అందజేశారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల చట్టంపై పలు వివరాలను అధికారులను అడిగారు. అంతకు ముందు కలెక్టరేట్ లోని సిబ్బంది అందరు తప్పకుండా ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ ద్వారా హాజరుని నమోదు చేసుకోవాలని, సిబ్బంది రోజు వారి హాజరు వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రైతు రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చుటకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ని పరిశీలించి రోజు వారి కాల్స్ వివరాలను అడిగి తెలుసుకొని, రైతులు ఫోన్ చేస్తే సంబంధిత మండల వ్యవసాయ అధికారికి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ జగదీష్ కుమార్, సందీప్, విజయలక్ష్మి, అర్షద్, శ్రీనివాస్, షరీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునిగా బోడ మధు

- కలెక్టర్ జితేష్ బి పాటిల్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు..



**బూర్గంపహాడ్ సెప్టెంబరు 05 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం అంజనాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బోడ మధు కు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు తమ ఊరు వాడైన ఉపాధ్యాయుడు బోడ మధుకు ఈ అవార్డు రావడం గర్వకారణమని గ్రామ ప్రజలు హర్షాతి రేకాలు వ్యక్తం చేశారు. బోధనా ప్రక్రియలో నూతన విధానాలను అనుసరించడం, వివిధ అంశాలపై ప్రత్యేక ఆర్టికల్స్ ప్రచురించడం, పాఠశాలలో హరితహారం, స్వచ్ఛభారత్, గ్రీన్ పాఠశాల ఏర్పాటు, వినూత్న పద్ధతుల ద్వారా విద్యార్థులకు బోధన చేయడం, సామాజిక కార్యక్రమాలలో వివిధ రకాలుగా పాల్గొంటూ విద్యార్థులతో పాటు సామాజిక సేవను అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలకు గాను ఉత్తమ ఉపాధ్యాయుడుగా గుర్తించడం చాలా ఆనందంగా ఉందని సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు అన్నారు. విద్యాబుద్ధులు నేర్పించడంలో ఆయనకు ఆయనే సాటి, విద్యార్థులు కష్టంగా భావించే సబ్జెక్టును సైతం వారికి ఇష్టంగా నేర్పించడంలో ఆయనో మేటి, అనతి కాలంలోనే పిల్లలతో మమేకం కావడం ఆయనకే సొంతం. క్రమశిక్షణ కలిగి ఉండటం, అదే క్రమశిక్షణను విద్యార్థులకు నేర్పించడం... వృత్తిని దైవంగా భావించడం ఆయనకే సొంతమని పలువురు కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన బోడ మధు కు విద్యార్థులు, పలువురు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు అభినందించారు.




## మాధవి చుట్టూ వివాదం

### సెబీ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

**ముంబయి(జనంసాక్షి):** సెబీ చీఫ్ మాధవి పురీ బుచ్‌ను వివాదాలు చుట్టుముడుతున్నాయి. మొన్నటికి మొన్న అదానీ గ్రూప్‌నకు చెందిన ఆఫ్‌షోర్ కంపెనీల్లో పెట్టుబడుల ఆరోపణలు ఎదుర్కొన్న ఆమె..తాజాగా ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి వేతనం అందుకుంటున్నారంటూ కాంగ్రెస్ నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వివాదం సమసిపోకముందే సెబీలో పనితీరుపై అక్కడి ఉద్యోగులు రాసిన లేఖ ఒకటి బుధవారం వెలుగులోకి రావడం.. అది 'బయటి వ్యక్తుల పనే'నంటూ సెబీ వివరణ ఇవ్వడంతో ఈ వివాదం మరింత రాజుకుంది. దీంతో సెబీ ప్రధాన కార్యాలయం వద్ద సంస్థ ఉద్యోగులు కాసేపు నిరసన చేపట్టారు. మాధవి పురీ బచ్ సెబీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంస్థ పని విధానం పూర్తిగా మారిపోయిందని ఆరోపిస్తూ గత నెల ఆర్థిక మంత్రికి కొందరు ఉద్యోగులు లేఖ రాశారు. భారీ లక్ష్యాలు నిర్దేశించడం, వాటిని అందుకోలేకపోతే నలుగురి ముందూ దూషించడం వంటివి షరా మామూలైపోయాయని పలువురు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ తరహా పని విధానం ఇంతకుముందెన్నడూ చూడలేదని తెలిపారు. ఉద్యోగుల లేఖ అంశం మీడియాలో రావడంతో సెబీ ఆ వార్తలను తోసిపుచ్చింది. బయటి వ్యక్తుల ప్రోద్బలంతో కొందరు ఉద్యోగులు సెబీ పనితీరుపై ఆరోపణలు చేస్తూ లేఖ రాశారని పేర్కొంది.సెబీ వివరణపై ఉద్యోగులు భగ్గుమన్నారు. సంస్థ వైఖరిని నిరసిస్తూ ఉద్యోగులు ప్రధాన కార్యాలయం వద్ద ఈ ఉదయం శాంతియుత నిరసనకు దిగారు. తమ ఆందోళనపై 'బయటి వ్యక్తుల ప్రోద్బలం' ముద్ర వేయడాన్ని తప్పుబట్టారు. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మాధవి పురీ బుచ్ రాజీనామాకు డిమాండ్ చేసినట్లు 'ఎనకమిక్ టైమ్స్' పేర్కొంది. కొందరు ఉద్యోగులు సుమారు గంట పాటు ఆందోళనలో పాల్గొని తిరిగి విధుల్లో చేరినట్లు 'మనీ కంట్రోల్' వెబ్‌సైట్ పేర్కొంది. సుమారు 400-500 మంది ఉద్యోగులు ఈ నిరసనలో పాల్గొన్నట్లు తెలిసింది.

# రిలయన్స్ బంపర్ ఆఫర్

- ప్రతి షేరుకూ మరో షేర్ ఫ్రీ..
- రిలయన్స్ బోర్డు ఆమోదం
- జియోలోనూ వార్షికోత్సవ ఆఫర్

**ముంబయి(జనంసాక్షి):** ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన వాటాదారులకు ప్రతి షేరుకూ మరో షేరు ఉచితంగా లభించనుంది.ఈ మేరకు బోనస్ షేర్ల జారీకి కంపెనీ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. వాటాదారులకు 1:1 నిష్పత్తిలో షేర్లు కేటాయించనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది.బోనస్ షేర్ల జారీకి సంబంధించి ఇటీవల వార్షిక సాధారణ సమావేశం లోనే ముకేశ్ అంబానీ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. రిలయన్స్ వృద్ధిలో కీలక పాత్ర పోషించిన వాటాదార్లకు తదనుగుణంగా ఫలాలను పంచుతామని తన ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే, బోనస్ షేర్ల జారీకి సంబంధించి రికార్డు తేదీని మాత్రం త్వరలో ప్రకటించనున్నారు. దీంతో పాటు అధీకృత మూల ధనాన్ని రూ.15 వేల కోట్ల నుంచి రూ.50వేల కోట్లకు పెంచుకునేందుకూ బోర్డు ఆమోదం తెలిపింది. బోనస్ షేర్లు జారీ అంటే వాటాదారుల వద్ద ప్రస్తుతం ఎన్ని షేర్లు ఉంటే అన్ని షేర్లు అదనంగా కేటాయిస్తారు. కంపెనీ షేరు విలువ గణనీయంగా పెరిగినప్పుడు కంపెనీలు బోనస్ షేర్లను జారీ చేస్తుంటాయి. దీనివల్ల రిటైల్ మదుపర్ల బేస్‌ను పెంచుకునేందుకు వీలు కలుగుతుంది. ప్రస్తుతం రిలయన్స్‌కు 35 లక్షల మంది వాటాదారులు ఉన్నారు. వీరిలో రికార్డు తేదీ నాటికి ఎంతమందికి ఎన్ని షేర్లు ఉంటే.. అన్ని షేర్లు ఉచితంగా లభిస్తాయి. ఉదాహరణకు వెయ్యి రిలయన్స్




షేర్లు ఉంటే.. అవి 2 వేలు అవుతాయన్నమాట. అంత మాత్రన వారి పెట్టుబడి విలువ మారదు. దానికి తగ్గట్టు షేరు విలువ సర్దుబాటు అవుతుంది. దీనివల్ల మదుపర్లకు తక్షణ ప్రయోజనం ఉండనప్పటికీ.. డివిడెండ్ చెల్లింపుల సమయంలో అదనపు ప్రయోజనం పొందొచ్చు. 2017 తర్వాత రిలయన్స్ ఇలా బోనస్ షేర్లు ఇవ్వడం ఇదే మొదటిసారి కాగా.. 2009 తర్వాత ఇది మూడోసారి. బోనస్ షేర్ల ప్రకటన వేళ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు బీఎస్ఈలో 1.3 శాతం నష్టపోయి రూ.2989 వద్ద ముగిసింది.

**జియోలోనూ వార్షికోత్సవ ఆఫర్..**

ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో తన యూజర్ల కోసం ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. కంపెనీ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా కొన్ని రీఛార్జీలపై రూ.700 విలువ చేసే ప్రయోజనాలు అందిస్తున్నట్లు ప్రకటించింది.ఈ ఆఫర్లు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. సెప్టెంబర్ 10 లోపు రీఛార్జి చేసుకున్నవాళు మాత్రమే ఈ బెనిఫిట్స్ పొందుతారు.జియో వార్షిక ప్రయోజనాల్లో భాగంగా రీఛార్జిలపై రూ.175 విలువైన వోచర్ అందిస్తోంది. ఈ వోచర్ కింద 28 రోజుల పాటు 10 ఓటీటీ ప్లాట్‌ఫామ్ సబ్‌స్క్రిప్షన్ ప్రయోజనాలు, 10జీబీ డేటా పొందొచ్చు. ఆఫర్‌లో భాగంగా మూడు నెలల పాటు ఉచితంగా జొమాటో గోల్డ్ మెంబర్‌షిప్ లభిస్తుంది. అదనంగా రూ.500 విలువైన అజియో వోచర్ కూడా ఇస్తామని జియో ప్రకటించింది. రూ.2,999 లేదా అంతకంటే ఎక్కువ మొత్తంతో అజియో వేదికగా కొనుగోలు చేసినప్పుడు అజియో కూపన్ వర్తిస్తుంది. ఈ ఆఫర్లు జియో అందిస్తున్న మూడు రీఛార్జి ప్లాన్‌లకే వర్తిస్తాయి. జియో అందిస్తున్న రూ.899 త్రైమాసిక ప్లాన్‌తో 90 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. ఈ ప్లాన్ రీఛార్జితో రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు పొందొచ్చు. దీంతోపాటు 20జీబీ డేటా అదనం. 98 రోజుల వ్యాలిడిటీతో జియో తీసుకొచ్చిన మరో ప్లాన్ ధర రూ.999. ఈ రీఛార్జిపై రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 2జీబీ డేటా పొందొచ్చు. జియో అందిస్తున్న రూ.3,599 ప్లాన్‌తో అపరిమిత కాలింగ్ లభిస్తాయి. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, 2.5జీబీ డేటాను పొందొచ్చు. ఈ ప్యాక్ వ్యాలిడిటీ 365 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. 8 సంవత్సరాల క్రితం టెలికాం రంగంలో అడుగుపెట్టిన జియో.. ఇప్పటి వరకు 49 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. టెలికాం రంగంలో రారాజుగా కొనసాగుతోంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.70 | ₹ 4.72 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹66,690 (22 క్యారెట్లు) | ₹70,040 (24 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹66,700 (22 క్యారెట్లు) | ₹70,040 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹90,000

## మరోసారి నష్టాల్లో సూచీలు

### 25,150 దిగువకు నిఫ్టీ

**ముంబయి(జనంసాక్షి):** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో మన మార్కెట్లూ నష్టాలు మూటగట్టుకున్నాయి.ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్ వంటి ప్రధాన షేర్లలో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో నిఫ్టీ 25,150 పాయింట్ల దిగువన ముగిసింది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఆగస్టు నెల జాబ్ డేటా త్వరలో వెలువడనుంది. దీనిపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తదనుగుణంగా వడ్డీ రేట్లలో ఎంత శాతం కోత విధించాలనే దానిపై ఫెడ్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.సెన్సెక్స్ ఉదయం 82,469.79 పాయింట్ల వద్ద (82,352.64) లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. రోజంతా నష్టాల్లో కొనసాగింది. ఇంట్రాడేలో 82,130.44 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 151.48 పాయింట్ల నష్టంతో 82,201.16 వద్ద




ముగిసింది. నిఫ్టీ 53.60 పాయింట్ల నష్టంతో 25,145.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.98గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా, భారతీ ఎయిర్‌టెల్, ఎల్‌అండ్‌టీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.32 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2544 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## నా కుమారుడే నా బలం

### డొనాల్డ్ ట్రంప్

**న్యూయార్క్(జనంసాక్షి):** మరికొద్ది నెలల్లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.ముఖ్యంగా ఈసారి ఎన్నికల్లో జనరేషన్ జీ ఓటర్లు కీలక పాత్ర పోషించనున్నారు. దీంతో 41 మిలియన్ల మంది యువ ఓటర్లపై అభ్యర్థులు ప్రధానంగా దృష్టి సారించారు. సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్లతో వీరిని అకట్టుకునేందుకు కమలా హారిస్ ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జనరేషన్ జీను ఆకట్టుకునేందుకు తన వద్ద ఓ 'సీక్రెట్ వెపన్' ఉందన్నారు. మరి ఆయన చెప్పిన సీక్రెట్ వెపన్ ఎవరంటే.. స్వయానా ఆయన కుమారుడు బారన్ ట్రంప్..!ఈ ఎన్నికల్లో తన 17 ఏళ్ల కుమారుడే తనకు 'ట్రంప్ కార్డ్' అని అంటున్నారీ మాజీ అధ్యక్షుడు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన 'సీక్రెట్ వెపన్' గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "బారన్ ఓ మంచి కుర్రాడు. నా దృష్టిలో అతడు ఎప్పటికీ చిన్నపిల్లాడే. నా కుమారుడు ఓ మంచి అథ్లెట్. చాలా తెలివైన వ్యక్తి. ప్రజల దృష్టిని ఆకర్షించాడు. యువతను ఆకట్టుకోవడం ఎలాగో అతడికి బాగా తెలుసు. జనరేషన్ జీ ఓటర్ల విషయంలో మేం విజయం సాధించినట్లే" అని ట్రంప్



చెప్పారు.ట్రంప్-మెలానియాల కుమారుడైన బారన్ కొంతకాలంగా రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్నాడు. ఆ మధ్య ఫ్లోరిడాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. ఇదిలా ఉండగా.. తాజాగా వెలువడుతున్న సర్వేల్లో ట్రంప్, హారిస్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. అయితే యువ ఓటర్లలో మాత్రం హారిస్ కంటే మాజీ అధ్యక్షుడు నాలుగు పాయింట్లు ముందంజలో ఉన్నారు. అటు ప్రచారంలోనూ ట్రంప్ ఈ ఓటర్లపై ప్రత్యేక దృష్టిసారించారు.

# సకాలంలో వైద్యం అందక అశువులు బాసిన చిన్నారులు

### ఇద్దరు బిడ్డల మృతదేహాలను భుజాలపై మోస్తూ..15 కి.మీ నడిచిన తల్లిదండ్రులు



**ముంబయి:** మహారాష్ట్రలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. సకాలంలో వైద్యం అందక ఒకేసారి ఇద్దరు బిడ్డల్ని కోల్పోవడంతో ఆ తల్లిదండ్రులు బాధతో విలవిల్లాడారు. అదిచాలదన్నట్టు ఆసుపత్రి నుంచి వారి మృతదేహాలను ఇంటికి తీసుకెళ్లడానికి కనీస సౌకర్యం లేకపోవడం మరింత వేదనకు గురిచేసింది. కిలోమీటర్ల మేర భుజాలపై బిడ్డల మృతదేహాలను మోసుకెళ్తున్న దృశ్యాలు ప్రతిఒక్కరిని కలవరానికి గురిచేశాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..? మహారాష్ట్ర లోని గడ్చిరోలిలోని అహేరి తాలుకాకు చెందిన ఓ జంట తమ బిడ్డల మృతదేహాలను మోసుకెళ్తున్న వీడియోను కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. "10ఏళ్లు కూడాలేని ఇద్దరు అన్నదమ్ములు జ్వరం బారినపడ్డారు. కానీ వారికి సకాలంలో చికిత్స అందలేదు. దాంతో ఆరోగ్యం క్షీణించింది. తర్వాత ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. చివరకు వారి మృతదేహాలను తరలించడానికి అంబులెన్స్ కూడా అందుబాటులో లేదు. చనిపోయిన పిల్లల్ని మోసుకుంటూ ఇంటికి చేరుకోవడానికి ఆ తల్లిదండ్రులు బురదనేలలో 15 కి.మీ నడవాల్సి వచ్చింది. ఈ ఘటనతో గడ్చిరోలిలోని ఆరోగ్యవ్యవస్థ దుస్థితి మరోసారి వెలుగులోకి వచ్చింది" అంటూ సంకీర్ణ

**మహారాష్ట్రలో హృదయవిదారక ఘటన**

ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రాష్ట్రమంతా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందంటూ భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్, ఎన్సీపీ నేత ధర్మారావ్ బాబా ఆత్రమ్ ప్రకటనలు చేస్తున్నారని, కానీ వారు క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే వాస్తవాలు వెల్లడవుతాయని మండిపడ్డారు. అయితే ఆ తల్లిదండ్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. విదర్భ ప్రాంతంలో ఈ వారంలో ఇలాంటి ఘటనే ఒకటి చోటుచేసుకుంది. అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో ఒక గర్భిణి ఇంటివద్ద మృతశిశువుకు జన్మనిచ్చింది. తర్వాత నొప్పులు తాళలేక ఆ తల్లి కూడా ప్రాణాలు వదిలింది. ఈ వరుస ఘటనలతో మహారాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

**పోస్టుమార్టంకు అంగీకరించని తల్లిదండ్రులు**

ఆ చిన్నారుల వయసు ఆరు, మూడు సంవత్సరాలని జమిల్‌గట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీన ఆరోగ్యం క్షీణించడంతో వారి తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. తీసుకొచ్చేదారిలోనే వారి మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం చేయాలని చెప్పినప్పటికీ.. వినకుండా ఆ మృతదేహాలను తీసుకొని వెళ్లిపోయారని చెప్పారు. తర్వాత వారిని వెనక్కి రప్పించి పోస్టుమార్టం నిర్వహించినట్లు వెల్లడించారు.



## చైనా పరికరాలతో జాగ్రత్త!

### రక్షణదళాల డ్రోన్లలో ఆ దేశ విడిభాగాలు లేకుండా చర్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత రక్షణ దళాలు వినియోగించే దేశీయ తయారీ డ్రోన్లలో చైనాలో తయారైన విడిభాగాలు లేకుండా చర్యలు చేపట్టారు. ఇప్పటికే డ్రోన్ల తయారీ సంస్థలకు ఈ దిశగా స్పష్టమైన మార్గదర్శకాలను సైన్యం జారీ చేసింది. వీటి అమలును పర్యవేక్షించేందుకు ఓ ప్రత్యేకమైన ప్రమాణాలను సిద్ధం చేసుకొంటోంది. చైనా పరికరాలు, ఎలక్ట్రానిక్స్ డ్రోన్లలో అమర్చకుండా చూడనున్నారు. ఈ విషయాన్ని ఆర్మీ డిజైన్ బ్యూరో అడిషనల్ డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ సీఎస్ మాన్ వెల్లడించారు.ఇటీవల రక్షణశాఖ 200 మీడియం ఆల్టిట్యూడ్ లాజిస్టిక్ డ్రోన్లకు ఆర్డర్లు పెట్టింది. వీటిని ఆర్మీ కోసం వినియోగించనున్నారు. ఈ సందర్భంగా తయారీదారులు బీజింగ్ పరికరాలు వాడకూడదని స్పష్టంగా చెప్పింది. ఈ డ్రోన్లను చైనా సరిహద్దుల్లోనే అత్యధికంగా వినియోగించే అవకాశం ఉంది.మరోవైపు పొరుగు దేశం పరికరాలు వాడే విషయంలో అప్రమత్తంగా ఉండాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడెక్షన్ ఫిక్కీ, సీఐఐ, అసోచామ్‌లో సభ్యత్వం ఉన్న కంపెనీలను కోరింది.చైనాతో తూర్పు లద్ధాఖ్‌లో సరిహద్దు వివాదం ఇప్పటికే ఐదో ఏడాదికి చేరింది. ఈ నేపథ్యంలో సైన్యం నానో, మినీ, మాక్రో, కామికాజ్, లాజిస్టిక్స్, ఆర్మ్‌డ్‌స్వార్మ్, ఫైటర్ సైజ్ మేల్, హేల్ డ్రోన్లను సమకూర్చుకుంటోంది.




## ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధం

ఆధారంగానే భవిష్యత్తులో శాంతి చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. వ్లాదివాస్తోక్‌లో జరుగుతున్న ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా పుతిన్ ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం వెల్లడించారు. తాము ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధంగానే ఉన్నమన్నారు. తాము ఎన్నడూ వాటిని తిరస్కరించలేదని గుర్తు చేశారు. అసంబద్ధ డిమాండ్ల ఆధారంగా వీటిని చేపట్టలేమని పుతిన్ చెప్పారు. "ఇస్తాంబుల్‌లో జరిగిన చర్చల్లో ఉక్రెయిన్ అధ్యక్షుడి ప్రతినిధుల బృందం ఒప్పందంపై సంతకం చేసింది. అంటే ఆ షరతులపై ఉక్రెయిన్ సంతృప్తిగా ఉన్నట్లే లెక్క. అమెరికా, ఐరోపాల ఒత్తిడి కారణంగానే ఇది అమల్లోకి రాలేదు. రష్యాను వ్యూహాత్మకంగా ఓడించాలని కొన్ని ఐరోపాదేశాలు కలగంటున్నాయి' అని పుతిన్ వివరించారు.మరోవైపు క్రెమ్లిన్‌లో పుతిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ శాంతి ప్రక్రియలో భారత్ కీలకమని పేర్కొన్నారు. ఆయన ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరం వద్ద ఓ పత్రికప్రతినిధితో మాట్లాడుతూ భారత ప్రధాని మోదీ-పుతిన్ మధ్య నిర్మాణాత్మక, స్నేహపూర్వక సంబంధాలున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధాన భాగస్వాములతో నేరుగా మాట్లాడే అవకాశం ఉందన్నారు. ఇక మోదీకి మాస్కో, కీవ్, వాషింగ్టన్‌తో ఉన్నాయని.. దిల్లీ ఈ సౌలభ్యాన్ని వినియోగించుకొని శాంతికి బాటలు వేయవచ్చన్నారు.మరోవైపు ఈ యుద్ధంలో తమ వైఖరిని కూడా క్రెమ్లిన్ తేల్చిచెప్పింది. ఉక్రెయిన్‌లో తన లక్ష్యాలు సాధించేంత వరకు రష్యా సైనిక చర్యను కొనసాగిస్తుందని పెస్కోవ్ పేర్కొన్నారు. అమెరికా, ఐరోపా దేశాలకు దౌత్య పరిష్కారంలో ఆసక్తి లేదని విమర్శించారు. విదేశీ సైనిక నిపుణులు ఉక్రెయిన్‌లో చేపట్టిన యుద్ధ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఆరోపించారు.అమెరికా ఎన్నికలపై పెస్కోవ్ మాట్లాడుతూ ట్రంప్‌తో పోలిస్తే కమలాహారిస్‌ను అంచనావేయడం తేలికని పేర్కొన్నారు. ఇక ఉక్రెయిన్ మంత్రి వర్గంలో జరుగుతున్న మార్పులను జాగ్రత్తగా గమనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవేవీ శాంతి చర్చలపై పెద్దగా ప్రభావం చూపించవని అభిప్రాయపడ్డారు.

## అభివృద్ధి చెందుతున్న దేశాలకు సింగపూర్ ఓ నమూనా

సాధించేందుకు మనం సహకరించుకోవడం సంతోషంగా ఉంది. మంత్రుల స్థాయిలో నిర్వహించిన చర్చలు ఇందుకు ఓ మార్గనిర్దేశం అవుతాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధానిగా లారెన్స్ బాధ్యతలు చేపట్టిన తొలిసారి భేటీ అయ్యామని గుర్తుచేసిన మోదీ.. యువ నాయకత్వంలో సింగపూర్ మరింత పురోగతి సాధిస్తుందని ఆకాంక్షించారు.నైపుణ్య శిక్షణ, డిజిటలైజేషన్, మొబిలిటీ, తయారీ, సెమీకండక్టర్లు, ఏఐ, ఆరోగ్య సంరక్షణ, సైబర్ సెక్యూరిటీ తదితర రంగాల్లో సహకరించుకోవడంపై ఇరువురం చర్చించామని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



## యోగేశ్వర్‌దత్‌కు భాజపా మొండిచేయి

### టికెట్ ఇవ్వని కమలం పార్టీ

### రెజ్లర్ పోస్టు వైరల్

**దిల్లీ(జనంసాక్షి):** హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి, భంగపడ్డారు రెజ్లర్ యోగేశ్వర్ దత్ తాజాగా ఆయన ఒక కవిత రూపంలో ఆవేదనను వెళ్లగక్కారు. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందంటూ ఎక్స్(ట్విటర్) వేదికగా పోస్టు పెట్టారు.వచ్చేనెల అక్టోబర్ 5న హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 90 స్థానాలకుగానూ 67 చోట్ల బుధవారం భాజపా అభ్యర్థులు జాబితాను విడుదల చేసింది. అందులో యోగేశ్వర్‌దత్ పేరు లేదు. "ఎన్నికల్లో పోటీ చేయాలనే నా ఆకాంక్షను సీఎం, కేంద్ర నాయకత్వం వద్ద నేను వెలిబుచ్చాను. నేనొక క్రీడాకారుడిని. ఒలింపిక్ విజేతను. గతంలో భాజపా తరపున పోటీ చేశాను. కాబట్టి నాకు మరో అవకాశం రావాలని కోరుకుంటున్నాను" అని గతవారం ఈ రెజ్లర్ పోస్టు పెట్టారు. అయినాసరే ఆయనకు నిరాశే మిగిలింది. దాంతో తన బాధను వ్యక్తం చేస్తూ.. "నీ వ్యక్తిత్వం స్వచ్ఛంగా ఉన్నప్పుడు ఎందుకు ఇలాంటి పరిస్థితి..?నన్ను పరీక్షించే హక్కు నా ప్రత్యర్థులకు లేదు. మిమ్మల్ని మీరు కనుగొనేందుకు శోధన ప్రారంభించండి" అంటూ కవితాత్మకంగా ఒక వీడియోను షేర్ చేశారు. అంతర్జాతీయ వేదికలపై తన రెజ్లింగ్ ప్రత్యర్థులతో పోటీ పడిన దృశ్యాలను షేర్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో యోగేశ్వర్‌దత్‌కు భాజపా రెండుసార్లు అవకాశమిచ్చింది. 2019లో బరోడా సీటు నుంచి టికెట్ ఇచ్చింది. (హరియాణలోని సోనేపత్ జిల్లాలో బరోడా పేరుతో ఒక అసెంబ్లీ నియోజకవర్గముంది) అయితే ఆయన కాంగ్రెస్ అభ్యర్థి క్రిషన్ హుడా చేతిలో ఓటమి చవిచూశారు. హుడా మృతితో ఆ సీటు ఖాళీ కావడంతో జరిగిన ఉపఎన్నికల్లో మరోసారి యోగేశ్వర్ పోటీ చేశారు. ఆసారి కూడా హస్తం పార్టీ అభ్యర్థి ఇందురాజ్ నర్వాల్ చేతిలో పరాజయం పాలయ్యారు. రెండుసార్లు పార్టీకి విజయాన్ని సంపాదించిపెట్టలేకపోయిన ఆయన్ను ఆ కారణం చేతనే ఈసారి పక్కనపెట్టినట్లు తెలుస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ ఇద్దరు రెజ్లర్లకు టికెట్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. జులానా నుంచి వినేశ్ ఫొగాట్, బద్లీ నుంచి బజరంగ్ పునియాను నిలబెట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఆ పార్టీ కూడా త్వరలో అభ్యర్థుల జాబితాను విడుదల చేయనుంది.గత హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినేశ్ సోదరి బబితా 2019లో భాజపా (ఃఏఖ)లో చేరిన సంగతి తెలిసిందే. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో దాద్రి స్థానం నుంచి పోటీ చేసిన ఆమె.. ఓటమి పాలయ్యారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఆమెకు కమలం పార్టీ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు అదే స్థానం నుంచి వినేశ్‌ను దించాలని కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే ఈసారి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఫొగాట్ సిస్టర్స్ పోరు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారనుంది. ఈ రాష్ట్రంలో అక్టోబరు 8న ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి.



## పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

**పెద్దపల్లి,సెప్టెంబర్ 05(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉత్సవ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి రవీందర్ రెడ్డి సభా అధ్యక్షత వహించగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కే సదయ, సీనియర్ లెక్చరర్ రకీబ్ , ఏ రాజేందర్, జి నరసింహారాజు ఉపాధ్యాయ దినోత్సవం ప్రాధాన్యత గురించి ప్రస్తుత సమాజ స్థితిగతుల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## భావి ఉపాధ్యాయులు వృత్తి నిబద్ధతతో ముందుకు కదలాలి

- ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి
- మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమత రెడ్డి




**పెద్దపల్లి,సెప్టెంబర్ 05(జనంసాక్షి) :**
భావి ఉపాధ్యాయులుగా వెళ్లే మీరంతా వృత్తి నిబద్ధతతో విద్యార్థులను క్రమశిక్షణపరులుగా తీర్చిదిద్దే క్రమంలో ముందుకు కొనసాగాలని ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి అన్నారు.. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటి బిఈడి డిఈడి చాత్రోపాధ్యాయుల వార్షిక సమ్మేళనం వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు మొదట మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి దాసరి మనోహర్ రెడ్డి పుష్ప గుచ్చాలు సమర్పించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణకు మారుపేరు అని అందులో మహిళలు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులుగా రాసినవి ఇది అభినందించేదట పరిణామమని మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ మమతారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు ఈ కార్యక్రమంలో బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్లు రజనీ ,బుర్ర తిరుపతి, హరి రెడ్డమ్మ ,దిలీప్ శర్మ, మధుకర్ ,గోపి ,తిరుపతి ,రమేష్ ,సుజాత ,అనురాధ ,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉద్యమకారుల హడక్ కమిటీ కన్వీనర్‌గా వరాల దేవయ్య



**వేములవాడ(జనంసాక్షి):**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం వేములవాడలో జరిగిన కళాకారుల సమావేశమునకు రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వి యెల్ల పోశెట్టి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు . ముందుగా రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి జిల్లా ఉద్యమాకారుల అడ్ హాక్ కమిటీని ప్రకటించారు, జిల్లా కన్వీనర్ వారాల దేవయ్య, జిల్లా కో కన్వీనర్ బొడ్డు నారాయణ ,మారుపాక శంకర్, జిల్లా కో కన్వీనర్ మాన్వాడ లక్ష్మీనారాయణ, జిల్లా కో కన్వీనర్ బుర్రి శంకరయ్య, జిల్లా కో కన్వీనర్ కనపర్తి హన్మండ్లు ప్రకటించారు, అనంతరం ఎన్నికైన కళాకారులను నేరెళ్ల తిరుమల గౌడ్, బొజ్జ కనకయ్య, బొడ్డు రాములు, సావన పల్లి శ్రీనివాస్, డాన్స్ మాస్టర్ మారం ప్రవీణ్ యూట్యూబ్, కళాకారులు గుమ్మడి రాజేశం, వెదిరే రవి ,మిద్దె వినీత్, అన్నారపు హరీష్ ,చిలుముల రమేష్ పాల్గొనీ ఘనంగా సత్కరించారు. అలాగే ఈ నెల 8న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైతన్య యాత్రను విజయవంతం చేయలని కోరారు.

## గురుకుల జూనియర్ కాలేజీలో నేడు స్పాట్ అడ్మిషన్స్

### కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి

**వేములవాడ(జనంసాక్షి):**



వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్ లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ (ఎస్సీ) జూనియర్ కళాశాలలో నేడు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఎంపీసీలో 8, బైపీసీలో 4సీట్లు ఖాళీ ఉన్నట్లు, అర్హులగు విద్యార్థులు వారి విద్యార్హతలకు రెండు జిరాక్స్ సెట్లతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తెచ్చుకున్నట్లైతే వాటిని పరిశీలించి వెంటనే అడ్మిషన్ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

## వాసవి క్లబ్ ఆద్వర్యంలో రక్తదాన శిబిరం

పెద్దపల్లి,సెప్టెంబర్ 05(జనంసాక్షి) :
స్వర్గీయ డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణ జయంతిని పురస్కరించుకొని వాసవి క్లబ్ కెసిజిఎఫ్ కపుల్స్ ఆద్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పదిమంది దాతలతో శిబిరాన్ని చేపట్టినట్లు తెలిపారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఐపిసి ఎల్లంకి శ్రీనివాస్, క్యాబినేట్ కార్యదర్శి కజ్జపు భగవాన్, అధ్యక్షులు ముస్త్యాల సంతోష్, కార్యదర్శి గౌరిశెట్టి సాయిశివ, కోశాధికారి ఆంజనేయులు, డాక్టర్ కొమురవెల్లి భవాని, మంచాల వరప్రసాద్, పంపాటి శ్రీకాంత్, గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండు గ్రామాలకు రాకపోకలు బంద్

**ముస్తాబాద్ సెప్టెంబర్ 5 (జనంసాక్షి):**



కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా ఉన్న వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పోతుగల్ గన్నేవారిపల్లె గ్రామాల మధ్యన ఉన్న నక్క వాగు పై కొన్ని నెలల క్రితం మొదలుపెట్టిన వంతెన పనులు కొద్దీ రోజుల నుండి నత్తనడకన సాగుతున్నాయి. మొన్న కురిసిన వర్షాలకు నక్క వాగు ఉధృతంగా ప్రవహించడం వలన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుట్టలు తవ్వి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న కాంట్రాక్టర్, చూసి చూడనట్టు వివరిస్తున్న ఇంజనీర్, కనీసం బ్రిడ్జి పనులు చూడలేకపోవడం తూతూ మంత్రంగా పనులు కొనసాగుతున్నాయి చెక్ డ్యాం నుండి వాటర్ లీక్ అవుతున్న, విలేఖరి సమాధానానికి పొంతనలేని సమాధానం చెప్పడం జరిగింది, దీనికి సంబంధించిన అధికారులు ఇప్పటికైనా పనులు మంచిగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అంటున్నారు, ముస్తాబాద్ మండల నీకిరావడానికి ఇక్కట్లు తప్పడం లేదని గన్నేవారిపల్లె గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొచ్చేరువు మత్తడిని సందర్శించిన కలెక్టర్ గా న్నేవారిపల్లె వాహనదారులు సేవాలాల్ తండా మీదుగా తిరుగుకుంటూ ముస్తాబాద్ వెళ్లాలంటే 10 కి.మీ అదనంగా ప్రయాణించడం అవుతుందని అన్నారు. బ్రిడ్జి పనులు ముమ్మరంగా సాగి ఉంటే వరదలు వచ్చే సరికి పనులు పూర్తి అయ్యేవని అన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వలనే ఈ బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతుందని స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈ ఇరు గ్రామాల రైతులు వాగు అవతల వైపు ఉన్న పొలాలకు వెళ్లడానికి నానా తంటాలు పడుతున్నామని అన్నారు.

## కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించిన ఎంపీడీవో దివ్య దర్శన్ రావు

- నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశాలు

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 05(జనంసాక్షి) :**
మండలంలోని భూపతిపూర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు ఎంపీడీవో దివ్య దర్శన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దివ్య దర్శన్ రావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన నాణ్యత కూడిన భోజనాన్ని అందించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంటగది స్టోర్ రూమ్ కూరగాయలు కోడిగుడ్లు భోజనాన్ని పరిశీలించారు. శానిటేషన్ వైద్య సదుపాయం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో దివ్య దర్శనం సూచించారు. ఎలాంటి ఇబ్బందులు కలిగిన తనకు తెలిపాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తానని స్పష్టం చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని విద్యార్థులు అశ్రద్ధ చేయకుండా చదువుపై దృష్టి సారించాలని



అప్పుడే అనుకున్న లక్ష్యాలను అధిగమిస్తారని అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆయేషా తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి ఆకస్మిక తనిఖీ

వేములవాడ(జనంసాక్షి):
జిల్లాలోని జూనియర్ కళాశాలల తనిఖీ లో భాగంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ని గురువారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంటర్ విద్యాధికారి వై. శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రతి తరగతి గదిని సందర్శించి ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలిస్తూ విద్యార్థులతో బోధన తీరుని తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులతో సమావేశం నిర్వహించి, బట్టి విధానం కాకుండా విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని రాబోయే ఫలితాల్లో ,పోటీ పరీక్షలలో మంచి మార్కులు సాధించి కళాశాలకు , ఉపాధ్యాయులకు , తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ప్రథమ సంవత్సరము సైన్స్ లో జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు సాధించిన వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలు జె. రేణు శ్రీ, ఏ. గాయత్రి ,బి. శరణ్యలకు అధ్యాపకులు వి. జయ భారత్ రెడ్డి, ఏ. అరుణ కొనుగోలు చేసిన ఈ ఏ పి సెట్, నీట్ లకు సంబంధించిన పుస్తకాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి , కళాశాల ప్రిన్సిపల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఇంటర్ విద్యాధికారిని, కళాశాల ప్రిన్సిపల్ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి హెచ్.



శరత్ కుమార్, అధ్యాపకులు శేఖర్, అంజయ్య,జయ బారత్ రెడ్డి , మహేందర్, మహేందర్ రెడ్డి, సంతోష్, దేవయ్య, అశోక్, రవీందర్, గోపి , శ్రీనివాసరావు, లత, మంగమ్మ, అరుణ, స్వప్న, జ్యోతి, దీపిక , బోధనేతర సిబ్బంది దేవేందర్ ,రాజు, శ్రీధర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ సమితి అధ్యక్ష.కార్యదర్శులు నియామకం

గోదావరిఖని, జనంసాక్షి :
విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవ కమిటీ పేరుతో సామూహిక గణేష్ ఉత్సవాల కార్యక్రమాన్ని వైభవంగా హిందూ సమాజానికి జరపడం జరుగుతోంది. అందులో భాగంగా ప్రతి సంవత్సరం ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవడం ఆనవాయితీ. ఈ సంవత్సరం గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులుగా కురుమ సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆరెల్లి జలంధర్‌గౌడ్, కోశాధికారిగా చక్రపాణిని ఎన్నుకున్నారు. అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో భాగ్యనగర్ తరహాలో ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, కులాలకు, వర్గాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా అందరిని ప్రధాన చౌరస్తాలో ఏకంచేసి హిందూ సమాజాన్ని ఒకేవేదికపైకి తీసుకురావడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా హిందూ సమాజం ఈ సంవత్సరం పెద్ద ఎత్తున ఉత్సవాలు శుభకరంగా జరుపుకోవడానికి అన్నివేళల అందుబాటులో ఉంటామన్నారు. ఉత్సవాలలో ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఏదైనా సమస్యలు ఏర్పడిన ముందుండి ఉత్సవాలలో నడిపిస్తామని అధ్యక్ష,కార్యదర్శులు తెలిపారు. హిందూ సమాజమంతా సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆశిస్తున్నామన్నారు. రామగుండం కార్పొరేషన్‌లో గణపతి ఉత్సవాలపై కనీసం పాలకవర్గం




శ్రద్ధ చూపెట్టడం లేదని అన్నారు. సింగరేణి సంస్థ, ఎన్టిపిసి సంస్థ ఆర్ఎఫ్సిఎల్ సంస్థలు ఉత్సవంలో భాగమై సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ కార్యదర్శి అయోధ్య రవీందర్,ఈసంపల్లి వెంకన్న, మ్యాడగోని రవిందర్, నేరేడుకొమ్మ వెంకటస్వామి, పెన్నింటి శ్రీనివాసరెడ్డి, మోడం సురేందర్, ముష్కి సంపత్‌యాదవ్, బండ సమ్మన్న, పొన్నం అంజయ్య, కొండపర్తి లింగన్న, అడిగొప్పుల రాజు, పైతడి రాజు, మునగాల సంపత్, మేడగోని అరవింద్, అనిరుద్, భరత్,తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

## ఓసీపీలలో ఏఐటియుసి నేత కొమరయ్య వర్ధంతి: ఏఐటీయూసీ నాయకులు..

**గోదావరిఖని, జనంసాక్షి :**
బొగ్గు గని కార్మికుల పెన్షన్ ప్రదాత, సింగరేణి కార్మికుల పక్షపాతి, స్వాతంత్ర్య సమర యోధుడు వర్కర్స్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ మనుబోతుల కొంరయ్య 28వ వర్ధంతి సందర్భంగా గురువారం సింగరేణి ఆర్జీ-వన్ ఏరియాలోని గనులు, డిపార్ట్మెంట్లు, ఓసిపి-5 లో ఏఐటియుసి ఆర్జీ-వన్ బ్రాంచి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురయ్య చిత్ర పటాలకు నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం పాల్గొని మాట్లాడుతూ కొమురయ్య బొగ్గు గని కార్మికులకు చేసిన సేవలను కొనియాడారు. బొగ్గు గని కార్మికులకు పెన్షన్ ఉండాలనే హక్కును సాధించిన మహానేత కొమురయ్య అని వారు పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టిన మహా నాయకుడు కొమరయ్య అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, మాదన మహేష్, రంగు శ్రీనివాస్, ఎస్ వెంకట్ రెడ్డి, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్,దొంత సాయన్న,



ఎం.చక్రపాణి, సిర్ర మల్లికార్జున్, ఆకునూరి శంకరయ్య, బోయిన స్వామి, మిట్ట శంకర్, సోహెల్ , చెప్యాల భాస్కర్, ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, పి.నాగేంద్ర కుమార్, కారంపూడి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, మోదుల సంపత్, బలుసు రవి, బండి మల్లేశ్, దాసరి అనిల్, వేముల అశోక్, భాస్కర్, పెరుమాండ్ల రమేష్, ఆరెల్లి రాజేశ్వరరావు, పొన్నం రంజిత్, ఎం.సత్యనారాయణ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం..

**గోదావరిఖని, జనంసాక్షి :**
ఉపాధ్యాయ దినోత్సవ సందర్బంగా ఆర్జీ-1 సెక్టర్-2 సింగరేణి హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఆర్జీ-1పర్సనల్ మేనేజర్, పాఠశాల కరస్పాడెంట్ కిరణ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ముందుగా సర్వేపల్లి రాధా కృష్ణ ఫొటోకు పూలదండ అలంకరించి కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా పాఠశాల కరస్పాడెంట్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో గురువు అనే పాత్ర చాలా కీలకమైనదని, తల్లితండ్రి, గురువు, దైవం అనే వాటిని ఎవరూ కూడా మరిచిపోకూడదన్నారు. ప్రతి విద్యార్థిని తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందన్నారు. ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయించే బాధ్యత గురువులపైన ఉంటుందని, అలాగే ప్రతి విద్యార్థి గురువుల మాట తూచా తప్పకుండా పాటించాలన్నారు. అంకిత భావంలో కష్టపడి చదివి, మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాని కొరకు కష్టపడితే విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పిఒ శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు స్వర్ణలత, కుమారస్వామి, శశికళ, పూర్ణచందర్, శ్రీనివాసు, శ్రీలత, సుజాత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి..



**గోదావరిఖని, జనంసాక్షి :**
స్థానిక శారదానగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకుని టీచర్స్-డే వేడుకలు గురువారం నిర్వహించారు. కళాశాల మినీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా అతిథిగా, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు. విద్యార్థులు అధ్యాపకుల పట్ల గౌరవాన్ని, అభిమానాన్ని, ప్రేమను చాటుకున్నారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా మాట్లాడుతూ దేశ భవిష్యతను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు కేక్‌కట్ చేసి అధ్యాపక బృందానికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



## ఆపిల్ కిడ్స్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం..

**గోదావరిఖని, జనంసాక్షి :**
సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని గోదావరిఖనిలోని ఆపిల్ కిడ్స్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆపిల్ కిడ్స్ డైరెక్టర్ ప్రిన్సిపాల్ గాలి సునీత ముఖ్యఅతిథిగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవించదగినదని విద్యార్థులను తీర్చిదిద్ది ఉత్తమ పౌరులుగా దేశానికి అందించే ఉపాధ్యాయ వృత్తిలో నిలబడడం గర్వకారణమని భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా బోధన అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఫర్జానా, అరుణ, సుస్మిత, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల వద్ద గట్టి పోలీసు నిఘా ఉంచాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 (జనం సాక్షి)**
ఈవీఎంల వద్ద గట్టి పోలీసు నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పోలీస్ మరియు రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో గల ఈవిఎమ్ గోడౌన్స్ ను గురువారం జిల్లా కలెక్టర్ సందర్శించి గోడౌన్ లో సీసీ కెమెరా పర్యవేక్షణలో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించి రిజిస్టర్ లో సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎ గోడౌను సందర్శించి ఈవీఎంల భద్రతను పరిశీలించడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ తదితరులు ఉన్నారు.



# క్రికెట్‌ను వదిలిపెట్టను..!



స్వదేశంలో శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు దూరమైన ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. గాయం కారణంగా తనకెంతో ఇష్టమైన ఫార్మాట్‌లో ఆడలేకపోతున్న స్టోక్స్ తన భవిష్యత్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాజాగా టెలిగ్రాఫ్ ఇంటర్వ్యూలో అతడికి 'వీడ్కోలు తర్వాత ఏం చేయబోతున్నారు?' అనే ప్రశ్న ఎదురైంది. అందుకు స్టోక్స్ ఏది ఏమైనా నేను జీవితంలోక్రికెట్‌ను అస్సలు వదిలి పెట్టనని అన్నాడు. ఇంగ్లండ్ క్రికెట్‌కు తరగని ఆస్తి అయిన స్టోక్స్ టెస్టులపైనే ఫోకస్ పెట్టాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడిన స్టోక్స్ వీడ్కోలు తర్వాత ఏం చేయాలి? అనే విషయంలో చాలా స్పష్టతతో ఉన్నాడు. 'క్రికెట్ ఆడడం ఆపేసినప్పుడు నా పరిస్థితిని ఊహించుకోలేను. ఆ తర్వాత నేను మళ్లీ క్రికెటర్‌గా కనిపించకపోవచ్చు. కానీ, కోచ్‌గా అవతారమెత్తే అవకాశం ఉంది. ఆటపట్ల నాకున్న ఇష్టమే అందుకు కారణమని అనుకుంటున్నా. ఒక్కసారి వీడ్కోలు పలికాక.. కొందరు క్రికెటర్ల జీవితాల్లో మార్పు తేవాలని భావిస్తున్నా' అని స్టోక్స్ వెల్లడించాడు. అంతేకాదు ఆస్ట్రేలియాతో జరిగే యాషెస్ సిరీస్ గురించి కూడా స్టోక్స్ మాట్లాడాడు. ప్రతి యాషెస్ సిరీస్ దేనికదే ప్రత్యేకం. ఆసీస్‌ను మేము తేలికగా తీసుకోవాలనుకోవడం లేదు. గెలుస్తామనే నమ్మకంతో మేము అక్కడికి వెళ్తాం' అని స్టోక్స్ చెప్పుకొచ్చాడు.

### ఆల్‌రౌండర్‌గా రికార్డు

ఈమధ్యే స్టోక్స్ టెస్టు క్రికెట్‌లో సంచలనం సృష్టించాడు. లార్డ్స్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో రెండు వికెట్లు తీసి అరుదైన క్లబ్‌లో చేరాడు. తద్వారా ఇంగ్లండ్ సారథి సుదీర్ఘ ఫార్మాట్‌లో 200 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. దాంతో, టెస్టుల్లో 6 వేల పరుగులు, రెండొందల వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. అతడి కంటే ముందు మేటి ఆల్‌రౌండర్లు గ్యారీ సోబర్స్, జాక్వెస్ కలిస్‌లు మాత్రమే ఈ ఫీట్ సాధించారు.

### వన్డే వరల్డ్ కప్(2019) ట్రోఫీతో స్టోక్స్

ఐదేండ్ల క్రితం ఇంగ్లండ్ తొలి వన్డే వరల్డ్ కప్ ముద్దాడంలో స్టోక్స్ పాత్ర మరువలేనిది. ఫైనల్లో న్యూజిలాండ్‌పై వీరోచిత హాఫ్ సెంచరీతో మ్యాచ్‌ను సూపర్ ఓవర్ తీసెకెళ్లిన స్టోక్స్.. తమ జట్టు కలను నిజం చేశాడు. అయితే.. ఆ తర్వాత వన్డేలకు వీడ్కోలు చెప్పేసిన అతడు 2023 వరల్డ్ కప్ కోసం యూటర్న్ తీసుకున్నాడు.

# రాజకీయాల్లోకి టీమిండియా ఆల్‌రౌండర్..!



భారత జట్టు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కొత్త అవతారంలో కనిపించనున్నాడు. ఇన్నాళ్లూ టీమిండియా తరఫున ఇరగదీసన జడ్డూ ఇక రాజకీయాల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమిలోని భారతీయ జనతా పార్టీలో జడేజా చేరాడు. ఈ విషయాన్ని ఆయన భార్య రివబ జడేజా సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. గురువారం తన భర్త కాషాయ పార్టీ సభ్యత్వం తీసుకున్న ఫొటోను రివబ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దాంతో, క్షణాల్లో ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. అభిమానులు జడేజా రాజకీయ అరంగేట్రంపై జోరుగా చర్చించుకుంటున్నారు. ఆల్‌రౌండర్‌గా బ్యాటుతో, బంతితో తన ముద్ర వేసిన జడేజా ఇక రాజకీయ మైదానంలో ఏ మేరకు ప్రభావం చూపిస్తాడు? అనేది మరికొన్ని రోజుల్లో తెలుస్తుందని మరికొందరు అనుకుంటున్నారు. అయితే.. ప్రస్తుతానికి బీజేపీ సభ్యత్వం తీసుకున్న జడేజా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తాడా? అనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది.

### లంక సిరీస్‌కు దూరం

ఈమధ్యే టీ20 వరల్డ్ కప్ గెలుపొందిన భారత జట్టులో సభ్యుడైన జడేజా ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. వరల్డ్ కప్‌లో పెద్దగా రాణించనందున శ్రీలంక పర్యటనకు అతడిని సెలెక్టర్లు పక్కన పెట్టేసిన విషయం తెలిసిందే. జడ్డూకు ప్రత్యామ్నాయంగా ఎంపికైన అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్‌గా మెప్పించాడు. దాంతో, ఇకపై జడ్డూ టెస్టులకే పరిమితం అవుతాడా? అనే ప్రశ్నలు జోరందుకున్నాయి. కానీ, దులీప్ ట్రోఫీకి ముందు గాయపడిన జడేజా నేరుగా బంగ్లాదేశ్‌తో రెండు సిరీస్‌లో బరిలోకి దిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో అతడి భార్య రివబ.. జడేజా రాజకీయాల్లోకి వస్తున్నాడంటూ పెట్టిన పోస్ట్ అందరినీ ఒకింత షాక్‌కు గురి చేసింది.

# అన్న లెక్కనే అపద్భాందవుడు..!



### సెంచరీతో మెరిసిన ముషీర్

భారత క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ తమ్ముడు దుమ్ము రేపుతున్నాడు. అచ్చం అన్న లెక్కనే దూకుడైన ఆటతో రెచ్చిపోతున్నాడు. అవసరమైన ప్రతిసారి ఆపద్భాందవుడి అవతారమెత్తి జట్టును ఆదుకుంటున్నాడు. ఇప్పటివరకూ రంజీల్లో, అండర్ –19 వరల్డ్ కప్‌లో దంచి కొట్టిన ముషీర్ ఖాన్.. ఇప్పుడు దులీప్ ట్రోఫీలోనూ తన ఆరంగేట్రాన్ని ఘనంగా చాటాడు. తొలి మ్యాచ్‌లోనే ఈ యంగ్‌స్టర్ శతకంతో సింహ గర్జన చేశాడు. పీకల్లోతు కష్టాల్లో పడిన 'ఇండియా బీ' జట్టును ముషీర్ తన సూపర్ సెంచరీతో ఒడ్డున పడేశాడు. 105 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ప్రత్యర్థి బౌలర్లకు వణుకు పుట్టించాడు. దులీప్ ట్రోఫీ ఆరంభ పోరులో 'ఇండియా బీ' బ్యాటర్లు తడబడ్డారు. చిన్నస్వామి స్టేడియంలో 'ఇండియా ఏ' బౌలర్ల ధాటికి టాప్ ఆటగాళ్లంతా డగౌట్ బాట పట్టగా.. 94 పరుగులకే 4 వికెట్లు పడ్డాయి. ఆ దశలో క్రీజులోకి వచ్చిన ముషీర్ అసాధారణ ఆటతో అదరగొట్టాడు. క్రీజులో పాతుకుపోయి.. ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టిన ముషీర్ సూపర్ శతకంతో ఆదుకున్నాడు. సీనియర్లు అభిమన్యు ఈశ్వరన్(13), సర్ఫరాజ్ ఖాన్(9), రిషభ్ పంత్(7)లు చేతులెత్తేసిన చోట.. ఇండియా ఏ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ జట్టు స్కోర్‌బోర్డును ముషీర్ నడిపించిన తీరు అమోఘం. టెయిలెండర్ నవ్‌దీప్ సైనీ(29 నాటౌట్)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అతడి సమయోచిత ఇన్నింగ్స్ కారణంగా ఇండియా బీ జట్టు 7 వికెట్ల నష్టానికి 202తో తొలి రోజును ముగించింది.

### ముంబై రంజీ హీరో

ఈ ఏడాది ముంబై జట్టు రంజీ ట్రోఫీని నిలబెట్టుకోవడంలో ముషీర్ పాత్ర మరువలేనిది. అలాగని అతడికి ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో పెద్దగా అనుభవం ఉందనుకునేరు. ఇప్పటివరకూ ముంబై తరఫున 5 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడంతే. విదర్భతో జరిగిన ఫైనల్లో ఈ యంగ్‌స్టర్ అదరగొట్టాడు.



## ఒలింపిక్ విజేతలకు ఘన స్వాగతం

పారాలింపిక్స్‌లో పతకాలతో మెరిసిన షట్లర్లకు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. పారిస్‌లో భారతావని గర్వపడేలా చేసిన పారా షట్లర్లు నిత్య శ్రీ శివన్, తులసిమతి మురుగేశన్, మనీష రామదాసులు గురువారం స్వరాష్ట్రమైన చెన్నైలో అడుగుపెట్టారు. విమానాశ్రయంలో దిగగానే ఈముగ్గురికి చప్పట్లతో అభినందనలు తెలిపి.. అనంతరం పూల దండలతో స్వాగతించారు. సొంతగడ్డపై అపూర్వ స్వాగతానికి ఫిదా అయిన షట్లర్లు సంతోషం పట్టేలేకపోయారు. ఆ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. పారిలింపిక్స్ మహిళల సింగిల్స్‌లో మనీష రామదాసు కాంస్యంతో చరిత్ర సృష్టించింది. పతకం సాధించిన తొలి పారా షట్లర్‌గా రికార్డు నెలకొల్పింది. సెమీస్‌లో తులసీమతి చేతిలో కంగుతిన్న మనీష.. కాంస్య పోరులో డెన్మార్క్ షట్లర్ క్యాథరిన్ రొసెన్‌గ్రెన్‌ను 21–12, 21–8తో ఓడించింది. తద్వారా 19 ఏండ్ల మనీష బ్యాడ్మింటన్‌లో తొలి పతకం గెలిచిన పారా షట్లర్‌గా రికార్డు సాధించింది. ఆ కాసేపటికే తులసీమతి వెండితో మెరిసింది. చైనాకు చెందిన యాంగ్ గ్జిక్జియా చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. ఇక నిత్య శ్రీ సివన్ మహిళల ఎస్‌హెచ్6 విభాగంలో కాంస్యంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది.



## ఏడు పరుగులకే రిషబ్ పంత్ ఔట్

**బెంగుళూరు (జనంసాక్షి):**

దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు ఇవాళ ప్రారంభం అయ్యాయి. బెంగుళూరులో ఇండియా, ఇండియా బీ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఇండియా ఏ జట్టు ఫీల్డింగ్ ఎంచుకున్నది. ఫస్ట్ బ్యాటింగ్ చేస్తున్న ఇండియా బీ జట్టు ఇప్పటికే అయిదు కీలక వికెట్లను కోల్పోయింది. 38 ఓవర్లలో అయిదు వికెట్ల నష్టానికి 84 రన్స్ చేసింది. దాదాపు 634 రోజుల విరామం తర్వాత మళ్లీ దేశీయ లీగ్ ఆడుతున్న రిషబ్ పంత్.. కేవలం ఏడు పరుగులు చేసి ఔటయ్యాడు. ఇండియా బీ జట్టులో యశస్వీ జైస్వాల్ 30, ఈశ్వరన్ 13, సర్ఫరాజ్ 9, నితీశ్ కుమార్ రెడ్డి సున్నా పరుగులకే నిష్క్రమించారు. ప్రస్తుతం ముషీర్, సుందర్ క్రీజ్‌లో ఉన్నారు.

# విద్యాభివృద్ధికి 21 వేల కోట్ల నిధులు

- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి త్రిసభ్య కమిషన్ ఏర్పాటు
- అన్ని జిల్లాల్లో సమీకృత పాఠశాలలు
- ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 5 (జనం సాక్షి):

మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యా బోధన చేయాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, వందేమాతర గీతం ఆలాపనతో కార్యక్రమాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 39 మంది ఉపాధ్యాయులకు శాలువా, మెమొంటో, ప్రశంస పత్రాలతో శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి, పరిగి, తాండూర్, చేవెళ్ల శాసనసభ్యులు టి. రామ్మోహన్ రెడ్డి, బి. మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి లతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సభాపతి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లు విద్యా ప్రాముఖ్యతను గుర్తించి ఎన్నో అద్భుతాలను సృష్టించారన్నారు. ఆ మహనీయులను స్మరించుకుంటూ విద్య పట్ల ఆసక్తిని పెంచాలని సభాపతి తెలిపారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అనే నానుడి ఉంది అంటే ఉపాధ్యాయుల పట్ల సమాజంలో ఎంత గౌరవం ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చని ఆయన అన్నారు. ఏ దేశ భవిష్యత్తు అయిన తరగతి గదుల్లోనే ప్రారంభమవుతుందని, సమాజానికి ఉపయోగపడే గురువుకు మన సమాజంలో ఎంతో గుర్తింపు ఉంటుందని, జీవితాలను మలుపుతిప్పే శక్తి గురువులకే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మనకు విద్యాబోధనలు అందించి, మన ఎదుగుదలకు కారకులైన గురువులను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చెబుతూ... తను చదువుకున్న రోజుల్లోనీ జోసెఫ్, లెక్కల మాస్టారును స్పీకర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యాబుద్ధులను నేర్పించి ఆర్థికంగా, రాజకీయంగా, ఉన్నత స్థాయి ఉద్యోగులుగా తీర్చి దిద్దిన ఘనత ఉపాధ్యాయులదేనని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 26 వేల పాఠశాలల్లో 20 లక్షల మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని, ఇందులో ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు చదువుకుంటారని ఆయన తెలిపారు. విద్యాభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తూ బడ్జెట్లో 21 వేల కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని స్పీకర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో 20 ఎకరాలకు స్థలానికి తగ్గకుండా భూములను ఎంపిక చేసి సమీకృత పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూపకల్పన చేస్తుందని ఆయన అన్నారు. ప్రైవేటు రంగాలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని విధాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వం విద్య, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ.. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి దిశగా తీసుకు వెళ్లేందుకు త్రిసభ్య విద్యా కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెల కోల్పడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని, పరిశ్రమలు రావడం వల్ల నిరుద్యోగ యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ..జీవితంలో విద్యకు మించింది ఏది లేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, మార్పులకు అనుగుణంగా తమ జీవితాలను గొప్పగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులే ముందు బాగానా నిలుస్తారని తెలిపారు. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ... సమాజంలో మనము ఎంతటి స్థాయిలో ఉన్నప్పటికీ అలా ప్రభావితం చేసిన ఉపాధ్యాయులే గొప్పవారు అన్నారు. ఉపాధ్యాయులు ఇచ్చినటువంటి చదువు వంటి ఆస్తివలెను ఇతర దేశాల్లో కూడా భారతీయులు మెరుగ్గా పనిచేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పరిగి శాసనసభ్యులు టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. తాండూరు శాసనసభ్యులు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులను అత్యున్నత స్థాయిలో చేర్చేది ఉపాధ్యాయులేనన్నారు. ఉపాధ్యాయ వృత్తి అంటే గౌరవానికి ప్రతీక అని తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీవో వాసు చంద్ర, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సమాజ నిర్మాణానికి గురువులు మూలం

### ఉపాధ్యాయ ఎంఎల్‌సి కూర రాఘోత్తం రెడ్డి

### ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):**

సమాజ నిర్మాణానికి గురువులు మూలమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రాఘోత్తం రెడ్డి అన్నారు... ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో బుధవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూరా రాఘోత్తం రెడ్డి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతిని పురస్కరించుకొని మనం ప్రతి ఇయర్ కూడా సెలబ్రేట్ చేయడం జరుగుతోంది. ఆయన జీవితం కూడా మనందరం కూడా ఒక ఆదర్శప్రాయాన్ని జీవితంతో ఒక వైస్ ప్రెసిడెంట్ స్థాయి వరకు కూడా ఆయన వెళ్లడం మన అందరికి కూడా ఇన్స్పిరేషన్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మనందరిని ప్రేరణపరచిన, మనకు జీవన పాఠాలు నేర్పిన గురువులను స్మరించుకోవాలన్నారు. గురువు తన విద్యార్థుల జీవితాలలో కాంతి చూపించే దీపం. వారి మార్గనిర్దేశం మన భవిష్యత్తును సాకారం చేసే శక్తిని ఇస్తుంది. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు నేర్పించే వారు కాక, మంచి విలువలను, ఆలోచనలను, జీవితంలో విజయవంతం కావడానికి కావలసిన మార్గాలను కూడా నేర్పిస్తారన్నారు. టీచర్ ఎమ్మెల్సీ మాట్లాడుతూ..గురువు అంటే "మార్గదర్శి, నిపుణుడు, ఉపాధ్యాయుడు అని భారతీయ సంప్రదాయంలో గురువు అందరికంటే కంటే ఎక్కువ. సాంప్రదాయకంగా, గురువు శిష్యుడికి లేదా విద్యార్థికి గౌరవప్రదమైన వ్యక్తి. గురువు శిష్యునికి జీవిత విలువలను నేర్పించే బోధకుడు, సాహిత్య జ్ఞానంతో పాటు, తన అనుభవ జ్ఞానాన్ని పంచేవాడు, విద్యార్థి జీవితంలో ఒక ఆదర్శ వ్యక్తి, స్ఫూర్తిదాయకమైన వ్యక్తి అని కొనియాడారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు మెమెంటో, శాలువా తో సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్య అధికారి రాధా కిషన్,మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మండల విద్యాధిరులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల తర్వాత గురువులే దైవం

### ఎంపీ రఘు నందన్ రావు, కలెక్టర్ క్రాంతి



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 5(జనం సాక్షి)**

మన భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత గురువు లనే దైవంగా భావిస్తామని, స్వామి వివేకానంద చెప్పినట్లు ఏ దేశ భవిష్యత్తు అయినా తరగతి గది లోని నాలుగు గోడల మధ్యనే నిర్మించబడిందని జిల్లా కలెక్టర్ క్రాంతి, పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు కలెక్టర్ క్రాంతి వల్లూరు, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు మాట్లాడుతూ గురువులు దేవునితో సమానమని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతోమంది ప్రస్తుతం సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని, సమాజం బాగు కోసం అందరి పిల్లలు తమ పిల్లలుగా భావించి ఈ దేశ నిర్మాణంలో పాలు పంచుకుంటున్నటువంటి ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత జీవితంలో మంచి చెడు నేర్పించి వారికి విద్యను నేర్పించి ఉన్నత స్థానంలో నిలబెట్టి తీర్చి దిద్దే ప్రత్యేక స్థానం ఉపాధ్యాయులదేనని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పనల చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు ఖైరతాబాద్ లంబోదరుడు సిద్ధం

### ఈసారి 70 అడుగుల విగ్రహం

### ప్రధమ పూజలో పాల్గొననున్న రాష్ట్ర గవర్నర్, సీఎం

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 05 (జనం సాక్షి)**

గణేష్ ఉత్సవాలకి భాగ్యనగరం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఖైరతాబాద్ భారీ గణనాథుడు భక్తులకు దర్శనం ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. రాష్ట్రంలోని ఎంతో గుర్తింపు ఉన్న ఖైరతాబాద్ గణనాథుడు ఉత్సవాలకు సిద్ధమవుతున్నాడు. ఈసారి పూజల్లో రాష్ట్ర గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డిలు విచ్చేయను న్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్రంలోనే ఎంతో పేరుగాంచిన ఖైరతాబాద్ గణనాథుడు వేడుకలకు కమిటీ ప్రతి ఏట మాదిరిగానే ఈసారి గణనాథుడు వేడుకలను ఘనంగా నిర్వహించేం దుకు ప్రత్యేక ఏర్పాట్లను చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా భారీ గేట్లను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ గణనాథుడు ఉత్సవాలు ప్రారంభమై 70 సంవత్సరాలు పూర్తి చేసుకుంటు న్న సందర్భంగా ఈసారి 70 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఏడు అంకెలకు ప్రాధాన్యత ఇస్తూ ఏడు తలలు,7 సర్పాలు ఒకవైపు ఏడిసి చొప్పున మొత్తం 14 చేతులతో గణేష్ ప్రతిమను తయారు చేశారు. సుమారు రూ. 80 లక్షల ఖర్చు తో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహం తయారీకి 30 టన్నుల స్టీలు,10 లారీల ఇసుక,80 కిలోల సుతిలితాడు, ఒండువేల గోనె సంచులతో పాటు గుజరాత్ నుండి తీసుకువచ్చిన 30 కిలోల వెయ్యి సంచుల మట్టిని విగ్ర నిర్మాణానికి వాడారు. దాదా పు 250 మంది కళాకారులు విగ్రహ తయారీలో పాలుపంచుకున్నారు. ఈసారి పిఓపి లేకుండానే సహజ రంగు మట్టిని వాడారు. భారీ గణనాథుడి తోపాటు ఏట ప్రముఖ ఆలయాన నమూనా సిటిం గును ఏర్పాటు చేశారు. తిరుమల తిరుపతి, అరుణాచలం, విజయవాడ కనకదుర్గ ఆలయ నమూనాతో పాటు అయోధ్య రామ మందిరం కూడా నిర్మించారు.



### ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

గణేష్ ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజ కార్యక్ర మాలను ఏర్పాటు చేశారు. శివపార్వతుల కళ్యా ణం, శ్రీనివాస కళ్యాణం, 70 హోమ గుండాలు, రుద్ర యాగం, గణపతి యాగంను ఏర్పాటు చేస్తు న్నారు. స్వామి భక్తులు లక్ష రుద్రాక్షలు తెచ్చి గణేష్ మెడలో వేయనున్నారు.

### ప్రధమ పూజల్లో గవర్నర్, సీఎం

ఖైరతాబాద్ భారీ గణనాథుడు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల ప్రధమ పూజల్లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌లు విచ్చేయనున్నట్లు అడక్ కమిటీ చైర్మన్ సింగారి రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు మహేష్ యాదవ్ తెలిపారు. ఉత్సవాలు ఎలాంటి ఇబ్బందులు కలకుండా పలువురు విద్యార్థులు వాలంటరీగా పాల్గొంటారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిసిపి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
06 సెప్టెంబర్ 2024

# వరదలపై బీఆర్ఎస్ బురద రాజకీయాలు

- విమర్శించడమే బీఆర్ఎస్ నాయకులకు పని
- ట్విట్టర్‌లో విషం చిమ్ముతున్న కెటిఆర్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** వరదలపై బీఆర్ఎస్ పార్టీ బురద రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపణలు చేశారు. వరద కష్టాల్లో కూడా కల్వకుంట్ల కుటుంబానికి రాజకీయాలే కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్ సీఎల్పీ మీడియా హాల్లో ఆది శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడమే బీఆర్ఎస్ నాయకులకు పనిగా మారిందని మండిపడ్డారు. అనుకోని విపత్తు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించకుండా విమర్శలు చేస్తారా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.సహాయక చర్యలపై ప్రభుత్వానికి సలహా, సూచనలు ఇవ్వ కుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి కేటీఆర్ అమెరికాలో ఎంజాయ్ చేస్తూ ట్విట్టర్‌లో విషం చిమ్ముతున్నారని ఆరోపణలు చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ అడ్రస్ ఇప్పటి వరకు తెలియదని ఆక్షేపించారు. కేసీఆర్ ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో ఉన్నారా లేక నంది నగర్‌లో ఉన్నారా అని ఆది శ్రీనివాస్ నిలదీశారు. వరద బాధితుల కుటుంబాలకు కనీసం సంతాపం కూడా తెలపనంత బిజీగా కేసీఆర్ ఉన్నారా అని ప్రశ్నించారు. బాధ్యతాయుత ప్రతిపక్ష నేతగా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వడానికి కూడా నోరు రావడం లేదా అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకుని మాజీ మంత్రి హరీష్‌రావును జనం పైన దాడికి పంపించారని ఆది శ్రీనివాస్ విమర్శలు చేశారు. ఖమ్మంలో బాధితులను పరామ ర్శించకుండా హరీష్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. హరీష్?రావు వైఖరి కారణంగా అక్కడ గందరగోళం చోటు చేసుకుందని చెప్పారు. హరీష్‌రావు నోరు తెరిస్తే రాజకీయం తప్ప మరొకటి లేదని ఆక్షేపించారు. గతంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు విదేశీ కుట్ర అని కేసీఆర్ తప్పించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. క్లౌడ్ బరస్ట్ ద్వారా భారీ వర్షాలు కురిపిస్తున్నారంటూ నోటీకొచ్చినట్లు అబద్దాలు చెప్పారని విమర్శించారు. ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యం అంటూ కొడుకు, అల్లుడుతో కేసీఆర్ విష ప్రచారం చేయిస్తున్నారని ఆది శ్రీనివాస్ ౖ÷ర్ అయ్యారు. గత పదేళ్లలో చాలాసార్లు వరదలు వచ్చినప్పుడు పరిహారం ఇవ్వకుండా పచ్చి మోసం చేశారని విమర్శలు చేశారు. గతంలో హైదరాబాద్‌లో వరదలు వచ్చినప్పుడు ఇంటికి రూ. 10 వేలు పరిహారం ఇస్తామని బాధితులను కేసీఆర్ దగా చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను ఫామ్ హౌస్ నుంచి బయటకు తీసుకువచ్చే ధైర్యం బీఆర్ఎస్ నేతలకు ఉందా అని సవాల్ విసిరారు. ప్రజలపై అంత ప్రేమ ఉంటే మాజీ మంత్రి కేటీఆర్ 18 గంటల్లో అమెరికా నుంచి రావొచ్చు కదా అని ఆది శ్రీనివాస్ సవాల్ విసిరారు. ప్రభుత్వం సహాయక చర్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రెండు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారని గుర్తుచేశారు. వర్షాల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందజేస్తున్నామని అన్నారు. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ. 10 వేలు ఇస్తున్నామని గుర్తుచేశారు. ప్రతి ఇంటికి రూ.10 వేల తక్షణ సాయం అందిస్తున్నామని ప్రకటించారు. చనిపోయిన గేదెలు, గొర్రెలు, మేకలకు కూడా సాయం అందజేస్తామని ఆది శ్రీనివాస్ తెలిపారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన ఈర్షతోనే ఏపీ సీఎం చంద్రబాబు బాగా పనిచేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశంసిస్తున్నారని అన్నారు. కేంద్రం నుంచి తక్షణ సాయం రూ. 20, 000 కోట్లు ఇవ్వాలని అడిగామని.. కానీ కేంద్రమంత్రులు సోది కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రాష్టానికి ప్రయోజనం లేకుండా పోయిందని ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వేముల వీరేశం విషయంలో పొరపాటు జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే వేముల పట్ల అమర్యాదగా వ్యవహారించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది

- వరద బాధితులకు ఉడతా భక్తిగా సహాయం
- బాధితులకు సరకులు పంపిణీ
- వాహనాలకు హరీష్ రావు జెండా




**సిద్దిపేట, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, వరద బాధితులకు సిద్దిపేట నుంచి ఉడత భక్తిగా సహాయం చేస్తున్నామని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. మానవ సేవయే మాధవ సేవ అని అందరూ ముందుకు వచ్చి వరద బాధితులకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయం వద్ద ఖమ్మం వరద బాధితులకు సరకులు పంపే వాహనాలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడారు. సహాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా పాలనా కాదు రాక్షస పాలన నడుస్తుందని, ముందుగా ప్రభుత్వం మేలుకుంటే మరింత ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశం ఉండేదని హరీష్ రావు చురకలంటించారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, ఎంపిలు, ఎంఎల్ సిల నెల వేతనం వరద బాధితులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ తరహాలో బిజెపి, మిగతా పార్టీల నాయకులు సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. తాము వరద బాధితులకు సహాయం చేయడానికి ఖమ్మం వెళ్తే తమపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడంతో పాటు కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. వరద బాధితులు కాంగ్రెస్ ప్రభుత్వం పై దుమ్మెత్తిపోశారని, సిఎం రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు ఎవరు భయపడరని హరీష్ రావు హెచ్చరించారు. బిఆర్ఎస్ కు వస్తున్న స్పందన ను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు దాడులకు తెగపడ్డారని ధ్వజమెత్తారు. బాధితులకు అన్నం, నీళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేక పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లు నీళ్లలో మునిగి పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## తాలిపేరు ప్రాజెక్టుకు మళ్లీ వరద



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యంతర ప్రాజెక్టుకు మళ్లీ వరద పోటెత్తుతోంది. జలాశయం ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన వర్షాలకు భారీగా ఇన్‌ప్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి 46 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తాలిపేరుతో పాటు చింతవాగు, రోటెంత వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏఈ ఉపేందర్ ప్రాజెక్టు వద్దకు చేరుకొని వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## అదుపు తప్పి కాలువలో బోల్తాపడ్డ లారీ

**నిజామాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** లారీ అదుపు తప్పి కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావుపల్లి చౌరస్తా వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి-అకోలా జాతీయ రహదారిపై డెగ్లూర్ తాలూకా, కోకల్‌గావ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావుపల్లి చౌరస్తా మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం అందుకున్న సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని లారీలో ఇరుక్కున్న వారిని బయటకు తీశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని పిట్లం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## సేంద్రియ, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనివ్వాలి

- త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి




**మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 05 (జనం సాక్షి):** కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి పర్యటనకు వచ్చిన త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డిని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అభినవ్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాలు,సేంద్రియ వ్యవసాయం సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించడానికి వచ్చిన త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి డ్రోన్ పథకం ద్వారా సులభతరమైన పద్ధతిలో వ్యవసాయం చేయడం కోసం సబ్సిడీ ద్వారా డ్రోన్ తదితర పరికరాలను అందజేయడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుత కాలంలో ప్రకృతి వ్యవసాయం చాలా అవసరమని, ఆర్గానిక్ పంటల సాగు ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరు సేంద్రియ ఎరువులు ద్వారా పండించిన పంటలను తీసుకోవడం వలన ఆరోగ్యంగా దృఢంగా ఉంటారని ఆయన తెలిపారు. పూర్వకాలంలో ఇదే పద్ధతులను కొనసాగించారన్నారు. పడిపశు సంపద కలిగిన కుటుంబాలు చాల సంతోషంగా ఉంటాయని తెలిపారు. త్రిపుర ఇతర రాష్ట్రాలలో ఆర్గానిక్ పంటలకు అధిక ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. ప్రధానమంత్రి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని ఆయన చేసే ప్రతి కార్యక్రమాల్లో ఆర్గానిక్ తో కూడిన వంటకాలు భోజనం కల్పిస్తారని అన్నారు, అంతకుముందు డ్రోన్ టెక్నాలజీతో ఆధునిక వ్యవసాయ పద్ధతులను చేపడుతున్న గుర్రం మమత, కుంట అమృత చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆర్డీవో అలివేలు, కార్యక్రమం నిర్వాహకులు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హింసాత్మక ఘటనల నేపథ్యంలో జైనూర్ కర్ఫ్యూ

- నిషేధాజ్ఞలు అమలు

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ పట్టణంలో బుధవారం హింసాత్మక ఘటనలు జరగడంతో కర్ఫ్యూ విధించారు. ఓ ఆటో డ్రైవర్ అక్కడి గిరిజన మహిళపై లైంగిక దాడి చేయడానికి పూనుకోవడంతో ఈ ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ఆమె కులానికి చెందిన వారు నిరసనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.జైనూర్ లో బిఎన్ఎస్ఎస్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. అంతేకాక జిల్లాధికారులు జైనూర్ పట్టణంలో ఇంటర్నెట్ నిషేధం కూడా విధించారు. బూటకపు వార్తలు, వదంతులు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులో ఉంది. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్) కూడా మోహరించినట్లు ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. అక్కడ రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత బాగా పెరిగింది. ఒక వర్గం వారు మరో వర్గం వారిపై రాళ్ల దాడులకు పూనుకోవడం, ఆస్తులకు నష్టం కలిగించడం చేశారు. ఆగస్టు 31న ఆటో డ్రైవర్(45) ఓ గిరిజన మహిళ(31)పై లైంగిక దాడికి యత్నించడంతో పరిస్థితి విషమంగా తయారయింది. ఆటో డ్రైవర్ ఆమెను కర్రతో బాదడంతో ఆమె రోడ్డు మీదే స్పృహ తప్పి పడిపోయిందని సమాచారం. తర్వాత ఆమెను పోలీసులు జిల్లాలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స అందుతోంది. గిరిజన సంస్థలు బంద్ కు పిలుపునిచ్చాయి. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అంతేకాక గిరిజన పెద్దలతో మాట్లాడుతున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరపడానికి ఓ స్పెషల్ టీమ్ ను ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల వారిని శాంతియుతంగా ఉండమంటూ పోలీసులు పిలుపునిచ్చారు. నిందితుడిని అరెస్టు చేసి జుడీషియల్ కస్టడీకి అప్పగించారు.

## నగరంలో మరోమారు ఫుడ్ సేఫ్టీ దాడులు

- పలు రెస్టారెంట్లలో దాడులు..
- కాలం చెల్లిన పదార్థాలు గుర్తింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్‌లోని పలు రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. తెలుగు మీడియం రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలం చెల్లిన జ్యూస్‌లు, పుట్టగొడుగులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే రెస్టారెంట్ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన చికెన్, మటన్‌లను కనుగున్నారు. ఈ సందర్భంగా రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం రెస్టారెంట్ యాజమాన్యానికి షాకోజ్ నోటీసులు జారీ చేశారు. బిర్యానీలో వెంట్రుకులు వచ్చాయంటూ.. ఇటీవల ఓ కస్టమర్ ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జూబ్లీహిల్స్‌లోని పలు రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. అదీకాక సోమవారం బంజారాహిల్స్‌లోని పలు రెస్టారెంట్లపై తెలంగాణ కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీకి చెందిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ అధికారులు వరుస దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహారం ఆ యా రెస్టారెంట్లలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే వంటశాలలో గడువు తీరిన పలు ఆహార పదార్థాలను సైతం వినియోగి స్తున్నట్లు కనుగొన్నారు. అదే విధంగా పలు ఆహార పదార్థాల తయారీకి సంబంధించిన వస్తువులపై లేబుళ్లు లేకపోవడంతో రెస్టారెంట్ యాజమా న్యంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈ సంద్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ కేసు వాయిదా

- జిల్లా కోర్టు నుండి కేసీఆర్ సహా 8మందికి పంపిన నోటీసులు..
- అందులో ఆరుగురి తరుపున హాజరైన అడ్వకేట్స్..




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ కేసు వాయిదా పడింది. జిల్లా కోర్టు నుండి మాజీ సీఎం కేసీఆర్ సహా 8మందికి నోటీసులు పంపగా, అందులో ఆరుగురి తరుపున అడ్వకేట్స్ గురువారం జిల్లాకోర్టుకు హాజరయ్యారు. వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రానికి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి అనే సామాజిక కార్యకర్త జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై గత జనవరి 12న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ వేయడం జరిగింది. ఇందులో ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, హరీష్ రావు, రజత్ కుమార్, స్మిత సబర్వాల్, హరి రామ్, శ్రీధర్, మెగా కృష్ణారెడ్డి, ఎల్ అండ్ టి కంపెనీ ఎండి సురేష్ కుమార్ లపై కేసు వేయగా, వీరికి జిల్లా కోర్టు నుండి రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపారు. అయితే గురువారం కేసు విచారణకు రాగా, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, స్మిత సబర్వాల్ లకు నోటీసులు అందలేదని వారి తరుపున ఎవరు హాజరు కాలేదు. మాజీమంత్రి హరీష్ రావు తరపున అడ్వకేట్లు లలితారెడ్డి, సుకన్య, మెగా కృష్ణారెడ్డి తరుపున అడ్వకేట్ రజత్ కుమార్, ఎల్ అండ్ టి ఎండి సురేష్ కుమార్ తరపున సుప్రీంకోర్టు అడ్వకేట్స్ అవదాని, శ్రావణ్ రావు, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ల తరుపున అడ్వకేట్స్ హరి రామ్, శ్రీధర్, వరంగల్ అడ్వకేట్ నరసింహారెడ్డిలు కోర్టుకు హాజరయ్యారు. అయితే మాజీ సీఎం కేసీఆర్, స్మిత సభర్వాల్ ల తరుపున ఎవరు కాకపోవడంతో వారికి సమన్లు జారి చేసి, జిల్లా కోర్టు జడ్జి నారాయణ బాబు ఈ కేసు విచారణను తిరిగి అక్టోబర్ 17కు వాయిదా వేశారు.

## జైనూర్ ఘటనకు బాధ్యులెవరైనా శిక్షించాలి

- మస్జిద్, ముస్లిముల దుకాణాలపై దాడులు సరికాదు
- బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలి
- జమితతుల్ ఉలేమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్



**కరీంనగర్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో జరిగిన దాడుల ఘటనకు కారకులెవరైనా నిందితులను కఠినంగా శిక్షించాలని జమీయతుల్ ఉలేమా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మోహియోద్దీన్ డిమాండ్ చేశారు. ఓ మహిళపై వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడగా.. సంబంధంలేని వర్గానికి చెందినవారి దుకాణాలపై దాడులు చేయడం సరికాదన్నారు. ప్రార్థనా మందిరాలకు వెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం, వస్తువులను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల ను అదుపులోకి తెచ్చేం దుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఏజెన్సీ బందుకు పిలుపుని చ్చిన అంశంలో ఇంటలిజెన్స్, ఎస్‌బి నుంచి ముందస్తు సమాచారం ఎందుకు లేదని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని ఆయన అభిప్రాయ పడ్డారు. ఘటన జరిగి రెండురోజులు గడుస్తున్నా సర్కారు స్పందించడం లేదని, దాడులకు పాల్పడినవారిని వెంటనే గుర్తించాలని పేర్కొన్నారు. దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, దాడులకు గురైన బాధితులకు తక్షణ పరిహారంగా 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కాలిపోయిన దుకాణ సముదాయాలను నిర్మించి ఇవ్వాలని సూచిం చారు. సర్కారు యంత్రాంగం తక్షణ చర్యలకు ఉపక్రమించాలని, నేతలు, అధికారులు దాడి జరిగిన ప్రాంతంలో పర్యటించాలని కోరారు.

## ఎత్తుకు మించి ఎత్తుకెదిగిన విజయ్ భాస్కర్





**కర్నూల్ (జనంసాక్షి) :** ధనిక కుటుంబంలో జన్మించినా పేదల కష్టాలుచూసి వారికోసం పనిచేయాలనే దృఢసంకల్పంతో తుదకంటా ప్రజాపోరాటంలో నిలబడి అమరత్వం పొందిన కామ్రేడ్ విజయ్ భాస్కర్ అలియాస్ రమణ స్థూపం వద్ద కర్నూల్ జిల్లా కొణతలపాడు గ్రామంలో ఘనంగా నివాళు లర్పించారు. రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడిగా, పీపుల్స్‌వార్ పార్టీలో యాక్షన్ టీమ్ కమాండర్‌గా నల్లమలలో అజ్ఞాత జీవితాన్ని గడుపుతూ నిబద్ధతతో ప్రజల కోసం పనిచేశాడని ఈ సందర్భంగా రిటైర్డ్ టీచర్ హన్మంతు కొనియాడారు. చిన్నవయస్సులో నిరాడంబరతను అలవరుచుకుని సాహిత్య పఠనంతో సైద్ధాంతికంగా ఎదిగాడని గుర్తుచేశారు. ఆయన పనిచేసిన కాలం తక్కువే అయినా ఎత్తుకు మించి ఎత్తుకు ఎదిగి ప్రజా పోరాటాల్లో అనేక విజయాలు సాధించాడని పత్రికల ద్వారా తెలుసుకున్నట్టు హన్మంతు తెలిపారు. ప్రజాకంటకులను, ప్రజలను పీడించే భూస్వామ్య పెత్తందార్లను ఎదుర్కోవడంలో, వాళ్లను తుదముట్టించడంలో చేసిన కృషిని కొనియాడారు. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే వెంగల్‌రెడ్డిని ప్రజాభీష్టం మేరకు విజయ భాస్కర్ నేతృత్వంలో శిక్షించినట్టు పత్రికల ద్వారా తెలుసుకున్నామన్నారు. ఆయన మన మధ్య లేకపోయినా రమణ ఆశయాలను కొనసాగించాలని, తుదకంటా ఆశయాలు తీసుకెళ్లడమే విజయ్ భాస్కర్‌కు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో రమణ తల్లి సుజాత, సోదరుడు భానుశంకర్, డాక్టర్ రమేష్, డాక్టర్ నళిని, పౌరహక్కుల సంఘం నాయకులు సుభాన్, డిటిఎఫ్ నాయకుడు ప్రభాకర్, జర్నలిస్టు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## శివాజీ విగ్రహ తయారీలో అవినీతి

- అందుకే కూలింది : రాహుల్

**పుణె, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడానికి కారణం విగ్రహం తయారీలో శిల్పి అవినీతి ఉందని కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణలు చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కాంగ్రెస్ నాయకుడు పతంగ్ రావు కదం విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మహారాష్ట్రలోని సాంగ్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతేకాక పెద్ద నోట్ల రద్దు(డీ మానిటైజేషన్), తప్పుడు పద్ధతిలో జిఎస్ టి అమలు చేయడంపై కూడా ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలన్నారు. సింధుదుర్గ్ లోని రాజ్ కోట్ కోట వద్ద శివాజీ విగ్రహం కూలిపోయింది. ప్రధాని మోడీ గత వారం మహారాష్ట్ర సందర్శించి క్షమాపణలు కూడా కోరారు. 'మహారాష్ట్ర చక్రవర్తి మా ఆరాధ్య దైవం' అని కూడా అన్నారు. 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని మోడీ గత ఏడాది డిసెంబర్ 4న ఆవిష్కరించారు. కానీ ఆ విగ్రహం ఆగస్టు 26న కూలిపోయింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ ' ప్రధాని మోడీ కేవలం మహారాష్ట్ర రాజుకే కాదు రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి క్షమాపణలు చెప్పాలి' అన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370